www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 10-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 41 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా. 2.50 తదుపరి చవితి; నక్షత్రం: రోహిణి ఉ. 10.47 తదుపరి మృగశిర; వర్జ్యం: సా.4.15-5.49; దుర్ముహూర్తం: ఉ.8.21-9.12, మ.12.37-1.28; అమృతఘడియలు: ఉ.7.44-9.15, రా.1.38-3.12; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఒలింపిక్స్ నుంచి బజ్‌రంగ్ అవుట్

స్టార్ రెజ్లర్‌పై ఏడాది చివరిదాకా నిషేధం

వరల్డ్ రెజ్లింగ్ నిర్ణయం

న్యూఢిల్లీ: డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించిన టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, భారత స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియాపై వేటు పడింది. ఈ ఏడాది చివరి వరకు అతడు ఏ టోర్నీలోనూ పాల్గొనకుండా యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిషేధం విధించింది. దీంతో అతడి పారిస్ ఒలింపిక్స్ అవకాశాలు ముగిసినట్టే. ఇటీవలే జరిగిన ట్రయల్స్ సందర్భంగా డోపింగ్ పరీక్ష కోసం శాంపిల్ ఇచ్చేందుకు పూనియా నిరాకరించాడు. దీంతో గతనెల 23న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) అతడిపై తాత్కాలిక సస్పెన్షన్ విధించిన సంగతి తెలిసిందే. ఇక, తాజాగా ప్రపంచ సమాఖ్య అతడిపై ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించింది. దీంతో ఈ జూలైలో మొదలయ్యే విశ్వక్రీడల్లో బజ్‌రంగ్ పాల్గొనేందుకు అవకాశం లేదు. కాగా, బజ్‌రంగ్‌పై నాడా సస్పెన్షన్ గురించిన సమాచారం ఉన్నా.. విదేశాల్లో శిక్షణ తీసుకోవడానికి భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్) అతడికి రూ. 9 లక్షలు మంజూరు చేయడం గమనార్హం. అయితే, తాజా పరిస్థితుల నేపథ్యంలో తాను విదేశాలకు వెళ్లడం లేదని 30 ఏళ్ల పూనియా తెలిపాడు.



నీరజ్‌కు కఠిన సవాల్

నేడు డైమండ్ లీగ్

దోహా: టోక్యో చాంపియన్, స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కఠిన పరీక్ష ఎదురుకానుంది. శుక్రవారం జరిగే ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ తొలి అంచెలో డిఫెండింగ్ చాంప్‌గా నీరజ్ బరిలోకి దిగుతున్నాడు. చోప్రాకు సమవుజ్జీలైన ప్రపంచ మాజీ చాంపియన్ పీటర్స్ (గ్రెనెడా), ఒలింపిక్ పతక విజేత జాకబ్ వాల్డెజ్ (చెక్), యూరోపియన్ చాంప్ జూలియన్ వెబర్ లాంటి మేటి అథ్లెట్లు ఈసారి పోటీలో ఉన్నారు. దీంతో టైటిల్ నిలబెట్టుకోవడం నీరజ్‌కు ఒకింత సవాలే. ఇక, నీరజ్ సహచరుడు, ఆసియా క్రీడల రజత పతక విజేత కిషోర్ జనా కూడా తొలిసారి డైమండ్ లీగ్‌లో పోటీపడుతున్నాడు.

'నెదర్లాండ్స్'లో జ్యోతికి పసిడి



న్యూఢిల్లీ: తెలుగు అథ్లెట్ జ్యోతి ఎర్రాజి అంతర్జాతీయ వేదికపై స్వర్ణ పతకంతో మెరిసింది. నెదర్లాండ్స్‌లోని వాట్‌లో జరిగిన హ్యారీ షల్టింగ్ గేమ్స్‌లో జ్యోతి 100 మీటర్ల రేసులో చాంపియన్‌గా నిలిచింది. గురువారం రాత్రి జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ కేటగిరి ఈ ఈవెంట్ పోటీల్లో రేసును 12.87 సెకన్లలో ముగించి జ్యోతి అగ్రస్థానం దక్కించుకుంది. వైజాగ్‌కు చెందిన 24 ఏళ్ల జ్యోతికిది ఈ సీజన్ అవుట్‌డోర్ పోటీల్లో ఇదే తొలి విజయం కావడం విశేషం.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.
వేదిక: అహ్మదాబాద్

గుజరాత్ X చెన్నై

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (సి) రొసో (బి) అర్ష్‌దీప్ 92, డుప్లెసి (సి) శశాంక్ (బి) కావేరప్ప 9, విల్ జాక్స్ (సి) హర్షల్ (బి) కావేరప్ప 12, పటీదార్ (సి) బెయిర్‌స్టో (బి) కర్రాన్ 55, గ్రీన్ (సి) కర్రాన్ (బి) హర్షల్ 46, కార్తీక్ (సి) కర్రాన్ (బి) హర్షల్ 18, లోమ్రార్ (బి) హర్షల్ 0, స్వప్నిల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 241/7; వికెట్ల పతనం:** 1-19, 2-43, 3-119, 4-211, 5-238, 6-240, 7-241; **బౌలింగ్:** కావేరప్ప 4-0-36-2, అర్ష్‌దీప్ 3-0-41-1, కర్రాన్ 3-0-50-1, హర్షల్ 4-0-38-3, రాహుల్ చాహర్ 3-0-47-0, లివింగ్‌స్టోన్ 3-0-28-0.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్ (ఎల్బీ) స్వప్నిల్ 6, బెయిర్‌స్టో (సి) డుప్లెసి (బి) ఫెర్గూసన్ 27, రొసో (సి) జాక్స్ (బి) కర్ణ్ శర్మ 61, శశాంక్ (రనౌట్) 37, జితేశ్ (బి) కర్ణ్ శర్మ 5, లివింగ్‌స్టోన్ (సి) కర్ణ్ (బి) స్వప్నిల్ 0, కర్రాన్ (బి) ఫెర్గూసన్ 22, అశుతోష్ (ఎల్బీ) సిరాజ్ 8, హర్షల్ (సి) ఫెర్గూసన్ (బి) సిరాజ్ 0, రాహుల్ చాహర్ (నాటౌట్) 5, అర్ష్‌దీప్ (సి) కర్ణ్ (బి) సిరాజ్ 4, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 17 ఓవర్లలో 181 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-6, 2-71, 3-107, 4-125, 5-126, 6-151, 7-164, 8-170, 9-174, 10-181; **బౌలింగ్:** స్వప్నిల్ 3-0-28-2, సిరాజ్ 4-0-43-3, యశ్ దయాల్ 2-0-22-0, ఫెర్గూసన్ 3-0-29-2, జాక్స్ 1-0-5-0, గ్రీన్ 1-0-16-0, కర్ణ్ శర్మ 3-0-36-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	11	8	3	0	16	0.476
హైదరాబాద్	12	7	5	0	14	0.406
చెన్నై	11	6	5	0	12	0.700
ఢిల్లీ	12	6	6	0	12	-0.316
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
బెంగళూరు	12	5	7	0	10	0.217
ముంబై	12	4	8	0	8	-0.212
పంజాబ్	12	4	8	0	8	-0.423
గుజరాత్	11	4	7	0	8	-1.320

పంజాబ్ కథ ముగిసె..

బెంగళూరు ఘన విజయం

అదరగొట్టిన కోహ్లీ, పటీదార్

ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ ఆశలు సజీవం



1 ఐపీఎల్‌లో ఎక్కువసార్లు (4) 600+ పరుగులు సాధించిన బ్యాటర్‌గా రాహుల్‌తో సమంగా నిలిచిన కోహ్లీ.

ధర్మశాల: ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసు నుంచి పంజాబ్ కింగ్స్ నిష్క్రమించింది. అటు విరాట్ కోహ్లీ (47 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 92) మెరుపు ఇన్నింగ్స్‌కు, బౌలర్ల అద్భుత ప్రదర్శన తోడవ్వడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 60 పరుగుల తేడాతో పంజాబ్‌పై ఘనవిజయం సాధించింది. వరుసగా నాలుగో విజయాన్నందుకున్న ఆర్‌సీబీ 10 పాయింట్లతో ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. పంజాబ్ ఆడిన 12 మ్యాచ్‌ల్లో 8 పాయింట్లతోనే ఉంది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 241 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (23 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 55), గ్రీన్ (27 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 46) వేగంగా ఆడారు. హర్షల్‌కు మూడు, కావేరప్పకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 17 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. రిలీ రొసో (27 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 61), శశాంక్ (19 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 37) మాత్రమే రాణించారు. సిరాజ్‌కు మూడు.. స్వప్నిల్, ఫెర్గూసన్, కర్ణ్ శర్మలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు.

మధ్యలో వదిలేశారు: 242 పరుగుల భారీ ఛేదనలో రొసో ధాటికి పంజాబ్ ఇన్నింగ్స్ మెరుపు వేగంతో ఆరంభమైంది. కానీ అతడు క్రీజులో ఉన్నంత సేపు ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లిన పంజాబ్.. ఆ తర్వాత శశాంక్ దూకుడుకు 14 ఓవర్ల వరకు పోటీలోనే ఉంది. కానీ ఆ తర్వాత మిడిలార్డర్ వైఫల్యంతో పోటీలో లేకుండా పోయింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (6) తొలి ఓవర్‌లోనే అవుటైనా.. బెయిర్‌స్టో (27)తో కలిసి రెండో వికెట్‌కు రొసో 65 పరుగులు అందించాడు. నాలుగో ఓవర్‌లో రొసో 4,4,4,6తో 18 రన్స్ రాబట్టగా, బెయిర్‌స్టో 6,4తో చెలరేగాడు. తర్వాతి ఓవర్‌లోనూ బెయిర్‌స్టో రెండు ఫోర్లు బాదినా.. ఫెర్గూసన్‌కు చిక్కాడు. అటు రొసో మాత్రం తన జోరును ఆపకపోవడంతో 8.2 ఓవర్లలోనే జట్టు స్కోరు వందకి చేరింది. అతను కూడా 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ తొమ్మిదో ఓవర్‌లో 4,6 బాదాక రొసో ఇన్నింగ్స్‌కు కర్ణ్ శర్మ బ్రేక్ వేశాడు. జితేశ్ (5), లివింగ్‌స్టోన్ (0) నిరాశపర్చినా.. శశాంక్ రన్‌రేట్ తగ్గకుండా బ్యాట్‌కు పనిజెప్పాడు. అతడి వేగానికి 14 ఓవర్లలోనే స్కోరు 150కి చేరింది. కానీ కోహ్లీ సూపర్‌త్రోతో శశాంక్ రనౌటవడంతో పంజాబ్ వెనుకబడింది. మిగిలిన వికెట్లన్నీ చకచకా పడడంతో 17 ఓవర్లలోనే మ్యాచ్ ముగిసింది.

విరాట్-పటీదార్ మెరుపు ఆటతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు ఆదిలో వికెట్లు కోల్పోయినా.. పరుగుల వేటలో మాత్రం ఎక్కడా తగ్గలేదు. తొలి పది ఓవర్లలో రజత్ పటీదార్ ధాటికి 119/3 స్కోరు చేయగా.. వర్షం తర్వాత విరాట్ కోహ్లీ విధ్వంసంతో జట్టు 122/4 స్కోరు సాధించింది. అయితే కోహ్లీ 0, 10 పరుగుల వద్ద, పటీదార్ కూడా ఖాతా తెరవకుండానే ఇచ్చిన క్యాచ్‌లను పంజాబ్ ఫీల్డర్లు వదిలేయడం బెంగళూరుకు కలిసొచ్చింది. ఈ మూడుసార్లు కూడా అరంగేట్ర పేసర్ విద్వత్ కావేరప్ప బౌలింగ్‌లోనే కావడం గమనార్హం. అయితే కావేరప్ప తన వరుస ఓవర్లలో ఓపెనర్ డుప్లెసి (9), విల్ జాక్స్ (12)ను అవుట్ చేశాడు. ఆరో ఓవర్‌లో పటీదార్ మూడు ఫోర్లతో పవర్‌ప్లేలో జట్టు 56/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా ఆర్‌సీబీ జోరు తగ్గలేదు. ఏడో ఓవర్‌లో విరాట్, పటీదార్ చెరో సిక్సర్ బాదగా.. ఎనిమిదో ఓవర్‌లో పటీదార్ మూడు సిక్సర్లతో చెలరేగాడు. దీంతో స్కోరు 51 బంతుల్లోనే వందకు చేరింది. ఇక పదో ఓవర్‌లో సిక్సర్‌తో 21 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన పటీదార్‌ను కర్రాన్ అవుట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే భారీ వర్షంతో అర్ధగంటపాటు ఆటకు అంతరాయం ఏర్పడింది. అనంతరం 32 బంతుల్లో కోహ్లీ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇక 16వ ఓవర్‌లో కోహ్లీ 2 సిక్సర్లు, గ్రీన్ ఫోర్‌తో కర్రాన్ 21 పరుగులు ఇచ్చుకున్నాడు. అయితే 18వ ఓవర్‌లో 6,4తో సెంచరీ ఖాయమనిపించిన కోహ్లీ తృటిలో ఆ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. అర్ష్‌దీప్ కోహ్లీ వికెట్‌ను అర్ష్‌దీప్ తీయడంతో నాలుగో వికెట్‌కు 92 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ఇక 19వ ఓవర్‌లో ఆర్‌సీబీ 21 పరుగులు సాధించినా.. చివరి ఓవర్‌లో పేసర్ హర్షల్ మూడు పరుగులే ఇచ్చి దినేశ్ కార్తీక్ (18), లోమ్రార్ (0), గ్రీన్ (46) వికెట్లను తీశాడు. అయినా ఆర్‌సీబీ చివరి నాలుగు ఓవర్లలో 56 రన్స్ సాధించింది.

సిరీస్ క్లీన్‌స్వీప్

భారతిదే ఐదో టీ20



సిల్హట్: బంగ్లాదేశ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను భారత మహిళలు 5-0తో క్లీన్‌స్వీప్ చేశారు. గురువారం జరిగిన ఆఖరిదైన ఐదో మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 21 పరుగుల తేడాతో బంగ్లాను ఓడించింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 156 పరుగులు చేసింది. హేమలత (37), స్మృతి మంధాన (33), హర్మన్‌ప్రీత్ (30), రిచా ఘోష్ (28 నాటౌట్) రాణించారు. రబియా, నహీద చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో బంగ్లా ఓవర్లన్నీ ఆడి 135/6 స్కోరుకే పరిమితమైంది. రీతూ మోనీ (37) టాప్ స్కోరర్. రాధా యాదవ్ 3 వికెట్లు పడగొట్టింది.

కెప్టెన్సీ వదిలేస్తాడా?



రాహుల్‌పై లఖ్‌నవూ ఫ్రాంచైజీ అసంతృప్తి

న్యూఢిల్లీ: ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ ఓపెనర్ల బాదుడు.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ)కెప్టెన్ కేఎల్ రాహుల్ పదవికి ఎసరు తెచ్చేలా ఉంది. బుధవారం నాటి మ్యాచ్‌లో తమ జట్టు ఆడిన తీరుపై ఎల్‌ఎస్‌జీ యాజమాన్యం తీవ్ర అసంతృప్తితో ఉంది. ఘోర ఓటమి చెందాక జట్టు యజమాని సంజీవ్ గోయెంకా ఏకంగా మైదానంలోనే కెప్టెన్ రాహుల్‌తో సీరియస్‌గా మాట్లాడిన వీడియోలు దర్శనమిచ్చాయి. దీంతో ఆ జట్టు ఆడాల్సిన మరో రెండు మ్యాచ్‌లకు నాయకత్వ మార్పు ఉండవచ్చని సమాచారం. స్వచ్ఛందంగా కెప్టెన్సీ నుంచి తప్పుకొని బ్యాటింగ్‌పై దృష్టిసారించాలని రాహుల్ భావిస్తున్నాడట. 'తర్వాతి మ్యాచ్‌లో ఢిల్లీతో ఆడేందుకు లఖ్‌నవూకు నాలుగు రోజుల సమయం ఉంది. ఇప్పటికైతే స్పష్టత లేదు కానీ రాహుల్ తన బ్యాటింగ్‌పై దృష్టి సారించేందుకు కెప్టెన్సీ వదిలేసినా ఆశ్చర్యం లేదు. ఇందుకు మేనేజ్‌మెంట్ కూడా వ్యతిరేకించకపోవచ్చు' అని ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. తానాడిన 12 మ్యాచ్‌ల్లో 460 పరుగులు చేసినా.. రాహుల్ స్ట్రయిక్‌రేట్ 136.09 ఉండడం సమస్యగా మారింది. రూ.17 కోట్ల భారీ ధరతో రాహుల్‌ను లఖ్‌నవూ జట్టు రిటైన్ చేసుకున్న విషయం తెలిసిందే.

నిఖత్, ధీరజ్‌కు చేయూత

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌కు సన్నద్ధమవుతున్న తెలుగు అథ్లెట్లు నిఖత్ జరీన్, బొమ్మదేవర ధీరజ్, ఆకుల శ్రీజకు కేంద్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలోని మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంఓసీ) అండగా నిలిచింది. బాక్సర్ నిఖత్‌కు లేజర్ యూనిట్ కిట్ కొనుగోలు చేసేందుకు, ఆర్చర్ ధీరజ్‌కు క్రీడా సామగ్రికి, టీటీ ప్లేయర్ శ్రీజకు ఒలింపిక్స్ ముందు వివిధ పోటీల్లో పాల్గొనేందుకు అయ్యే ఖర్చులు భరించేందుకు ఎంఓసీ ఆమోదం తెలిపింది.

ఆరో రౌండ్లో అర్జున్‌కు డ్రా

వార్సా (పోలెండ్): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సూపర్‌బెట్ టోర్నీ ఆరో రౌండ్‌లో నోడిర్బెక్ అబ్దుస టోరోవ్ (ఉజ్బెకిస్థాన్)తో గేమ్‌ను అర్జున్ ఇరిగేసి డ్రా చేసుకున్నాడు. అంతకుముందు ఐదో రౌండ్లో కిరిల్ షెవ్‌చెంకో (ఉక్రెయిన్)పై అర్జున్ గెలిచాడు. ఆరో రౌండ్లో కార్ల్‌సన్‌తో గేమ్‌ను గుకేశ్ డ్రా చేసుకోగా, విన్సెంట్‌ను ప్రజ్ఞానంద ఓడించాడు. ప్రజ్ఞానంద 4వ, అర్జున్ 5వ, గుకేశ్ 6వ స్థానాల్లో కొనసాగుతున్నారు.

బిజినెస్

మారుతి కొత్త 'స్విఫ్ట్'



న్యూఢిల్లీ: ఆటో దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) సరికొత్త ఫీచర్లతో కొత్త స్విఫ్ట్ హ్యాచ్‌బ్యాక్ కారును మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కారు ధరలు రూ.6.49 లక్షల నుంచి రూ.9.64 లక్షల (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉన్నాయి. ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ మోడల్ అభివృద్ధి కోసం రూ.1,450 కోట్లు ఖర్చు చేసినట్టు కంపెనీ ఎండీ, సీఈఓ హిసాచి టకెయుచి చెప్పారు. పర్యావరణానికి హాని చేయని జెడ్ సీరిస్ 1.2 లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో ఈ హ్యాచ్‌బ్యాక్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. గుజరాత్ ప్లాంట్‌లో ఈ కొత్త మోడల్ స్విఫ్ట్ కారు తయారవుతుందన్నారు. ఇక తమ దృష్టి అంతా హ్యాచ్‌బ్యాక్ కార్లపైనే ఉంటుందన్నారు. 2030 కల్లా భారత్‌లో 40 లక్షల కార్ల ఉత్పత్తి తమ లక్ష్యమన్నారు. లీటర్ పెట్రోల్‌తో 25.75 కిలోమీటర్ల మైలేజీ, ఆరు ఎయిర్‌బ్యాగ్స్ ఈ కారు ప్రత్యేకతలు.

పసిడి రుణాలపై నగదు రూ.20,000 మించొద్దు: ఆర్‌బీఐ


న్యూఢిల్లీ: వ్యక్తిగత పసిడి రుణాలపై ఇచ్చే నగదు మొత్తం రూ.20,000 మించొద్దని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ).. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లకు సూచించింది. ఈ విషయంలో ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 269 ఎస్ఎస్‌ను తూచా తప్పకుండా పాటించాలని కోరింది. ఈ సెక్షన్ ప్రకారం ఏ వ్యక్తీ రూ.20,000కు మించి డిపాజిట్లను, రుణాలను నగదు రూపంలో ఆమోదించకూడదు. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీ పసిడి రుణాలపై ఆంక్షలు విధించిన కొద్ది వారాలకే ఆర్‌బీఐ ఎన్‌బీఎఫ్‌సీలకు ఈ సూచనలు జారీ చేయడం విశేషం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,160 ▼	66,150 ▼	88,700 ▲
ముంబై	71,502 ▼	65,496 ▼	82,342 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ

హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	573	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	గోదావరి	148
వరంగల్	140	విజయవాడ	148
కరీంనగర్	140	గుంటూరు	148
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	148
కర్నూలు	140	చిత్తూరు	147
విశాఖపట్నం	140		

ఢమాల్!



- 2 శాతానికి పైగా క్షీణించిన బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు
- రూ.7.34 లక్షల కోట్ల సంపద ఆవిరి
- లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి..

విదేశీ పెట్టుబడుల ఉపసంహరణే కారణం

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం భారీ నష్టాలను చవిచూశాయి. ఒక దశలో 1,132 పాయింట్లు పతనమై 72,334 స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. చివరికి 1,062.22 పాయింట్ల (1.45 శాతం) నష్టంతో 72,404.17 వద్ద స్థిర పడింది. నిఫ్టీ 345 పాయింట్లు (1.55 శాతం) క్షీణించి 21,957.50 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 నష్టపోగా.. ఎల్ అండ్ టీ షేరు 6.0 శాతం జారి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఏషియన్ పెయింట్స్ 4.68 శాతం క్షీణించగా.. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ షేర్లు మూడు శాతానికి పైగా నష్టపోయాయి. టాటా మోటార్స్, ఎం అండ్ ఎం, ఎస్‌బీఐ షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. చిన్న, మధ్యస్థాయి కంపెనీల షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.01 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.41 శాతం పతనమయ్యాయి. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులో రూ.7.34 లక్షల కోట్లకు పైగా తరిగిపోయి రూ.393.35 లక్షల కోట్లకు (4.71 లక్షల కోట్ల డాలర్లు) పరిమితమైంది.

21,750 వద్ద మద్దతు: మార్కెట్ మరింత క్షీణించేందుకే అధిక అవకాశాలు కన్పిస్తున్నాయని టెక్నికల్ నిపుణులంటున్నారు. నిఫ్టీ 22,300 తక్షణ మద్దతు స్థాయి దిగువకు పతనమైన నేపథ్యంలో స్వల్పకాలికంగా సూచీ మరింత దిద్దుబాటుకు లోనుకావచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సీనియర్ టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ నాగరాజ్ శెట్టి అన్నారు. అయితే, 21,750 స్థాయి వద్ద సూచీకి మద్దతు లభించవచ్చని, 22,100-22,200 వద్ద నిరోధం ఎదురుకావచ్చన్నారు.

15న గో డిజిటల్ ఐపీఓ: కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ గ్రూప్ పెట్టుబడులు కలిగిన గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 15న ప్రారంభమై 18న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,125 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్, వాటాదారులకు చెందిన 5.47 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

భారీగా తగ్గిన వెండి: విలువైన లోహాల ధరలు మరింత తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం గురువారం రూ.50 తగ్గి రూ.72,250 పలికింది. కిలో వెండి రేటు ఏకంగా రూ.1,500 తగ్గి రూ.83,200కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

మార్కెట్ పతనానికి కారణాలు..

- ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి పెరగడంతో ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా లాభాల స్వీకరణకు దిగుతుండటం మార్కెట్ భారీ క్షీణతకు ప్రధాన కారణం. ఎందుకంటే, ఈసారీ బీజేపీ అధికారంలోకి వస్తుందన్న బలమైన అంచనాల నేపథ్యంలో గడిచిన కొన్ని నెలల్లో మార్కెట్ భారీగా పుంజుకుంది. కానీ, ఇప్పటివరకు జరిగిన మూడు విడతల పోలింగ్‌లో ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గుతూ రావడంతో ఎన్‌డీఏ కూటమి గెలుపు, ఆధిక్యంపై మార్కెట్ వర్గాల్లో సందేహాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేయగలిగే హై నెట్‌వర్త్, సంస్థాగత ఇన్వెస్టర్లు పెద్దఎత్తున లాభాలు స్వీకరిస్తున్నారని, మళ్లీ పెట్టుబడి పెట్టేందుకు సరైన సమయం కోసం వేచిచూస్తున్నారని విశ్లేషకులు పేర్కొన్నారు.
- విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారీగా అమ్మకాలకు పాల్పడటం కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈనెలలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు మన మార్కెట్ నుంచి నికరంగా రూ.15,863 కోట్ల విలువైన పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. బుధవారం ఒక్కరోజే రూ.6,669 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్లను వెనక్కి తీసుకున్నారు.
- ప్రధాన కంపెనీల మార్చి త్రైమాసిక ఫలితాలు పర్వాలేదన్పించినా చాలా వరకు చిన్న, మధ్య స్థాయి కంపెనీల పనితీరు నిరాశాజనకంగా ఉండటం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.
- అమెరికన్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు జాప్యం కావచ్చన్న అంచనాలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతోపాటు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు మళ్లీ పెరుగుతుండటం సైతం ఈక్విటీ మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

ఎస్‌బీఐ లాభం రూ. 21,384 కోట్లు

త్రైమాసిక, వార్షిక లాభాలు రెండూ చారిత్రక గరిష్ఠమే



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కన్సాలిడేటెడ్ లాభం ఈ ఏడాది మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో 18 శాతం పెరిగి రూ.21,384.15 కోట్లుగా నమోదైంది. వడ్డీయేతర ఆదాయం ఇందుకు దోహదపడింది. ఏడాది క్రితం ఇదే కాలంతో పోల్చితే స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన త్రైమాసిక లాభం రూ.16,694.51 కోట్ల నుంచి రూ.20,698.35 కోట్లకు పెరిగింది. ఇదిలా ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కన్సాలిడేటెడ్ లాభం 20.55 శాతం పెరిగి రూ.67,084.67 కోట్లకు చేరినట్టు బ్యాంక్ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా చెప్పారు. 2022-23లో ఇది రూ.55,648.17 కోట్లుంది. త్రైమాసికంగాను, వార్షికంగాను కూడా బ్యాంక్ లాభం చారిత్రక గరిష్ఠ స్థాయి అని ఆయన చెప్పారు. వడ్డీయేతర ఆదాయం 24.41 శాతం పెరిగి రూ.17,369 కోట్లకు చేరడం ద్వారా బ్యాంకు లాభాల్లో వృద్ధికి గట్టి మద్దతు ఇచ్చిందన్నారు. ముఖ్యాంశాలు...

- రుణాల్లో 15 శాతం వృద్ధి ఏర్పడడంతో నికర వడ్డీ ఆదాయం 3.13% పెరిగి రూ.41,655 కోట్లకు చేరింది. అయితే నికర వడ్డీ మార్జిన్ మాత్రం 0.08% తగ్గింది.
- రుణ వృద్ధి కార్పొరేట్, వ్యవసాయం, రిటైల్, చిన్న వ్యాపారాలు సహా అన్ని రంగాలకు విస్తరించింది. కార్పొరేట్ రుణాల్లో 16 శాతం వృద్ధి నమోదైంది. కార్పొరేట్ రుణాల పరిమాణం రూ.4 లక్షల కోట్లుంది. ఇందులో ప్రైవేట్ కార్పొరేట్ల వాటా నాలుగింట మూడు వంతులు కాగా మిగతాది ప్రభుత్వ కార్పొరేట్లది.
- 2025 ఆర్థిక సంవత్సరంలో రుణ వృద్ధి 15 నుంచి 16% ఉంటుందని అంచనా. నికర వడ్డీ ఆదాయం కూడా ఇదే స్థాయిలో కొనసాగించాలని భావిస్తోంది.
- డిపాజిట్లలో వృద్ధి 11.13 శాతం ఉంది. ఈ ఏడాది 13 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.
- స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 2.78 శాతం నుంచి 2.24 శాతానికి తగ్గాయి. డిసెంబరు త్రైమాసికం చివరి నాటికి ఇవి 2.42 శాతం ఉన్నాయి.
- బ్యాంక్ మూలధన నిధుల నిష్పత్తి (సీఏఆర్) 14.28 శాతం ఉంది. 20 శాతం రుణ వృద్ధిని ఇది తట్టుకోగలుగుతుంది.
- బంగారు రుణాల పరిమాణం రూ.1.38 లక్షల కోట్లుంది. సమీప భవిష్యత్తులో ఎలాంటి సవాళ్లు కనిపించడంలేదు.

ఆయిల్ కంపెనీల బోనస్ బొనాంజా

ముంబై: రిఫైనింగ్ మార్జిన్లు తగ్గడంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల (ఓఎంసీ) లాభాలు నాలుగో త్రైమాసికంలో క్షీణించాయి. అయినప్పటికీ గురువారం ఫలితాలు ప్రకటించిన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ రెండూ బోనస్ షేర్లను ప్రకటించాయి. బీపీసీఎల్ తన వాటాదారుల వద్ద ఉన్న ప్రతి ఒక షేరుకు ఒక బోనస్ షేరును ప్రకటించగా హెచ్‌పీసీఎల్ ప్రతి రెండు షేర్లకు ఒక బోనస్ షేరును ప్రకటించింది. కంపెనీల డైరెక్టర్ బోర్డులు బోనస్ షేర్ల జారీకి ఆమోదం తెలిపాయి. ఇతర అనుమతులు పొందాల్సి ఉంది.

బీపీసీఎల్ లాభం 30 శాతం డౌన్: మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి బీపీసీఎల్ రూ.4,789.57 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.6,870.47 కోట్లతో పోల్చితే లాభం 30 శాతం తగ్గింది. ఇదే కాలంలో కంపెనీ టర్నోవర్ రూ.1.34 లక్షల కోట్ల నుంచి రూ.1.32 లక్షల కోట్లకు తగ్గింది. కాగా పూర్తి ఆర్థిక సంవత్సరపు లాభం రూ.26,858.84 కోట్లుంది. ప్రతి బ్యారెల్‌పై రిఫైనింగ్ మార్జిన్ 14.14 డాలర్లుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు రూ.21 తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. బోనస్ షేరును కూడా పరిగణనలోకి తీసుకున్నట్టయితే ఒక్కో షేరుపై రూ.10.5 గిట్టుబాటవుతుంది.

హెచ్‌పీసీఎల్‌దీ అదే బాట: రిఫైనింగ్ మార్జిన్ల క్షీణత కారణంగా జనవరి-మార్చి త్రైమాసికంలో హెచ్‌పీసీఎల్ కన్సాలిడేటెడ్ లాభం 25 శాతం క్షీణించి రూ.2,709.31 కోట్లుగా నమోదైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.3,608.32 కోట్లుగా ఉంది. నాలుగో త్రైమాసికంలో ప్రతి బ్యారెల్‌పై రిఫైనింగ్ మార్జిన్ 6.95 డాలర్లుంది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన మార్జిన్ 14.01 డాలర్లు. త్రైమాసిక టర్నోవర్ రూ.1.15 లక్షల కోట్ల నుంచి రూ.1.22 లక్షల కోట్లకు పెరిగింది. అయితే మార్చి 31వ తేదీతో ముగిసిన 2023-24 సంవత్సరం మొత్తానికి కంపెనీ రికార్డు స్థాయిలో రూ.16,041.61 కోట్ల లాభం ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.6,980.23 కోట్ల నష్టం నమోదు చేసింది. కాగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.16.50 తుది డివిడెండ్‌ను సిఫారసు చేసింది. బోనస్ షేరును పరిగణనలోకి తీసుకుంటే ఒక్కో షేరుపై 11 రూపాయలు గిట్టుబాటయినట్టవుతుంది. గతంలో ఇచ్చిన రూ.15 మధ్యంతర డివిడెండ్‌కు ఇది అదనం.

ఇఫ్కోతో మారుత్ డ్రోన్స్ జట్టు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 5 లక్షల ఎకరాల్లో డ్రోన్ల ద్వారా పిచికారీ కార్యకలాపాలు చేపట్టేందుకు ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో-ఆపరేటివ్ (ఇఫ్కో) లిమిటెడ్‌తో జట్టు కట్టినట్లు మారుత్ డ్రోన్స్ గురువారం ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా ఇఫ్కో అభివృద్ధి చేసిన పలు అగ్రి ఉత్పత్తుల పిచికారీ కోసం తమ సంస్థకు చెందిన ఆధునిక డ్రోన్లను ఉపయోగించనున్నట్లు మారుత్ వెల్లడించింది. వాతావరణంపై ఎరువుల ప్రభావాన్ని తగ్గించడంతోపాటు పంట దిగుబడిని పెంచేడమే ఈ ఒప్పందం లక్ష్యమని సంస్థ పేర్కొంది. డ్రోన్ల వినియోగం ద్వారా వ్యవసాయ రంగంలో కార్మికుల కొరత సమస్యను పరిష్కరించడంతో పాటు చాలా తక్కువ సమయంలో పని పూర్తి చేయవచ్చని మారుత్ డ్రోన్స్ సహ వ్యవస్థాపకులు, సీఈఓ ప్రేమ్ కుమార్ అన్నారు.

పీఎన్‌బీ లాభంలో మూడింతల వృద్ధి

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మార్చి త్రైమాసికంలో రూ.3,010 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది 16 త్రైమాసికాల గరిష్ఠం. మొండి బకాయిలు (ఎన్‌పీఏ) తగ్గడం, కీలక వ్యాపారాలపై ఆదాయాలు పెరగడం ఇందుకు దోహదపడింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ రూ.1,159 కోట్ల లాభం ఆర్జించింది. త్రైమాసికాదాయం కూడా రూ.27,269 కోట్ల నుంచి రూ.32,361 కోట్లకు పెరిగింది. త్రైమాసికంలో వడ్డీ ఆదాయం రూ.28,113 కోట్లు కాగా నికర వడ్డీ ఆదాయం రూ.10,363 కోట్లని బ్యాంక్ వెల్లడించింది. గత ఏడాది మార్చి త్రైమాసికంతో పోల్చితే స్థూల ఎన్‌పీఏలు 8.74 శాతం నుంచి 5.73 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.72 శాతం నుంచి 0.73 శాతానికి తగ్గాయి. ప్రావిజనింగ్ కూడా రూ.3,625 కోట్ల నుంచి రూ.1,958 కోట్లకు తగ్గింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద బ్యాంక్ రూ.1,20, 285 కోట్ల ఆదాయంపై రూ.8245 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2022-23 సంవత్సరంలో ఆర్జించిన రూ.2,507 కోట్లతో పోల్చితే నికర లాభం మూడు రెట్లు పెరిగింది. ఈ ఏడాది రుణాల్లో 11-12 శాతం, డిపాజిట్లలో 9-10 శాతం వృద్ధిని ఆశిస్తున్నట్టు బ్యాంక్ ఎండీ అతుల్ కుమార్ గోయెల్ తెలిపారు. క్యూఐపీ ద్వారా రూ.7,500 కోట్లు సమీకరించేందుకు బోర్డు అనుమతించిందని గోయెల్ అన్నారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 10-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 41
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
వరంగల్

పట్టు వదలని ఢిల్లీ పోలీసులు!

అమిత్ షా ఫేక్ వీడియో వ్యవహారంలో మధ్యంతర ఉత్తర్వులు ఎత్తేయాలని పిటిషన్
లంచ్‌మోషన్‌కు అనుమతి నిరాకరణ 11
కింది కోర్టులో పీటీ వారెంట్ వేసుకోండి: హైకోర్టు

ఓటేసిన బాలుడు!



మైనర్ కొడుకుతో తన ఓటును వేయించిన మధ్యప్రదేశ్ బీజేపీ నేత
వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ 10
విచారణకు ఆదేశించిన కలెక్టర్
ప్రిసైడింగ్ అధికారిపై సస్పెన్షన్ వేటు, బీజేపీ నేతపై ఎఫ్ఐఆర్ నమోదు

మీకైతే 15 నిమిషాలు.. మాకు

15 సెకన్లు చాలు



- ఒవైసీ సోదరుల మైండ్ బ్లాంక్ చేస్తాం
- నవనీత్ కౌర్ సంచలన వ్యాఖ్యలు 12
- 15 సెకన్లు కాదు.. గంట తీస్కోండి
- మేం భయపడేది లేదు: ఎంపీ అసద్

చిరంజీవి, వైజయంతీ మాలకు

పద్మవిభూషణ్ ప్రదానం



పద్మశ్రీలు స్వీకరించిన వేలు ఆనందాచారి, ఉమా మహేశ్వరి, కూరెళ్ల 9
రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా ప్రదానోత్సవం
హాజరైన ఉపరాష్ట్రపతి, ప్రధాని, రాంచరణ్, ఉపాసన



సరూర్‌నగర్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ



దిల్‌సుఖ్‌నగర్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి మహిళలతో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, పక్కన సీఎం రేవంత్‌రెడ్డి

రాజ్యాంగాన్ని మార్చడం..

దేశం ఆత్మపై దాడే

- పేదల హక్కులను లాక్కోవడమే బీజేపీ పని
- పదేళ్లలో మోదీ 22 మంది కోసమే పనిచేశారు
- రూ.16లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారు
- మేం గెలిచాక పేదలను లక్షాధికారులను చేస్తాం
- అన్ని పంటలకూ కనీస మద్దతు ధర అందిస్తాం
- ప్రతి పట్టభద్రుడికీ అప్రెంటిస్‌షిప్.. లక్ష సాయం
- మహిళల ఖాతాల్లో ప్రతి నెలా రూ.8,500 జమ
- ఆగస్టు 15 నాటికల్లా 30 లక్షల ఉద్యోగాల భర్తీ
- కులగణనతో దేశ రాజకీయాలే మారిపోతాయి
- 4న వచ్చేది 'ఇండియా' సర్కారే: రాహుల్‌గాంధీ
- రేవంత్ బృందం పనితీరు బాగుందని ప్రశంస
- నర్సాపూర్, సరూర్‌నగర్‌లో జన జాతర సభలు

హైదరాబాద్/సంగారెడ్డి, మే 9 (ఆంధ్రజ్యోతి): "భారత రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదు.. పేద ప్రజల గుండె చప్పుడు.. ప్రతి పేదోడి ఆశ, శ్వాస. ఈ ఎన్నికల్లో గెలిస్తే భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేస్తామని, రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ, ఆరెస్సెస్ ఇప్పటికే స్పష్టం చేశాయి. రాజ్యాంగాన్ని మార్చడమంటే దేశ ఆత్మపై దాడి చేయడమే" అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్, హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ జన జాతర సభల్లో ఆయన ప్రసంగించారు. "ప్రజలకు రిజర్వేషన్ ఫలాలు అందుతున్నాయన్నా, హక్కులు ఉన్నాయన్నా.. రాజ్యాంగమే కారణం. దీని కోసమే అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ పోరాడారు. సంవత్సరాల పాటు జైలుకెళ్లారు. వారి రక్తాన్ని ధారపోశారు. అలాంటి రాజ్యాంగాన్ని మార్చి వారి త్యాగాలను

మిగతా 11వ పేజీలో...

విశ్వనగరంపై బీజేపీ విషం

హైదరాబాద్‌లో మతచిచ్చుకు కుట్రలు
అల్లర్లు చెలరేగితే పెట్టుబడులు రావు, ఉద్యోగాలు ఉండవు
బీజేపీ పుట్టకముందే మనోళ్లు శ్రీరామనవమి జరపలేదా?
నవనీత్‌కౌర్‌పై చర్యలు తీసుకోవాలి 11
కాంగ్రెస్ హయాంలోనే విశ్వనగరంగా హైదరాబాద్:రేవంత్

పదిస్తే ముస్లిం రిజర్వేషన్ల రద్దు

- తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ చేస్తాం
- రేవంత్ వినూ.. ఈసారి డబుల్ డిజిట్ ఖాయం
- 3 విడతల ఎన్నికల్లోనే 200 ఎంపీ స్థానాలు
- మొత్తం 400 సీట్లు కైవసం చేసుకుంటాం
- ఈ ఎన్నికలు అభివృద్ధికి, జిహాద్‌కు మధ్య పోరు
- రాహుల్ గాంధీవి చైనా గ్యారెంటీలు, ప్రధాని నరేంద్ర మోదీవి భారత గ్యారెంటీలు
- కాంగ్రెస్ పార్టీ రామమందిరాన్ని వ్యతిరేకించింది
- మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే.. షరియత్, ఖురాన్ ఆధారంగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నారు
- భువనగిరి బహిరంగసభలో అమిత్ షా



సీఎం రేవంత్‌రెడ్డీ వినూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి తెలంగాణలో డబుల్ డిజిట్ స్కోరు సాధిస్తాం. మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో 200 సీట్లకు పైగా స్థానాలు గెలుస్తాం. దేశవ్యాప్తంగా 400 స్థానాలను కైవసం చేసుకుంటాం.

- బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 12

మొదటిసారి మోదీతో కలిసి విమానమెక్కా..

13

వైట్‌హౌస్ ముందు ఫొటో దిగాం.. ప్రధాని అయ్యాక దాని గురించి అడిగారు
గుండెజబ్బుల పిల్లల కోసం మందకృష్ణతో కలిసి ఉద్యమం.. దాన్నుంచే ఆరోగ్యశ్రీ
కరోనా కాలంలో నెలరోజులు ఆఫీసులోనే ఉండి ప్రజలకు సాయం చేశా
ప్రముఖ నటుడు చిరంజీవితో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాటామంతి
అసెంబ్లీలో కిషన్‌రెడ్డి నుంచి సభామర్యాద నేర్చుకున్నా: చిరంజీవి



పైపుల లారీలో 8.36 కోట్లు!

గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న ఎస్టీఎఫ్
డ్రైవర్ క్యాబిన్, లారీ బాడీ మధ్య ప్రత్యేక అరలో...
మొత్తం ఐదు అట్టపెట్టెల్లో పెద్దమొత్తంలో నగదు
మరో మూడు లారీల్లోనూ భారీగా డబ్బు తరలింపు
ఒక లారీ పట్టుబడిన సమాచారంతో అవి వెనక్కి
ప్రకాశంలో పోటీ చేస్తున్న చిత్తూరు వైసీపీ నేతవేనా?
వైసీపీ నేతలపంటూ సీ-విజిల్‌లో టీడీపీ ఫిర్యాదు
దాంతో తనిఖీలు.. 9
భారీగా పట్టుబడిన నగదు

బ్యారేజీలను కాపాడుకోండి!

మరమ్మతులు చేపట్టండి
ఎన్డీఎస్ఏ నివేదికను అమలు చేయండి
అధికారులకు 3
జస్టిస్ పీసీ ఘోష్ సూచన

వికసిత్ కాదు..

విఫల భారత్

సబ్ కా సత్యనాశ్.. దేశ్ కా సత్యనాశ్
మోదీ భావోద్వేగాల బ్లాక్‌మెయిల్ డేంజర్
150 హామీల్లో ఒక్కటీ నెరవేర్చని ప్రధాని
ఓట్ల కోసం మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప పేదలకు చేసిందేమీ లేదు: కేసీఆర్



కరీంనగర్‌లోని రాజీవ్‌చౌక్‌లో మాట్లాడుతున్న కేసీఆర్ 12

6 గ్యారెంటీలు మోసం.. 6 వస్తువులు తప్పనిసరి!

జనరేటర్లు, ఇన్వర్టర్లు, క్యాండిల్స్, టార్చిలైట్లు, పవర్ బ్యాంక్, చార్జింగ్ బల్బులు అవసరం
కాంగ్రెస్ వస్తే ఈ దుస్థితిని ముందే చెప్పాం.. రైతుభరోసాపై రాహుల్‌ది భ్రమ: కేటీఆర్
భైంసాలో కేటీఆర్‌కు హనుమాన్ దీక్షధారుల సెగ.. రాళ్లు, టొమాటోలతో దాడి 12
బీఆర్ఎస్ శ్రేణుల ఎదురుదాడి.. ఒకరికి తీవ్రగాయాలు.. నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి!

నెరవేరని బడ్జెట్ వ్యయ లక్ష్యం

3

2023-24లో 15.05 శాతం తగ్గుదల
మొత్తం వ్యయం రూ.2,11,705 కోట్లు
బడ్జెట్‌లో అంచనా 2,49,209 కోట్లు
రెవెన్యూ రాబడులు 78.08 శాతమే
కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద ఎక్కువగా అంచనా వేసిన గత ప్రభుత్వం
కానీ.. వచ్చింది 23.58 శాతం నిధులే!
'మార్చి' ప్రాథమిక వివరాల్ని వెల్లడించిన కాగ్

దేశంలో నీగ్రో, మంగోలాయిడ్ ప్రజలు!

భారతదేశ నైసర్గిక స్వరూపం కారణంగా కొందరు నల్లగా, కొందరు తెల్లగా ఉంటారు
దేశంలోని ఒక్కో ప్రాంతంలో ఒక్కో తరహా రూపురేఖలు
కాంగ్రెస్‌నేత అధీర్ రంజన్ వ్యాఖ్యలు
ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ..
ఇరకాటంలో పడ్డ కాంగ్రెస్ 10



నేడు అక్షయ తృతీయ

అక్షయ ఫలదాయకం

జ్యోతిష శాస్త్రాన్ని అనుసరించి ఒక్కొక్క గ్రహానికి ఒక్కొక్క కాలంలో ఉచ్ఛ స్థితి, నీచ స్థితి ఉంటాయి. గ్రహాలు ఉచ్ఛ స్థానాల్లో ఉన్నప్పుడు శుభకార్యాలు చేయడం ఉత్తమం. దానివల్ల ఆ గ్రహం తాలూకు అనుగ్రహం లభిస్తుంది. ఏటా ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకూ... సౌర మానం ప్రకారం మేష మాసంలో... సూర్యుడు ఉచ్ఛ స్థితిలో ఉంటాడు. ఆ సమయంలో రవి అనుగ్రహాన్ని పొందితే ఆరోగ్యం, అభివృద్ధి, ఉత్సాహం లభిస్తాయి. రోహిణి నక్షత్రం రోజున చంద్రుడు ఉచ్ఛ స్థితిలో ఉంటాడు. చంద్రుడి అనుగ్రహం లభిస్తే సర్వకార్యానుకూలత, సంతోషం, మనోల్లాసం కలుగుతాయి. సూర్యుడు, చంద్రుడు ఉచ్ఛ స్థితిలో ఉన్న రోజైన రోహిణీ నక్షత్రయుతమైన వైశాఖ శుక్ల పక్ష తృతీయ (అక్షయ తృతీయ) విశేషమైనది. సూర్య చంద్రులిద్దరూ ఉచ్ఛ స్థితిలో ఉండడం వల్ల... ఈ రోజున చేసే ప్రతి పనీ అక్షయం అవుతుందనేది భారతీయుల విశ్వాసం. ఈ విషయాన్ని 'నిర్ణయ సింధు', 'మత్స్యపురాణం', 'మరీచి సంహిత' తదితర గ్రంథాలు ధ్రువపరుస్తున్నాయి. ఇది సర్వశుభాలనూ కలిగించే పర్వదినమనీ పేర్కొంటున్నాయి. అలాగే ఇది లక్ష్మీ దేవికీ, గౌరీ దేవికీ ప్రీతిపాత్రమైన రోజు.

ఉదకుంభ ప్రదానేన శివలోకే మహీయతే
ఏష ధర్మ ఘతోదత్తో బ్రహ్మా విష్ణు శివాత్మికః
అస్య ప్రదానాత్ తృప్యంతు పితరోపి పితామహః



. ఈ రోజున అక్షయ స్వరూపుడైన విష్ణువును అర్చించాలనీ, ఉదకుంభదానం విశేష ఫలప్రదమనీ, రాగి లేదా వెండి చెంబులో శుద్ధ జలాన్ని ఉంచి, అర్చించి దానం ఇస్తే... పితృదేవతలు దాన్ని గ్రహించి, తృప్తి చెంది అనుగ్రహిస్తారనీ పూర్వులు చెప్పారు.

ఈ రోజు ఏ కార్యం చేసినా అది అక్షయం అవుతుందనీ, విష్ణువును అక్షతలతో అర్చించి, వాటిని శిరస్సున ధరిస్తే అక్షయఫలం చేకూరుతుందనీ శాస్త్రవచనం. సూర్యుడు పాండవులకు అక్షయ పాత్రను ప్రసాదించినదీ, భగీరథుని తపస్సుకు మెచ్చి దివి నుంచి భువికి గంగ వచ్చినదీ, శ్రీకృష్ణుణ్ణి కుచేలుడు దర్శించి, ఆయన కృపను పొందినదీ, ఆది శంకరులు కనకధారా స్తోత్రాన్ని ఉపదేశించినదీ ఈ రోజునేనని పురాణాలు చెబుతున్నాయి. పరశురామ జయంతి కూడా ఈనాడే కావడం విశేషం. ఈ రోజు బంగారాన్ని కొనుగోలు చేస్తే... ఆ ఇల్లు బంగారంతో తులతూగుతుందనే విశ్వాసం కొన్ని ప్రాంతాల్లో ఉంది.

• **ప్రొఫెసర్ వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు,** తిరుపతి



నృసింహ సంకీర్తనాచార్య కృష్ణమయ్య

భగవంతుడి గుణాలను ప్రస్తుతించడానికీ, దైవ లీలలను సామాన్యులకు తెలియజేసి... వారిలో భక్తి కలిగించి, తద్వారా ముక్తి మార్గాన్ని చూపడానికి... ఒక్కొక్క కాలంలో ఒక్కొక్కరు జన్మిస్తారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని కీర్తించడానికి తాళ్ళపాక అన్నమయ్య జన్మిస్తే... అంతకుముందు కాలంలో... సింహాచల శ్రీవరాహ లక్ష్మీ నరసింహుణ్ణి కీర్తించడానికి పుట్టినవాడు... సింహాచలం కృష్ణమయ్యగా ప్రసిద్ధి చెందిన శ్రీకాంత కృష్ణమాచార్యులు. నేడు సింహాచలంలో చందనోత్సవం జరుగుతున్నవేళ... సింహాద్రి అప్పన్నను తన రచనలతో అర్చించిన కృష్ణమయ్యను స్మరించుకోవడం సముచితం.

కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడి కాలానికి చెందిన కృష్ణమయ్య గురించిన ప్రస్తావన 'ప్రతాపరుద్ర చరిత్ర', 'సిద్దేశ్వర చరిత్ర' గ్రంథాల్లో కనిపిస్తుంది. కృష్ణమయ్య సుమారు ఏడువందల ఏళ్ళ క్రితం... ఆరు భాద్రపద బహుళ చతుర్దశి రోజున గోవిందాచార్యులు, లక్ష్మీదేవి దంపతులకు జన్మించాడు. తను పుట్టుకతోనే అంధుడిననీ, ఆ కారణంగా తన అమ్మమ్మ తనను బావిలో పడేస్తే... ఒక సాధువు చేరదీసి కాపాడాడనీ, సింహాచల శ్రీ నృసింహస్వామి కరుణతో... పదకొండేళ్ళ వయసులో తనకు చూపు వచ్చిందనీ ఆయన స్వయంగా చెప్పుకున్నాడు. అప్పటినుంచీ... అంటే పదకొండేళ్ళకే నృసింహ సంకీర్తనా సేవకు శ్రీకారం చుట్టాడు. అందుకు వచనాన్ని మార్గంగా ఎంచుకున్నాడు. వచన భక్తి వాఙ్మయంలో ఆయనే ప్రథమాచార్యుడు. కృష్ణమయ్య పాడుతూ ఉంటే... ఆ నృసింహుడే బాలునిగా వచ్చి నృత్యం చేసేవాడంటారు. 'దేవా' అని ప్రారంభమై... 'సింహగిరి నరహరి దయానిధే' అంటూ ముగిసే ఆయన రచనలు ఆ కాలంలో ప్రజల నాలుకల మీద నాట్యమాడాయి.

కృష్ణమయ్య సాహిత్యం గురించి, భక్తి గురించి తెలుసుకున్న ప్రతాపరుద్రుడు... ఆయనను ఓరుగల్లుకు ఆహ్వానించి సత్కరించాడు. ఒకసారి గ్రహణ సమయంలో... కృష్ణమయ్యతో సహా కొందరు పరివారంతో ప్రతాపరుద్రుడు గౌతమీ నదిలో స్నానం చేస్తుండగా... స్వర్ణ, వజ్రాభరణాలు దొరికాయి. వాటితో పాటు మరికొన్ని ఆభరణాలను కృష్ణమయ్యకు ఇచ్చి... వాటిని సింహాచలేశునికి అలంకరించమన్నాడు. ఆ ఆభరణాలను తన ఇంటికి తీసుకువెళ్ళి, వాటిని తన నిత్యాగ్నిహోత్ర హోమగుండంలో వేసి... "ఇవి సింహాద్రి అప్పన్నకు" అన్నాడు కృష్ణమయ్య. ఈ విషయం తెలుసుకున్న ప్రతాపరుద్రుడు... నగలు ఏవని కృష్ణమయ్యను అడిగాడు. రాజును వెంటబెట్టుకొని సింహగిరిపైకి వెళ్ళాడు కృష్ణమయ్య. తాను ఇచ్చిన ఆభరణాలు స్వామికి అలంకరించి ఉండడం చూసిన ప్రతాపరుద్రుడు ఆశ్చర్యపోయాడు. కృష్ణమయ్య భక్తికి దాసుడయ్యాడు. ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉన్న కాలంలో... నారసింహుణ్ణి కీర్తిస్తూ కృష్ణమయ్య గానం చేస్తే... కనకవర్షం కురిసిందట. ఈ వివరాలన్నీ 'సిద్దేశ్వర చరిత్ర'లో ఉన్నాయి.

తాను పాడితే నారసింహుడు ఆడతాడనీ, తనంత భక్తుడు ఎవరూ లేరనీ గర్వపడిన కృష్ణమయ్య జీవితంలో ఒక అపూర్వమైన ఘట్టం జరిగింది. భగవద్రామానుజాచార్యులు శిష్య సమేతంగా దేశసంచారం చేస్తూ సింహాచలం వచ్చారు. స్వామిని సేవించుకున్నారు. అక్కడ కృష్ణమయ్య గురించి విన్న రామానుజులు ఆయనను కలిసి... "మీరు ప్రతిరోజూ అప్పన్నను దర్శిస్తున్న మహానుభావులు. నాకు మోక్షం ఉందో, లేదో స్వామిని అడుగుతారా?" అని కోరారు.

"సరే"నంటూ స్వామిని కృష్ణమయ్య అడిగాడు. స్వామి చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. ఈ సంగతి రామానుజులకు కృష్ణమయ్య చెప్పాడు. అప్పుడు "రామానుజులు మీకు మోక్షం ఉందో లేదో కనుక్కోండి" అన్నారు. దానితో ఉగ్రుడైన కృష్ణమయ్య "రోజూ కనిపించే స్వామి నాకే మోక్షం ఇవ్వడా?" అంటూ నరసింహ స్వామి దగ్గరకు వెళ్ళి అడిగాడు. "నీకు మోక్షార్హత లేదు. నీ పాటకు, నేను చేసిన నృత్యంతో సరిపోయింది. నీతో ఈ ప్రశ్న అడిగించిన రామానుజులకే కలియుగంలో మోక్షం ఇచ్చే అర్హత ఉంది" అని బదులిచ్చాడు. ఆగ్రహించిన కృష్ణమయ్య తాను నిత్యం కొలిచే స్వామినే దుర్భాషలాడాడు. అప్పన్న కోపిస్తూ "ఏ సాహిత్యాన్ని చూసి నువ్వు గర్వపడుతున్నావో... అది నశించిపోతుంది" అని శపించాడు. కృష్ణమయ్య తప్పు తెలుసుకొని, రామానుజులను శరణు కోరి, ఆయనకు శిష్యుడయ్యాడు.

> పురాణేతిహాసాలు సంస్కృతంలో ఉండడం వల్ల అవి సామాన్య జనానికి దూరమయ్యాయని భావించిన కృష్ణమయ్య... వాటిని అందరికీ అందుబాటులో ఉండాలనుకున్నాడు. వేదాలను, ఉపనిషత్ సారాన్నీ తేలికైన తెలుగు వచనంలో రాశాడు. సంగీత, నాట్యాల సమ్మేళనంతో వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్ళాడు. ఆయన రాసిన 'సింహగిరి వచనాల'ను ఈనాటికీ సింహాచలం ఆలయంలో పఠిస్తారు.

కృష్ణమయ్య రచన, భక్తి, సంగీతం, నాట్యాలు కలబోసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన రచనలు కొన్ని ప్యారిస్‌లోని లిండ్స్ లైబ్రరీకి తరలించినట్టు ఆధారాలున్నాయి. అలాగే తంజావూరు సరస్వతీ మహల్ పుస్తక భాండాగారంలో కృష్ణమయ్య రచనలు రెండువందల వరకూ లభ్యమయ్యాయి. వైష్ణవ సంప్రదాయాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించి, భగవద్రామానుజులు ప్రతిపాదించిన విష్ణుభక్తి, భాగవత కైంకర్యం, ఆచార్య సేవానిరతి తదితర వైష్ణవ మత సూత్రాలను ఆయన తన రచనల్లో పొందుపరిచారు. ఆయన సాహిత్యం తదనంతర కాలంలోని వారికి మార్గదర్శకంగా ఉపయోగపడింది. "సింహగిరి నరహరీ! మీ దివ్యనామము ఇదియే నాకు జపము, దయానిధీ!" అంటూ సింహచలాధీశుణ్ణి మనసారా కీర్తించి, తొలి తెలుగు వాగ్గేయకారునిగా కీర్తిపొందిన మహనీయుడు శ్రీకాంత కృష్ణమాచార్యులు.

(నేడు సింహాచలేశుని చందనోత్సవం)

• **అద్దంకి శ్రీరామ కుమార్,** 9440567625

మాతృ వందనం

సహజయోగ



12న మదర్స్ డే

సృష్టికి మూలం ఆదిశక్తి. ఆమె తన మాతృప్రేమ శక్తితో ఈ చరాచర ప్రకృతిని సృష్టించింది. అలాగే తనకు ప్రతిబింబంగా స్త్రీలను సృష్టించి... వారిలో ప్రేమైక మాతృత్వ గుణాలను స్థిరపరచింది. ఆ మాతృత్వ గుణాలకు ప్రతిరూపమైన శ్రీమాతాజీ నిర్మలాదేవి జాతి, మత, వర్ణ విభేదాలు లేని వసుధైక కుటుంబ స్థాపన కోసం కృషి చేశారు. మనిషి తనకు ప్రయోజనంలేని, అనవసరమైన విషయాలకు బానిస కావడం ఆమె మాతృహృదయాన్ని కలచివేసింది. వాటి నుంచి మనిషిని విముక్తి చేయడం ఎలా?' అని ఆలోచించారు. సహజయోగాన్ని కనుగొన్నారు.

కష్టంలో ఉన్నవారు కనిపిస్తే ఆమె చలించిపోయేవారు. ఒకసారి ఆమె రైలులో ప్రయాణిస్తున్నప్పుడు... భర్తలు వదిలేసిన బీద మహిళలు, అనాథలైన ఆడపిల్లలను స్టేషన్లలో చూసి బాధపడ్డారు. వారి కోసం ఢిల్లీలో 'నిర్మల ప్రేమాశ్రమం' అనే సంస్థను ఏర్పాటు చేశారు. వారికి చదువు, వృత్తి పని నేర్పించి... కొత్త జీవితాన్ని అందించారు. ఆమె భర్త సర్ సి.పి. శ్రీవాత్సవ ఐక్యరాజ్య సమితిలో పనిచేసేవారు. ఉద్యోగరీత్యా వారు ఇంగ్లండ్‌లో నివసిస్తున్నప్పుడు.. రోడ్డుపై బిక్కుచిక్కిన, సరైన దుస్తులు లేని పిల్లవాడిని ఆమె చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఆ పిల్లవాడిని కారులో తన ఇంటికి తీసుకువచ్చి, స్నానం చేయించి, తన భర్త దుస్తులను వేశారు. సాయంత్రం ఇంటికి వచ్చిన శ్రీవాత్సవ తన దుస్తుల్లో ఉన్న ఆ కుర్రాణ్ణి చూసి ఆశ్చర్యపోయారు. జరిగినదంతా నిర్మలాదేవి ఆయనకు చెప్పారు. ముక్కూ మొహం తెలియని పిల్లవాడిని ఎవరి అనుమతీ లేకుండా ఇంటికి తీసుకురావడం ప్రమాదకరమని చెప్పినా... ఆమె మాతృహృదయం ముందు అలాంటి ఆలోచన, భయాలు పని చేయలేదు.

భారత కేంద్ర ప్రభుత్వంలో శ్రీవాత్సవ ఉన్నత పదవిలో ఉన్న రోజుల్లో.... ఒకసారి మతకల్లోలాలు పెచ్చుమీరాయి. ఆశ్రయం కోసం ఒక జంట, ఒక ముస్లిం యువకుడు వచ్చి... తమ ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయనీ, ఒక్క రోజు తలదాచుకోవడానికి అనుమతించాలనీ ప్రాధేయపడ్డారు. నిర్మలాదేవి సరేనన్నారు. కాసేపటికి వచ్చిన శ్రీవాత్సవ బయటి పరిస్థితుల గురించి ఆమెకు చెబుతూ... వారికి ఆశ్రయం ఇవ్వడం సరికాదనీ, సురక్షితమైన మరో చోటుకు పంపిద్దామనీ అన్నారు. నిర్మలాదేవి ఆయనకు నచ్చజెప్పారు. మరుసటిరోజు స్థానిక యువకులు పెద్ద పెద్ద కర్రలతో, మారణాయుధాలతో వారి ఇంట్లోకి దూసుకువచ్చి... "మీరు దేశ ద్రోహులకు... అందులోనూ ముస్లింలకు ఆశ్రయం ఇచ్చారు. వారిని మాకు మర్యాదగా అప్పగించండి" అని గొడవ చేశారు. అప్పుడు ఆమె "నేను స్వచ్ఛమైన హిందువును, భారతీయురాలిని. శత్రువులకు ఆశ్రయం ఎలా ఇస్తాననుకున్నారు?" అని చెప్పి, వారిని పంపేశారు. తన ఇంటికి వచ్చినవారు ప్రసిద్ధ సినీనటి అచల సత్యదేవ్ దంపతులనీ, ఆ ముస్లిం యువకుడు ఇప్పటి ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ అనీ తరువాత తెలిసింది. ఆమె జీవితంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో.

"మనలో మాతృమూర్తి తత్త్వమైన భూమాతే... మనలో నివశిస్తున్న కుండలినీ శక్తి. అది జన్మజన్మల నుంచి మనకు తల్లిగా ఉంటూ, మనకు అంతర్గతమైన, ఆధ్యాత్మికమైన పోషణను ఇస్తోంది. మన బాగోగులను చూసుకుంటోంది. మనం భూమాతను తల్లిగా కొలుచుకుంటాం. దేశాన్ని 'భారతమాత' అని తల్లిగానే గౌరవించుకుంటాం. తల్లికి ఉన్న స్థానం అది. పిల్లలను చక్కని నడవడిక కలిగిన వారిగా తీర్చి దిద్దడంలో తల్లుల పెంపకమే కీలకం. పెద్దలను, గురువులను, సమాజాన్ని గౌరవించడం వారికి నేర్పాలి. 'మానవాళి అంతా ఒక కుటుంబం' అని బోధించాలి. ఈ శక్తి తల్లికే ఉంది. పిల్లలు లంచగొండులు, అవనీతిపరులు, హింసాకారకులు అయితే... దానికి బాధ్యత తల్లులదే. పిల్లలను సన్మార్గంలో పెట్టడం అనే బాధ్యత తల్లులు సక్రమంగా నెరవేర్చకపోతే... ఆ ప్రభావం మొత్తం సమాజం మీద పడుతుంది" అని వివిధ సందర్భాల్లో ఆమె చెప్పారు.

కుమార్తెగా, విద్యార్థి నాయకురాలుగా, స్వాతంత్ర్య ఉద్యమకారిణిగా, ఆదర్శ పత్నిగా, గృహిణిగా, తల్లిగా, అమ్మమ్మగా... తన బాధ్యతలన్నిటినీ సమగ్రంగా నిర్వహించిన నిర్మలాదేవి... ఆధ్యాత్మిక గురువుగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 1970 మే 5న... సహజయోగాన్ని ఆవిష్కరించారు. ప్రపంచమంతటా దాన్ని వ్యాప్తి చేశారు. ధ్యాన సాధన ద్వారా లక్షలాదిమంది సమస్యలకు సునాయాసమైన పరిష్కారాన్ని చూపించారు. శిష్యులనుంచి శ్రీమాతాజీగా వందనాలు అందుకుంటున్నారు.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

విశేషం



జ్ఞానానందమయం... శ్రీశంకర వాఙ్మయం

ఆది కవి వాల్మీకి శ్రీమద్రామాయణం ద్వారా ఆదర్శ మానవుడు ఎలా ఉండాలో లోకానికి మార్గదర్శనం చేశాడు. వ్యాసమునీంద్రుడు మహాభారతం, ప్రస్థానత్రయం, పురాణాల ద్వారా భారతీయ సంస్కృతిని భావితరాలకు అందించాడు. అలాగే... శాఖోపశాఖలుగా చీలిపోయి, అస్తవ్యస్తంగా ఉన్న హిందూ మతాన్ని, వైదిక ధర్మాన్ని పునరుద్ధరించి, ఒకే తాటి మీదకు తెచ్చి పునరుజ్జీవింప జేసినవారు ఆది శంకరులు.

ఎనిమిదేళ్ళ వయసులో ఆపత్సన్యాసాన్ని స్వీకరించి, తల్లి అనుజ్ఞతో ఆదిశంకరులు దేశ సంచారాన్ని ప్రారంభించారు. నర్మదా నదీతీరంలో... గోవింద భగవత్పాదాచార్యుల దగ్గర క్రమ సన్యాసాన్ని పొంది, శ్రీశంకర భగవత్పాదాచార్యులుగా యోగ పట్టాన్ని స్వీకరించారు. శ్రీశంకరుల ఎనిమిదేళ్ళ ఆయుష్షును గురువు పదహారేళ్ళకు పెంచారు.

గురువు ఆదేశం మేరకు శ్రీశంకరులు కాశీ క్షేత్రం చేరుకున్నారు. ఈశ్వర సాక్షాత్కారంతో బ్రహ్మ జ్ఞానం పొందారు. అనంతరం వ్యాసుల దర్శనం అయింది. శంకరుల జ్ఞాన సంపదకు మెచ్చిన వ్యాస మహర్షి... తాను రచించిన ప్రస్థాన త్రయానికి భాష్యాన్ని రాయాలనీ, దేశం నలుమూలలా పర్యటించి, వైదిక ధర్మానికి ప్రాచుర్యం కల్పించాలనీ ఆదేశించారు. అందుకు వీలుగా... శ్రీశంకరుల ఆయుర్దాయాన్ని పదహారేళ్ళ నుంచి రెట్టింపు చేస్తూ ఆశీర్వదించారు.

వ్యాసుడి ఆదేశాన్ని పాటిస్తూ... శ్రీ శంకరులు ప్రస్థానత్రయ భాష్యంతో పాటు, అద్వైత సిద్ధాంత ప్రాచుర్యానికి వీలుగా అనేక ప్రకరణ గ్రంథాలను రచించారు. దేశ పర్యటనలో తాను దర్శించిన అనేక దేవాలయాల్లో యంత్రాలను స్థాపించారు. ఆయా దేవీ దేవతల మీద స్తోత్రాలను రాశారు. అవి కొన్ని వందల సంఖ్యలో ఉంటాయి. 'అద్వైతానుభూతి', 'ఆత్మబోధ', 'ప్రబోధ సుధాకరం', 'అపరోక్షానుభూతి', 'సర్వవేదాంత సార సంగ్రహం', 'వివేక చూడామణి', 'వేదాంత డిండిమ' తదితరాలు ప్రకరణ గ్రంథాలు. అనేక స్తోత్ర రత్నాలు, 'విష్ణు సహస్రనామ భాష్యం', 'లలితా త్రిశతీ భాష్యం' ఆదిగా ఎన్నో భాష్య రచనలూ చేసి అపార వైదిక వాఙ్మయాన్ని ఆయన అందించారు.

ఆది శంకరుల 'లహరులు' అత్యంత ప్రత్యేకమైనవి. 'సౌందర్య లహరి'లో శ్రీవిద్యా మహిమను, ఉపాసనా విధులను, మంత్రోద్ధార రహస్యాలను, షట్చక్రాల సంబంధాన్ని, దార్శనిక విచారాలనూ పొందుపరిచారు. శక్తి చెంతలేనిదే శివుడు అశక్తుడంటూ 'శివా శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుః' అని 'సౌందర్యలహరి'ని ప్రారంభించారు. జగదంబను అందులో వర్ణించిన తీరు ఆయనకే సాధ్యమంటారు పండితులు. 'జ్ఞానానంద సుధా మరందలహరీ సంవిత్ఫలాభ్యున్నతిః... శివా! నీ ధ్యానంతో నా మనస్సు వసంతకాలంలా జ్ఞానమనే ఫలాలను, జ్ఞానానందం అనే తేనెను అందిస్తున్నాయి' అంటారు 'శివానందలహరి'లో శ్రీ శంకరులు. ఆ మాటలు ఆయన రచనలకూ వర్తిస్తాయి. ఆయన వాఙ్మయం ఆద్యంతం జ్ఞానానందమయం.

(12న శ్రీశంకర జయంతి)

• **ఆయపిళ్ళ రాజాపాప**

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/mH4XExOలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

సల్మాన్‌ఖాన్‌కు జోడీగా






'యానిమల్' చిత్రంతో కథానాయికగా బాలీవుడ్‌లో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు రష్మిక మందన్న. ఇప్పుడు ఆమె మరో హిందీ చిత్రంలో అవకాశం అందుకున్నారు. ఏకంగా అగ్రనటుడు సల్మాన్‌ఖాన్‌కు జోడీగా అలరించబోతున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న 'సికందర్' చిత్రంలో రష్మికను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. గురువారం చిత్రబృందం ఈ విషయాన్ని ప్రకటించింది. సల్మాన్‌ఖాన్‌తో నటించే అవకాశం దక్కడాన్ని గౌరవంగా, గర్వంగా భావిస్తున్నాను అని రష్మిక పేర్కొన్నారు.

కన్నప్ప సెట్‌లోకి



శివ భక్తుడు కన్నప్పగా మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్‌కుమార్ లాంటి దిగ్గజ నటులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ పరమశివునిగా కనిపించనున్నారు. ఆయన ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ప్రభాస్ సెట్‌లోకి అడుగుపెట్టినట్లు చిత్రబృందం గురువారం తెలిపింది. ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

పాత కాంబోలో కొత్త చిత్రం



హీరో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రం ఖరారైంది. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. గతంలో విజయ్‌తో 'డియర్ కామ్రేడ్', 'ఖుషి' చిత్రాలను నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తోంది. అలాగే విజయ్‌తో 'టాక్సీవాలా' చిత్రాన్ని తెరకెక్కించిన రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్‌లో బీడు భూముల్లో రాతిపై చెక్కిన వీరుడి విగ్రహం సినిమా నేపథ్యాన్ని తెలుపుతోంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మాతలు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు యూనిట్ తెలిపింది.

అచ్చమైన తెలుగు సినిమాలా...



తమిళంలో చిన్న సినిమాగా విడుదలై పెద్ద విజయాన్ని అందుకున్న 'రంగోలి' చిత్రాన్ని తెలుగులో 'సత్య'గా డబ్ చేశారు శివ మల్లాల. "అచ్చమైన తెలుగు సినిమాలా 'సత్య' ఉంటుంది. ఈ సినిమాకు తండ్రీకొడుకు మధ్య ఉన్న అనుబంధం స్పెషల్ హైలెట్ అవుతుంది. అలాగే చదువు, స్నేహం కూడా ఈ కథలో భాగం" అని ఆయన చెప్పారు.

ప్రతి జర్నలిస్ట్‌కి ప్రతిరూపంగా...



పదేళ్ల క్రితం విడుదలై సంచలన విజయం సాధించిన 'ప్రతినిధి' సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కిన చిత్రం 'ప్రతినిధి 2'. నారా రోహిత్ హీరోగా నటించిన ఈ చిత్రానికి మూర్తి దేవగుప్తపు దర్శకత్వం వహించారు. సిరిలెల్లా హీరోయిన్‌గా నటించారు. కుమార్‌రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీతోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మించారు. 'ప్రతినిధి 2' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మీడియాతో ముచ్చటించింది. దర్శకుడు మూర్తి దేవగుప్తపు మాట్లాడుతూ "ఇందులో నారా రోహిత్ న్యూస్ రిపోర్టర్‌గా కనిపిస్తారు. ప్రతి జర్నలిస్ట్‌కి ప్రతిరూపంగా ఇందులో ఆయన పాత్ర ఉంటుంది. ఈ పొలిటికల్ థ్రిల్లర్ అందరినీ ఆకట్టుకుంటుంది" అని నిర్మాతలు చెప్పారు.

మంచి ఫీల్‌తో బయటకు వస్తారు



నటుడు సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వి.వి గోపాలకృష్ణ దర్శకత్వం వహించారు. దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మలపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. 'కృష్ణమ్మ' సినిమా ఈ రోజు విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ "దర్శకుడు ఈ సినిమాకు బెస్ట్ స్క్రిప్ట్‌ను ఇచ్చారు. సినిమా చూసి బయటకు వచ్చేటప్పుడు గొప్ప చిత్రాన్ని చూశామనే మంచి ఫీల్‌తో బయటకి వస్తారు" అని చెప్పారు. దర్శకుడు వి.వి గోపాలకృష్ణ మాట్లాడుతూ "ఈ సినిమాలోని ప్రధాన పాత్రల జీవితాల్లో తిరిగే మలుపులు కృష్ణా నది మలుపులను తలపిస్తాయి" అని చెప్పారు.

మంచి కథ కుదిరితే...



మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ నటించిన చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి దర్శకత్వం వహించగా అభిషేక్ వీటీ నిర్మించారు. ఈ ఎమోషనల్ థ్రిల్లర్ ఈ రోజు విడుదలతోన్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీవిష్ణు మాట్లాడుతూ "ఈ మూవీ టీమ్ పనితీరు అద్భుతంగా ఉంది. మంచి కథ కుదిరితే వీరితో కలసి ఓ సినిమా చేస్తా" అని అన్నారు. దర్శకుడు అజయ్ నాగ్ వి మాట్లాడుతూ "ఈ సినిమాని అందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని చెప్పారు. నిర్మాత అభిషేక్ వీటీ మాట్లాడుతూ "ఇలాంటి న్యూ కాన్సెప్ట్ సినిమాకు అందరి ఆదరణ దక్కాలి" అని ఆకాంక్షించారు.

www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru











బ్యారేజీలను కాపాడుకోండి!

» వెంటనే మరమ్మతులు చేపట్టండి

» ఎన్‌డీఎస్ఏ నివేదికను అమలు చేయండి

» అధికారులకు జస్టిస్ పీసీ ఘోష్ సూచన

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల రక్షణకు చర్యలు తీసుకోవాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ సూచించారు. బ్యారేజీల పునరుద్ధరణపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) మధ్యంతర నివేదిక ఇవ్వడంతో తదుపరి చర్యలకు ఉపక్రమించాలని అధికారులకు స్పష్టం చేశారు. గురువారమిక్కడి కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ నెల 7న ఆయన మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు. అప్పటికే ఎన్‌డీఎస్ఏ మధ్యంతర నివేదిక ఇవ్వడంతో దాంతో పాటు బ్యారేజీల పరిస్థితులపై జస్టిస్ ఘోష్ అధికారులతో చర్చించారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బ్యారేజీల మరమ్మతులు/పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలం ముంచుకొస్తున్నందున తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని పేర్కొన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదికను ప్రామాణికంగా చేసుకొని బ్యారేజీల రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే నివేదిక అమలుకు వీలుగా ఉన్నతస్థాయి కమిటీని వేస్తున్నామని అధికారులు జస్టిస్ ఘోష్‌కు వివరించారు.

ఈఎన్‌సీ జనరల్ నేతృత్వంలో కమిటీ

ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక అమలు కోసం ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలో కమిటీ వేశారు. కమిటీలో ఈఎన్‌సీ బి.నాగేంద్ర రావు, సీడీవో చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్ ఉండగా సభ్య కన్వీనర్‌గా రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డిని నియమించారు. ఈ నెలాఖరులోనే బ్యారేజీలకు వరద వచ్చే అవకాశం ఉన్నందున కమిటీ చర్యలకు ఉపక్రమించనుంది.

కాళేశ్వరంపై రెండే ఫిర్యాదులు

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నిర్మాణపరమైన, నాణ్యత, నిర్వహణ లోపాలు తదితర కారణాలను వెలికితీయడంతో పాటు వాటికి బాధ్యులను గుర్తించడానికి తెలంగాణ ప్రభుత్వం నియమించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు గురువారం దాకా రెండే ఫిర్యాదులు అందాయి. ఈ నెల 31లోగా బ్యారేజీల్లో నిర్మాణ నాణ్యత, నిర్వహణ లోపాలతో పాటు నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేయాలని కమిషన్ గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చింది. ఫిర్యాదుదారులు కచ్చితంగా తగిన సాక్ష్యాధారాలు పొందుపర్చి.. నోటరీ సంతకంతో ప్రమాణపత్రం(అఫిడవిట్) ఆధారంగా ఫిర్యాదు చేయాలని కమిషన్ షరతులు పెట్టడం వల్లే ఆధారాలు లేనివారు ఫిర్యాదు చేయడానికి వెనకాడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో పోలింగ్ అనంతరం ఫిర్యాదులు పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

నెరవేరని బడ్జెట్ వ్యయ లక్ష్యం

2023-24లో 15.05 శాతం తగ్గుదల.. మొత్తం వ్యయం రూ.2,11,705 కోట్లు

» బడ్జెట్‌లో అంచనా రూ.2,49,209 కోట్లు

» రెవెన్యూ రాబడులు 78.08 శాతమే

» కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద ఎక్కువగా అంచనా వేసిన గత ప్రభుత్వం

» కానీ.. వచ్చింది 23.58 శాతం నిధులే!

» మార్చి నెల ప్రాథమిక వివరాలను వెల్లడించిన 'కాగ్'

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈసారి కూడా నిర్దేశిత బడ్జెట్ లక్ష్యం నెరవేరలేదు. భారీ బడ్జెట్‌లను ప్రవేశపెట్టడం, వాస్తవిక వ్యయాలు మాత్రం తక్కువగా ఉండడం రాష్ట్రంలో పరిపాటిగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో బడ్జెట్‌లను ప్రవేశపెడుతూ వచ్చినా... వ్యయాలు ఎప్పుడూ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోలేదు. ఇప్పుడు కూడా అదే జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2,90,396 కోట్లతో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్ నుంచి రుణాలు, అడ్వాన్సుల పంపిణీ వంటివి పోనూ... నికరంగా రూ.2,49,209.93 కోట్ల వ్యయం ఉంటుందని అంచనా వేసింది. కానీ... వ్యయం మాత్రం రూ.2,11,705.70 కోట్లుగా నమోదైంది. ఈ మేరకు మార్చి 31తో పూర్తయిన 2023-24 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ రాబడులు, వ్యయాల వివరాలను 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)' గురువారం విడుదల చేసింది. ప్రాథమిక అంచనాల ప్రకారం.. ఈసారి వ్యయం 84.95 శాతంగా నమోదైందని తెలిపింది. అంటే.. బడ్జెట్‌లో అంచనా వేసిన మొత్తం వ్యయంలో 15.05 శాతం మేర వ్యయలోటు ఏర్పడింది. సంక్షేమ పథకాలు, కార్యక్రమాల కోసం రూ.78,952.43 కోట్లు, వడ్డీ చెల్లింపుల కోసం రూ.23,337.40 కోట్లు, ఉద్యోగుల వేతనాలు/భత్యాల కోసం రూ.38,911.05 కోట్లు, సర్వీసు పెన్షనర్ల పెన్షన్ల కోసం రూ.16,841.39 కోట్లు, సబ్సిడీల కోసం రూ.9,410.51 కోట్లను ప్రభుత్వం వ్యయం చేసింది. మూలధన వ్యయం కింద రూ.37,524.70 కోట్లు బడ్జెట్‌లో అంచనా వేయగా కాస్త ఎక్కువగానే రూ.44,252.92 కోట్ల(117.93%)ను వ్యయం చేశారు. రెవెన్యూ రాబడుల కింద రూ.2,16,566.97 కోట్లు వస్తాయని అంచనా వేయగా రూ.1,69,089.58 కోట్లు (78.08%) సమకూరాయి. ఇందులో పన్నుల కింద రూ.1,52,499.49 కోట్లను అంచనా వేయగా సంవత్సరాంతానికి రూ.1,35,540.17 కోట్లు (88.88%) సమకూరాయి. అదే గత ఏడాది పన్నుల కింద 100 శాతం రాబడి సమకూరింది. ఈసారి మాత్రం లక్షిత రాబడిలో 11.12 శాతం మేర తగ్గడం గమనార్హం. అన్నింటికంటే రాష్ట్ర ఎక్సైజ్ రాబడులు, కేంద్ర పన్నుల్లో వాటా రాష్ట్ర ఖజానాకు ఊతమిచ్చాయి. రాష్ట్ర ఎక్సైజ్ సుంకాల కింద రూ.19,884.90 కోట్లను అంచనా వేయగా... రూ.20,298.89 కోట్లు(102.08%) సమకూరడం విశేషం. ఇక కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.14,528.18 కోట్లను అంచనా వేయగా... రూ.16,536.65 కోట్లు (113.83%) వచ్చాయి. కానీ... కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్లు మాత్రం తీవ్ర నిరాశపర్చాయి. ఈ పద్దు కింద అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులను ఆశించింది. ఏకంగా రూ.41,259.17 కోట్లు వస్తాయని అంచనా వేయగా... మార్చి నెలాఖరు వరకు వచ్చింది రూ.9,729.91 కోట్లు (23.58%) మాత్రమే.

మొత్తం రాబడులు, అప్పులు (రూ.కోట్లలో)

రాబడి మార్గం	అంచనా మొత్తం	సమకూరిన రాబడి	శాతం
జీఎస్‌టీ	50942.66	46500.43	91.28
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	18500	14295.56	77.27
సేల్స్ ట్యాక్స్	39500	29989.55	75.92
రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు	19884.9	20298.89	102.08
కేంద్ర పన్నుల్లో వాటా	14528.18	16536.65	113.83
ఇతర పన్నులు, సుంకాలు	9131.7	7918.74	86.72
పన్నేతరాలు	22808.31	23819.5	104.43
గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్లు	41259.17	9729.91	23.58
అప్పులు	38234.94	49476.89	129.31

అమెరికాలో తెలంగాణ విద్యార్థి అదృశ్యం



హైదరాబాద్, వరంగల్ క్రైం, మే9 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య కోసం తెలంగాణ నుంచి అమెరికా వెళ్లిన ఓ విద్యార్థి కనిపించకుండా పోయాడు. హనుమకొండ నయీంనగర్‌కు చెందిన చింతకింది రూపేశ్ చంద్ర(26) షికాగోలో అదృశ్యమయ్యాడు. విస్కాన్సిన్‌లోని కాంకార్డియా వర్సిటీలో మాస్టర్స్ చదువుతున్న రూపేశ్ ఆచూకీ వారం రోజులుగా తెలియడం లేదని అమెరికాలోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. మే2 నుంచి రూపేశ్ ఆచూకీ కోసం ప్రవాస భారతీయులతో సంప్రదింపులు జరుపుతున్నామని షికాగోలోని భారత రాయబార కార్యాలయం, అక్కడి పోలీసులు వేర్వేరు ప్రకటన లు చేశారు. అమెరికాలో భారతీయ విద్యార్థుల మరణాలు అధికమవుతున్న నేపథ్యంలో రూపేశ్ తల్లిదండ్రులు సదానందం, ఉమ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రూపేశ్‌తో మే 2న చివరిగా మాట్లాడామని, మరుసటి రోజు ఫోన్ చేయగా మొబైల్ స్విచ్ ఆఫ్ వచ్చిందని సదానందం తెలిపారు. రెండ్రోజులు వేరే స్నేహితుడి వద్దకు వెళుతున్నానని రూపేశ్ చెప్పినట్లు అతని రూమ్‌మేట్స్ తెలిపారని వివరించారు. వారంరోజులైనా కొడుకు ఆచూకీ తెలియకపోవడంతో అమెరికాలోని తానా సభ్యుల సహకారంతో కుటుంబసభ్యులు షికాగో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, సాయం కోరుతూ కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు కలిశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కూడా లేఖ రాశారు. కాగా, మెకానిక్ అయిన సదానందం రెండో కుమారుడైన రూపేశ్ ఎంఎస్ చేసేందుకు 2019లో లండన్ వెళ్లాడు. 2022లో స్వదేశానికి వచ్చిన రూపేశ్ డబుల్ ఎంఎస్ చేసేందుకు 2023 డిసెంబరులో అమెరికా వెళ్లాడు.

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాల్‌కు ఆర్టీసీ నోటీసులు

ఆర్మూర్ టౌన్, మే 9: బీఆర్ఎస్ ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి చెందిన మాల్‌కు ఆర్టీసీ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని జీవన్‌రెడ్డికి చెందిన కాంప్లెక్స్‌కు సంబంధించిన రూ. 3 కోట్ల 14 లక్షల బకాయిలు చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు బకాయిలు చెల్లించకుంటే మాల్‌ను సీజ్ చేస్తామని మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేసుకుంటూ అధికారులు మాల్ మొత్తం తిరిగారు.

'ఆంధ్రజ్యోతి' బిజినెస్ ఎడిటర్

బాలాజీ కన్నుమూత

» 27 ఏళ్లపాటు బిజినెస్ జర్నలిస్ట్‌గా సేవలు



హైదరాబాద్ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయుడు.. 'ఆంధ్రజ్యోతి' బిజినెస్ ఎడిటర్.. గార్లపాటి బాలాజీ (54) తీవ్ర అనారోగ్యంతో గురువారం ఉదయం కన్నుమూశారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన బాలాజీ ఆర్థిక శాస్త్రంలో ఎంఏ పూర్తి చేసి 1997లో పాత్రికేయ వృత్తిలోకి ప్రవేశించారు. తొలుత ఈనాడు బిజినెస్ డెస్క్‌లో సబ్ ఎడిటర్‌గా చేరారు. అనంతరం ఆ సంస్థలోనే కొన్నేళ్లు రిపోర్టర్‌గా పనిచేశారు. 2018లో 'ఆంధ్రజ్యోతి'లో చేరి.. బిజినెస్ ఎడిటర్‌గా సేవలందించారు. 27 ఏళ్లుగా బిజినెస్ జర్నలిజంలోనే ఉన్న ఆయన కెరీర్ మొత్తం హైదరాబాద్ కేంద్రంగానే కొనసాగింది. అయితే, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయన తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. అప్పట్నుంచీ.. హైదరాబాద్‌లోని తన ఇంటిలోనే చికిత్స పొందుతున్నారు. వారం రోజుల క్రితం ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో గుంటూరుకు తీసుకెళ్లి, అక్కడ ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. బుధవారం రాత్రి నుంచి ఆయన పరిస్థితి విషమించిందని.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని.. గురువారం ఉదయం కన్నుమూశారని కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు స్వగ్రామం చీరాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కాగా, బాలాజీకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలిద్దరూ వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు.

బెయిల్ కోసం హైకోర్టుకు కవిత

న్యూఢిల్లీ, మే 9: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నమోదు చేసిన కేసులో బెయిల్ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. రౌస్ అవెన్యూ కోర్టు తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడాన్ని ఆమె సవాల్ చేశారు. సీబీఐ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌ను కూడా ట్రయల్ కోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. కవిత తాజా వ్యాజ్యంపై ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టనుంది.

కోరుట్ల ఆస్పత్రిలో ఘటనపై సమగ్ర విచారణ

» వ్యక్తి మృతికి బాధ్యులపై కఠిన చర్యలు: వైద్య ఆరోగ్య శాఖ

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల ఏరియా ఆస్పత్రిలో ఓ వ్యక్తి మృతి ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించామని, పూర్తి వివరాలు అందాక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య శాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఘటనపై జగిత్యాల డీఎం అండ్ హెచ్‌వో డా.పి.శ్రీధర్ ప్రాథమికంగా జరిపిన విచారణ మేరకు ఆ సమయంలో డ్యూటీలో ఉండాల్సిన డ్యూటీ మెడికల్ ఆఫీసర్ డా.వి.శ్రావణ్ కుమార్ అందుబాటులోలేరని తేలినట్లు ఆరోగ్య శాఖ పేర్కొంది. దాంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిపింది. కాగా, విధుల్లో ఉన్న సిబ్బందిపై మృతుడి బంధువులు దాడి చేశారని, ఆస్తులను ధ్వంసం చేశారని, బాధ్యులైన ఫయాజ్, మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపింది.

మూడ్రోజులు మోస్తరు వర్షాలు

రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. తేలికపాటి నుంచి ఓ మోస్తరు స్థాయిలో వర్షాలు కురవనున్నాయని తెలిపింది. వర్షాలతో ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 26 డిగ్రీల నుంచి గరిష్ఠంగా 42 డిగ్రీల వరకు ఉండనున్నాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. అత్యధికంగా ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, కుమురంభీం, మంచిర్యాల, వరంగల్, కామారెడ్డి, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, జిల్లాల్లో 42.2 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. మరోవైపు జీహెచ్ఎంసీ పరిధిలో కూడా తేలికపాటి నుంచి ఓ మోస్తరులో వర్షాలు కురవనున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టనున్నాయి. మొన్నటిదాకా 45 డిగ్రీలు నమోదైన ఉష్ణోగ్రతలు గురువారం 42.9 డిగ్రీలకు చేరాయి.

జూన్ 3 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్నామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం తగిన ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులకు గురువారం ప్రత్యేక ఆదేశాలు ఆమె జారీచేశారు. పరీక్ష ఫీజు స్వీకరించడం, ఫెయిలైన విద్యార్థుల మెమోల జారీ లాంటి పనులకు బోధనేతర సిబ్బంది తప్పకుండా అందుబాటులో ఉండేలా ప్రధానోపాధ్యాయులు చూడాలని కమిషనర్ ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జనాభా విశేషాలు

బిడ్డలు ఎక్కువ కన్నతల్లినే భాగ్యవతన్నారానాడూ, సౌభాగ్యవతన్నారానాడూ/ బిడ్డలు లేని గొడ్రాలికే గౌరవమన్నారీనాడు— యాభై ఏండ్ల కిందట ఎన్ టి రామారావు తన సొంత సినిమాలో ఈ పాటను అందించారు. ఇక్కడ పలుకు కొసరాజుది అయినా, భావం ఎన్టీయార్‌దే. ఆయనకు కుటుంబ నియంత్రణ మీద భిన్నమయిన అభిప్రాయం ఉండేదని ఆయన పిల్లల సంఖ్యను బట్టే అర్థం చేసుకోవచ్చు. పరిమిత సంతానం అన్న భావన ఆనాటికి ఇంకా సార్వజనీనం కాలేదు. దాన్ని పిదపకాలపు పోకడగా భావించినవారూ ఉండేవారు. కుబేరులకు ఎందరు సంతానమున్నా భాగ్యమే అనుకోవచ్చును కానీ, కుచేలురకు అధిక సంతానం దౌర్భాగ్యమే అవుతుందని మన సమాజం క్రమంగా అర్థం చేసుకుంటూ వస్తోంది. ధనమున్నా లేకపోయినా మిత సంతానమే ఆధునిక కాలంలో, పిల్లల పోషణకు, వికాసానికి ఉత్తమమని అనుభవపూర్వకంగా తెలిసివస్తోంది. ఈ అవగాహన సర్వవ్యాప్తం కావడం ఇంకా పూర్తి కాలేదు.

ఫలానా మతం వారు ఎక్కువ మంది పిల్లలను కంటున్నారని, ఇక దేశమంతా వారి చేతిలోకి వెళ్లిపోతుందని అనవసరపు భయాలు కల్పిస్తున్న శక్తులు కొన్ని ఉన్నాయి. అంకెలను పైపైన మాత్రమే చూసి, వాస్తవాన్ని విస్మరించే దుర్గుణం ఆ శక్తులకు ఉన్నది. అధికసంతానం ఏ మతవర్గానికి ఉన్నా, కులంలో ఉన్నా, అది ఆ సామాజిక శ్రేణిలో ఉన్న వెనుకబాటుతనాన్ని మాత్రమే సూచిస్తుంది. అంతేకాదు, ఆ సామాజిక వర్గంలో ఆడవారి స్థితిగతులను, ప్రతిపత్తిని కూడా అధిక జనాభారేటు సూచిస్తుంది. అంతమాత్రమే కాదు, ఈ వెనుకబాటు తనం, విద్యారాహిత్యం, అవగాహనారాహిత్యం, దారిద్ర్యం కులమతాలకు పరిమితమైనవే కావు, ప్రాంతాలను బట్టి కూడా ఆ పరిస్థితులు నెలకొని ఉంటాయి. అదే మతంవారిలో, అదే కులంవారిలో ఇతర ప్రాంతాల్లో భిన్నమయిన ఎంపికలు కనిపిస్తాయి.

నిజమే, 1951 నుంచి 2011 దాకా అరవై ఏండ్ల కాలంలో, ముస్లిముల జనాభా 4 శాతం పెరిగింది. ఆ మేరకు హిందువుల జనాభా శాతం తగ్గింది. ఇంత మాత్రమే చెబితే, అవి గణాంక వివరాలే కావు. ఈ నాలుగు శాతం పెరుగుదల అరవయ్యేండ్ల కిందట కనిపించిన వేగం ప్రకారం జరిగిందా? ఆ వేగంలో హెచ్చుతగ్గులు ఉన్నాయా? మరో 30, 40 ఏండ్లకు, లేదా మరో అరవయ్యేళ్లకు ఆ పెరుగుదల ఎనిమిది శాతమో, అంతకంటె ఎక్కువో కానున్నదా? ఈ ప్రశ్నలు వేసుకోకపోతే, కేవలం 4 శాతం పెరుగుదల అన్న సమాచారం అర్థం కాదు. ముస్లిమ్ స్త్రీ జీవిత కాలంలో జన్మనిస్తున్న సంతానం 1992లో 4.4 (అంటే 100 మంది ముస్లిమ్ స్త్రీలు తమ గర్భధారణ యోగ్య వయస్సులో 440 మంది సంతానాన్ని కంటారు), అదే , 2015 వచ్చే సరికి ఆ రేటు 2.6కు (అంటే 100 మంది ముస్లిమ్ మహిళలు 260 మంది పిల్లలకు జన్మనిస్తున్నారు) తగ్గిపోయింది. హిందూ స్త్రీల సంతాన శీలత 1992లో 3.3 కాగా, అది 2015లో 2.1కు తగ్గిపోయింది. ఇప్పటికీ ముస్లిమ్ స్త్రీల సంతానశీలత ఎక్కువే, కానీ, అది పతనోన్ముఖంగా ఉన్నది. హిందువులలో కంటె వేగంగా తగ్గిపోతూ వస్తున్నది. అంటే త్వరలో, హిందూ ముస్లిమ్ మతస్థుల మధ్య ఉన్న సంతానశీలత అంతరం సరిసమానం కావడం జరుగుతుంది. ఇది ఎట్లా జరిగింది? పరిమిత కుటుంబం ఆవశ్యకతను గుర్తించడం వల్ల. ఆ గుర్తింపు ఎట్లా వస్తుంది? విద్య వల్ల, అవగాహన వల్ల. ఎంతమంది పిల్లలను కనాలన్న నిర్ణయంలో వారి వారి మతం కానీ, కులం కానీ వేసే ప్రభావం అతి తక్కువ. సాంస్కృతికంగా, ఆర్థికంగా ఆ శ్రేణుల స్థితిగతులే ఆ నిర్ణయం వెనుక కారణాలుగా ఉంటాయి. సంతానం పరిమితం చేయాలన్న ఆలోచన వెనుక ఆయా సామాజిక శ్రేణుల స్త్రీలు, ముఖ్యంగా నిరుపేద స్త్రీలు తీసుకున్న చొరవ అధికం.

దేవుడు ఇస్తుంటే, మనం కాదనడం ఎందుకు-— అనే ధోరణి అన్ని మతాలలోను ఉంటుంది. కుటుంబ నియంత్రణ కూడా దైవేచ్ఛే అని నమ్మకం కుదిరిన తరువాత, ఆడ, మగ వ్యత్యాసాలు నియంత్రణ తీరును ప్రభావితం చేశాయి. ఆడపిల్లయినా, మగపిల్లవాడయినా ఒకటే, మగపిల్లల కోసం పిల్లల్ని కంటూ పోనక్కరలేదు అన్న అవగాహన పెంపొందడానికి సమానత్వ భావాలు వ్యాపించవలసి వచ్చింది. ఇప్పటికీ దేశంలో అనేక ప్రాంతాలు తక్కిన ప్రాంతాల కంటె వెనుకబడి, అధిక జనాభాతో ఉన్నాయి. జననమరణాలు సరిసమానం అయ్యే రీతిలో జనాభా నియంత్రణ (2.1)ను కేరళ 1998లో, తమిళనాడు 2000లోనే సాధించాయి. 2005లోపు దక్షిణాది రాష్ట్రాలు అన్నీ ఆ మజిలీ చేరుకున్నాయి. ఈ స్థాయి చేరుకోవాలంటే బిహార్ 2039 దాకా నిరీక్షించాలి. బిహార్ తో పాటు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ ఇంకా జననమరణాల సరిసమాన రేటును అందుకోవలసి ఉన్నాయి. గత యాభై ఏండ్ల కాలంలో దక్షిణాది రాష్ట్రాల తలసరి ఆదాయం బాగా పెరిగింది. జనాభా బాగా తగ్గింది. ఉత్తరాది రాష్ట్రాల పరిస్థితి ఇందుకు పూర్తి తలకిందులు. నిధుల కేటాయింపులో జనాభాకు పెద్దపీట వేస్తారు. అందుకే నిధుల విషయంలో 15వ ఆర్థికసంఘం ఎదుట దక్షిణాది రాష్ట్రాలు నిరసన వ్యక్తం చేశాయి. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు తక్కువ నిధులివ్వడం ఏమి న్యాయం అని ప్రశ్నించాయి.

జనగణన అన్నది తలకాయల లెక్కింపు కాదు. దేశంలోని మానవవనరుల సర్వస్వం అది. దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక వాస్తవికతలకు ముడిసరుకు. అదే సమయంలో, వనరులకు, వసతులకు, జనసంఖ్యకు మధ్య ఆరోగ్యకరమైన నిష్పత్తిని నిర్వహించేందుకు పనికివచ్చే ప్రాతిపదిక. ప్రపంచపు లెక్కలతో పోల్చుకుంటే కొద్దిగా వెనుకబడిన మాట నిజమే కానీ, జనాభాను తగినంత స్థాయిలో తగ్గించే ప్రయాణంలో భారత్ చురుకుగానే కదులుతున్నది. జనాభా పెరుగుదలకు ప్రజలలోని కొందరిని పనిగట్టుకుని దోషులను చేసే ధోరణి పోవాలి. అణగారిన, వెనుకబడిన శ్రేణులలో, మారుమూల గ్రామసీమలలోనే ఇంకా కుటుంబ సంక్షేమ సందేశం చేరలేదు. అందుకు కారణాలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలి.

మన ఓటుకు ఏదీ నైతిక కొలమానం?



ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల స్థాయికి దిగజార్చి చాలా కాలం అయ్యింది. ఎంతలా అంటే ప్రపంచవ్యాప్తంగా నియంతలు కూడా ఎన్నికలు అనే ముసుగు వేసుకోడానికి ఆత్రుత పడుతున్నారు. కానీ ఎన్నికలు సక్రమంగా జరిగితే ఓటు వేయడం ఏ విధంగా ప్రజాస్వామ్య ప్రక్రియో ఆలోచించాలి. ఓటు వేయడంలో ఒక ప్రత్యేకమైన వ్యవహారం ఇమిడి ఉంది. ఇందులో ప్రజలు తమకు ఉమ్మడిగా 'స్వంతమైన' దానిని ఇంకొకరి చేతికి ఉద్దేశపూర్వకంగా బదలాయించడం ఉంది. తమను తాము పరిపాలించుకొనడం అనేది ప్రజాస్వామ్యంలో ప్రజల ఉమ్మడి సంపద. ఇందులో ప్రజలందరికి భాగస్వామ్యం ఉంది. ఈ ఉమ్మడి సంపదను నిర్వహించే బాధ్యతను ప్రజలు కొద్దిమంది రాజకీయ నాయకుల చేతిలో ఓటింగ్ ద్వారా పెడతారు. ప్రజాస్వామ్యం అంటేనే ప్రజల తరఫున, వారి స్థానంలో, వారి పరోక్షంలో కొద్దిమంది పాలించేది. ప్రజల తరఫున పాలించడం అంటేనే నిరంకుశత్వానికి అవకాశం ఉందనేది స్పష్టం. అరుదుగా తప్ప ప్రజాస్వామ్యం ఎప్పుడూ ప్రజల చేత నడిపించబడేది కాదు. అంటే మరింత జాగ్రత్తగా ఓటు వేయాలని అర్థం. పుతిన్ కూడా 97శాతం ఓట్లతో ప్రజల తరఫున ఎన్నికయినట్టు ప్రకటించుకున్నాడు.

ప్రజలందరికీ మంచి చేసేదే నిజమైన ప్రజాస్వామ్యం అనే మాటను తరుచు వింటుంటాం. కానీ ప్రజలు అనే పదంలో అందరూ అనే అర్థం చరిత్రలో ఎప్పుడూ లేదు. నోరున్నవారి, బలమున్న వారి ప్రయోజనాలే ప్రజల ప్రయోజనాలుగా చలామణీ అవుతూ వచ్చింది. బానిసల, కింది కులాల, స్త్రీల, శ్రామికుల ప్రయోజనాలు ప్రజల ప్రయోజనాలుగా చాలా కాలం చలామణీ కాలేదు. అయినా ప్రజా ప్రయోజనం అనే మాట చాలా కాలంగా చలామణిలో ఉంది. ప్రజాస్వామ్యంలో పేదల శాతం తీవ్రంగా పడిపోలేదనేది వాస్తవం. ఆ అర్థంలో ఆచరణలో ప్రజాస్వామ్యం 'ప్రజల కొరకు' పనిచేయడం లేదు. 'అందరి ప్రయోజనాలు తీరుస్తాం' అనే వాదనను నియంతృత్వ వ్యవస్థలు కూడా వాడుకుంటాయి. అది ప్రజాస్వామ్య వ్యవస్థలకు ప్రత్యేకం కాదు. కాబట్టి ప్రజాస్వామ్యం అనే మాటను నిజమైన అర్థంలో ఏ రాజకీయ పార్టీ అయినా వాడితే, అది సమాజంలో ఎటువంటి సామాజిక బలం, గొంతు లేని అత్యంత అట్టడుగు వర్గాల ప్రయోజనాలకు ముందు పీట వేసిందా లేదా అనే నైతిక కొలమానాన్ని వెతకాలి. అంటే మెజారిటీ ప్రజల ప్రయోజనాలు అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకు కొలమానం కాదని మనం గుర్తించాలి.

సమాజంలో బడుగు వర్గాలు పాల్గొన్నంత చురుకుగా సంపన్నులు ఓటింగ్‌లో పాల్గొనరు. పేదలు డబ్బులు, వినియోగ వస్తువుల కోసం ఓట్లు వేస్తారని మధ్యతరగతి అంటుంది. మతపరమైన కారణాల రీత్యా మైనారిటీలు ఓటు వేస్తారని మెజారిటీ వాదులు అంటారు. కులం రీత్యా ఓటు వేసేవారు కూడా బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తున్నారనేది ఇంకొక ఎత్తిపొడుపు. ఈ వాదనలు అన్నీ ఏదో ఒక భావజాల ప్రభావానికి లోనై ఓటు వేసే వారికి కూడా వర్తిస్తుంది. ఇవన్నీ ఓటు వేయడానికి ఒక ప్రత్యేకమైన కారణం ఉందనే విశ్వాసం రీత్యా చేసేవే. ఏదో ఒకటి ఆశించి ఓటు వేయడం ఎప్పుడు ఒక రాజకీయ వ్యవహారమే.

> ప్రజాస్వామ్యాన్ని అత్యంత నిమ్న వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేసేదని నిర్వచిస్తే, ఓటు వేయడాన్ని స్వప్రయోజనం కోసం వేసేదిగా పరిగణించకూడదు. అంటే నేను ఓటు వేసేది నా కంటే ఎక్కువ సమస్యలు ఎదుర్కొంటున్న వారి తరఫునే తప్ప నా తరఫున కాదు– ఈ అర్థంలో మాత్రమే ఓటు వేయడం అనేది ఒక నైతిక, సామాజిక విధి.

ఓటు వేయడం ఎలాంటి బాధ్యత, ఎవరి పట్ల బాధ్యత? ప్రతి ఓటరుకు తెలుసు తన ఓటు వేల ఓట్లలో ఒక చిన్న భాగమని, తన ఓటుకు అంతిమ ఫలితానికి మధ్య ప్రత్యక్ష సంబంధం లేదని. ఎన్నికైన ప్రతినిధులు తమ అధికారాన్ని, సంపదను పెంచుకున్నంత కాలం, 'ఓటేస్తే నాకేమొస్తది' అనే వ్యవహారం చాలా సహజం. పాలన వ్యాపారం అయిన తర్వాత, ఓటరు తన ధరను ఎందుకు అడగకూడదు? డబ్బు ఆశించే ఓటర్లు ప్రజాస్వామ్యం 'ప్రజల కొరకు' అనే వాదనలోని డొల్లతనాన్ని ఎత్తి చూపుతున్నారు. సామాజిక సంబంధాలను డబ్బుమయం చేసిన మార్కెట్టు సాధించిన విజయంగా దీన్ని చూడవచ్చు. ఎటొచ్చి, లాభాలను ఆశించే రాజకీయ నాయకుడు ఎన్నికలలో పెట్టుబడి పెట్టడానికి వెనుకాడడం లేదు. ఎన్నికైన ప్రతినిధులు లాభాలు సంపాదించు కుంటుంటే ఓటింగును వ్యాపారంగా ఎందుకు పరిగణించకూడదు? ఆ లాభాల్లో భాగాన్ని ఓటరు ఎందుకు ఆశించకూడదు? తాము చేసే సేవకు (ఓటు వేసే సేవకు) సాధ్యమైనంత లాభం పొందాలని ఒక పేద ఓటరు ఆశిస్తే, అతనిని తప్పు పట్టే నైతిక హక్కు, పన్నులు చెల్లించడం తప్ప తమకు ఏమీ ఒరగదని ఓటు వేయని మధ్య తరగతికి ఉందా? పేద ఓటరును ఆడిపోసుకునే హక్కు రాజకీయ పొలంలో మేసే ధనిక వర్గానికి అసలే లేదు.

ఇదంతా ప్రజాస్వామ్యంలో భాగం కాదని మనకు తెలుసు. ప్రజాస్వామ్యాన్ని అత్యంత నిమ్న వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేసేదని నిర్వచిస్తే, ఓటు వేయడాన్ని స్వప్రయోజనం కోసం వేసేదిగా పరిగణించకూడదు. అంటే నేను ఓటు వేసేది నా కంటే ఎక్కువ సమస్యలు ఎదుర్కొంటున్న వారి తరఫునే తప్ప నా తరఫున కాదు— ఈ అర్థంలో మాత్రమే ఓటు వేయడం అనేది ఒక నైతిక, సామాజిక విధి.

ఎన్నుకోబడే ప్రతినిధి ప్రజల తరఫున ధర్మకర్తగా వ్యవహరించాలి. తమ మీద ఉంచిన విశ్వాసాన్ని ధ్వంసం చేయకూడదు. ప్రజాస్వామ్యానికి ఇది ఒక శక్తివంతమైన అర్థం. ఈ విస్తృతమైన అర్థాన్ని ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఒక సాధనంగా మాత్రమే భావించే వైఖరి ధ్వంసం చేసింది. అందుకే నిజమైన అర్థంలో మన ప్రతినిధి ఎలా పనిచేసాడు అనేది కాక అతను ఏ మేరకు జవాబుదారిగా మెలిగాడు అనేది ప్రజాస్వామ్యానికి కొలమానం. కానీ ఇప్పటికే తాము ఎంతో చేసాం అనేవారైనా, రాబోయే కాలంలో ఎంతో చేస్తాం అనేవారైనా తాము ప్రజలకు జవాబుదారిగా ఇప్పటివరకు ఉన్నారా, ఆ స్వభావం వాళ్ళలో ఉందా అనే విషయం చెప్పడం లేదు. ఈ అంశం ఏ రాజకీయ పార్టీ మేనిఫెస్టోలో లేకపోవడం కొట్టొచ్చేలా కనిపించే అంశం.

ప్రజాస్వామిక వ్యవస్థను ధ్వంసం చేసి పేదలకు సంక్షేమాన్ని ప్రకటిస్తున్నారనేది మధ్య తరగతికి రాజకీయాల పట్ల ఉండే ఆక్షేపణ. ప్రజాస్వామ్య వ్యవస్థలుగా చలామణి అయ్యేవి తమ సమస్యలు తీరుస్తాయి అని విశ్వసించే పేదలు ఎవరూ ఈ రోజు లేరు. ఈ వ్యవస్థలు పేదల అవసరాలు తీరే విధంగా రూపొందకపోవడం వెనక మధ్య తరగతి పాత్రా ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల పట్ల కింది మధ్య తరగతికి ఉన్న తరగని ఆశ వెనక అధికారం, దాంతో వచ్చే ప్రయోజనాల పట్ల చర్చ బాహాటంగానే జరగడం చూస్తాం. కులాన్ని, మతాన్ని, డబ్బును ఎరగా వేసి ఉద్యోగాలు సంపాదించే ప్రయత్నాలు చేసేవాళ్ళు ప్రజలకు సేవ చేయడానికి చేయడం కాదు. కానీ ఈ వ్యవస్థలు ఎంతగా పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తే, సమస్యల్లో ఉన్న ప్రజలు అంతగా వీటిని ధ్వంసం చేసైనా తమకు న్యాయం చేస్తాననే మాయచేసే నియంతలను ఎన్నుకోడానికి సిద్ధపడతారు. బలమైన నాయకుడు అనే భావన వెనక, తమ పురోగతికి అడ్డుపడే వ్యవస్థల కన్నా బలమైన నాయకుడు అనే భావన అంతర్లీనంగా ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థల ఫలాలను కింది వర్గాల దాకా రాకుండా చేస్తే జరిగే పరిణామాలు ప్రపంచ వ్యాప్తంగా నియంతలు ఎన్నిక కావడంలో చూడవచ్చు. ప్రజాస్వామ్యానికి వస్తున్న ముప్పు గురించి వగచే మధ్యతరగతి ప్రజాస్వామ్యం పరిధిని విస్తృతం చేయడం ద్వారా మాత్రమే ఎదుర్కోగలదు. తమకు పనిచేయని ప్రజాస్వామ్యాన్ని మేమెందుకు కాపాడాలి అనే శ్రామిక వర్గం ప్రశ్నకు మధ్యతరగతి దగ్గర సమాధానం లేదు.

నమ్మకం అనే నైతిక విలువ లేకుండా ప్రజాస్వామ్య పునాదులు ఉండవు. వివక్షకు తావులేకుండా, న్యాయబద్ధంగా మనకు ప్రాతినిధ్యం వహిస్తాడు అనే నమ్మకం మీద ఆధారపడి మనం ఓటు వేయగలగాలి. మనుషుల మధ్య సంబంధాలను కలిపేది గుణాత్మకమైన ఈ విశ్వాసమే. అందుకే విశ్వాస ఘాతుకమే అన్నిటికంటే హీనమైనది. ఈ విశ్వాసం ఒక ఆదర్శం మాత్రమే కాదు, ఒక ఆచరణా మార్గం కూడా. నిత్య జీవితంలో మనం ఆందోళన చెందకుండా జీవించాలంటే మన చుట్టూ ఉన్నవారు తాము చేయాల్సిన పని చేస్తారనే నమ్మకం కలగాలి. సామాజికంగా తమకన్నా దిగువన ఉన్నవారి కోసం తాము వేసే ఓటులో ఈ నైతిక కర్తవ్యాన్ని మధ్య తరగతి గుర్తెరగాలి. ఇతర వర్గాల అభివృద్ధికి హామీ పడే పార్టీకి ఓటు వేయడంలో రాజ్యాంగ విలువైన సౌభ్రాతృత్వానికి ప్రాణం పోసే పాత్రను ప్రతి ఒక్కరు పోషించవచ్చు. మొత్తం సమాజం తరఫున ధర్మ కర్తృత్వం వహించవచ్చు. వర్గాలకు అతీతంగా 'భారతీయ ప్రజలమైన మేము' అనే అమాయకమైన రాజ్యాంగ భావనకు ప్రాణం పోయవచ్చు.

రాజకీయ ప్రజాస్వామ్యంలో ప్రజలందరికీ సమాన అధికారం అనేది అమాయకమైన విషయమే. కానీ, అది కొద్దిగానైనా సాకారం కావాలంటే అధికారం చెలాయించే వాళ్లలో విశ్వాసం, ధర్మ కర్తృత్వం, జవాబుదారీతనం అనే విలువలు చాలా అవసరం. మనమున్నది ఆదర్శాలకు కాలం కానీ మాట నిజమే. కానీ ఓటు ద్వారా అధికార వ్యవస్థలను సృష్టించే వర్గాలు, ముఖ్యంగా మధ్య తరగతిలోనే ఈ ఆదర్శాలు కొద్దిగానైనా లేకపోతే, ఇక రాజ్య వ్యవస్థలో వాటిని ఆశించలేం.

• మురళి కర్ణం

హరిత ఆర్థికం సమ్మిళితమేనా?

హరిత ఆర్థిక వ్యవస్థలుగా శీఘ్రగతిన పరివర్తన చెందేందుకు ప్రపంచ దేశాలు ఆరాటపడుతున్నాయి. ఇంధన వ్యవస్థలలో బొగ్గు, గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా పునరుద్ధరణీయ పవన, సౌరశక్తి వనరులను; రవాణా రంగంలో పెట్రోలియం ఉత్పత్తులకు బదులుగా విద్యుత్‌ను, పరిశ్రమలలో శిలాజ ఇంధనాలకు మారుగా హైడ్రోజన్‌ను ఉపయోగించుకునే దిశగా ప్రపంచ దేశాలన్నీ చురుగ్గా చర్యలు చేపడుతున్నాయి. అడ్డూ అదుపు లేకుండా భూ తాపం తీవ్రమవుతుండడం, తత్పర్యవసానంగా వాతావరణ వైపరీత్యాలకు కారణమవుతున్న కర్బన ఉద్గారాలను నియంత్రించేందుకు, ఇంధన వ్యవస్థలు, రవాణా రంగం, వస్తూత్పత్తి కార్యకలాపాలలో చోటు చేసుకుంటున్న మౌలిక మార్పులు దోహదం చేయగలవని ప్రభుత్వాలు ఆశిస్తున్నాయి.




■ సునీతా నారాయణ్

మట్టివాసన

హరిత ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రపంచ దేశాలు మరింత వేగంగా, సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన బృహత్ చర్యలతో పురోగమించవలసి ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే కొత్త హరిత ప్రపంచానికి మనం తీసుకువెళ్లే (వనరుల వినియోగ, ఉత్పాదక కార్యకలాపాల నిర్వహణ) విధానాలు, పద్ధతులు ఎలా ఉండనున్నాయి? అవి హరిత ఆర్థిక వ్యవస్థ లక్ష్యాల పరిపూర్తికి తోడ్పడుతాయా? సహజ వనరులను ఉపయోగించుకోవడంలో మనం అనుసరిస్తున్న పాత పద్ధతులలో స్వతస్సిద్ధంగా పలు సమస్యలు ఉన్నాయి. ఇవి సామాజిక, పర్యావరణ వ్యవస్థలను ప్రతికూలంగా, మరింత కచ్చితంగా చెప్పాలంటే విధ్వంసకరంగా ప్రభావితం చేస్తున్నందునే హరిత ఆర్థిక కార్యకలాపాలలో సైతం మనం పాటించే పద్ధతుల గురించి ప్రశ్నించడం అనివార్యమయింది.

ఖనిజాల వెలికితీతనే తీసుకోండి— బొగ్గు, ఇనుము, అల్యూమినియం మొదలైన ఖనిజాలు మన ఆర్థిక వ్యవస్థలకు మౌలిక అవసరాలు. అయితే భూగర్భం నుంచి వాటి వెలికితీత పర్యావరణ విధ్వంసానికి దారితీస్తోంది. భారత్‌లో ఈ ముడి పదార్థాలు అడవుల కింద, వన్యప్రాణుల ఆవాస ప్రదేశాలలోను, గిరిజన ప్రాంతాలలో ఉన్నాయి. పర్యావరణ భద్రతకు, ప్రజా శ్రేయస్సుకు హాని వాటిల్లకుండా ఆ సహజ సంపదను ఉపయోగించుకోవడం ఎలా? ఇదొక విపత్కరమైన పరిస్థితి. వనరుల విపత్తు అనేది సంపద్వంత భూములు, పేద ప్రజలకు సంబంధించిన సమస్య. మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి అవసరమైన ఖనిజాలను సమకూర్చుకునేందుకు మనం అడవులను నరికివేస్తున్నాం; స్థానిక జనసముదాయాలను నిర్వాసితులను చేస్తున్నాము. ఖనిజాల వెలికితీత అనేది మనం అనుసరిస్తున్న ఆర్థికాభివృద్ధి నమూనాలో చాలా కీలకమైన కార్యకలాపం. దానివల్ల ప్రభుత్వాలకు గణనీయమైన ఆదాయం సమకూరుతున్నది. అయితే ఆ సహజ వనరులు ఉన్న ప్రాంతాలలో నివశిస్తున్న ప్రజలు ఆ వనరుల నుంచి అతి తక్కువగా, అదీ అరుదుగా మాత్రమే లబ్ధి పొందుతున్నారు. ఇది నిజంగా ఒక విషాదం. విధ్వంసకర వాతావరణ మార్పుకు దారితీస్తున్న కాలుష్యకారక వాయువుల ఉద్గారాలు మాత్రమే మన సమస్యలకు ప్రధాన కారణం కాదు సుమా!



కొత్త హరిత ప్రపంచానికి మనం తీసుకువెళ్లే (వనరుల వినియోగ, ఉత్పాదక కార్యకలాపాల నిర్వహణ) విధానాలు, పద్ధతులు ఎలా ఉండనున్నాయని ప్రశ్నించాను కదా. ఎందుకో వివరిస్తాను. కొత్త హరిత ఆర్థిక వ్యవస్థలో ప్రపంచానికి అవసరమైన ఖనిజాలు భిన్నమైనవి— లిథియం, నికెల్, కాపర్, కోబాల్ట్, గ్రాఫైట్ మొదలైనవి. అయినప్పటికీ అరణ్యాల కింద, ఆదివాసీలు, నిరుపేదలు నివశించే ప్రాంతాలలో లభ్యమయ్యే ఖనిజాలు సైతం అత్యంత అవసరమైనవే. ఇది మన దేశంలోనే కాదు, ప్రపంచ దేశాలన్నిటా వాస్తవమే. అమెరికాలో 97శాతం నికెల్, 89శాతం కాపర్, 79 శాతం లిథియం, 68 శాతం కోబాల్ట్ నిల్వలు నేటివ్ అమెరికన్ రిజర్వేషన్స్ (అమెరికా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించిన దేశీయ అమెరికన్ ఆదివాసీ జాతి పాలనలో ఉన్న భూములు)లో ఉన్నాయని న్యూయార్క్‌లోని మార్కెట్ కన్సల్టెన్సీ ఎమఎస్‌సి పేర్కొంది. లాటిన్ అమెరికా నుంచి ఆఫ్రికా, ఆసియా దాకా అంతటా ఇదే పరిస్థితి ఉన్నది.

> వాస్తవమేమిటంటే శిలాజ ఇంధనాల ఆధారిత పాత ఆర్థిక వ్యవస్థ సృష్టించిన సంపద నుంచి అత్యధిక ప్రజలు ఏ మాత్రం లబ్ధి పొందలేదు. మరి అధునాతన శిలాజేతర ఇంధనాల ఆధారిత కొత్త ఆర్థికం పర్యావరణ సమతుల్యతను కాపాడే, సామన్యుల శ్రేయస్సుకు హామీ పడే సమ్మళిత సమాజ నిర్మాణానికి దారి తీస్తుందా? అలా కాని పక్షంలో కొత్త ఆర్థికం కొత్తదీ కాదు, హరితమైనదీ కాదు.

భారత్‌లో ఖనిజాల వెలికితీత పర్యావరణానికి నిరపాయకరంగా, సామాజిక శ్రేయస్సుకు తోడ్పడే విధంగా ఉండేలా భారత్‌లో చాలా కాలంగా పోరాటాలు చేస్తున్నాం. అయితే సమస్యలకు కార్యసాధక పరిష్కారాలు లభించడం లేదు. చాలా సంవత్సరాల క్రితం సమతా (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రభుత్వేతర సంస్థ. ఆదివాసేతరులు ఇచ్చిన భూమిని గురించి సుప్రీంకోర్టులో కేసు వేసి గెలిచింది. ఆ భూములు ఆదివాసులకే చెందుతాయనేది సుప్రీంకోర్టు తీర్పు సారాంశం) కేసు తీర్పులో గిరిజనుల భూములలో మైనింగ్ కార్యకలాపాలు, గిరిజనుల భాగస్వామ్యం లేకుండా జరగకూడదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. గనుల వ్యాపారంలో గిరిజనులు సమాన వాటాదారులుగా ఉండితీరాలనేది ఆ తీర్పు స్పష్టీకరించింది. అయితే అలా జరిగిందా? సమాధానం స్పష్టమే. ఆ తరువాతనే, మైనింగ్ కార్యకలాపాల నుంచి సమకూరే ఆదాయంలో ఆదివాసులకూ వాటా కల్పించే ప్రయత్నం జరిగింది.

నిజానికి మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్న ప్రాంతాలలోని ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ఉనికి లోకి వచ్చిన డి[illegible] మినరల్ ఫౌండేషన్ (డిఎమఎఫ్) గనుల వ్యాపారంలో ఆ జన సముదాయాలను భాగస్వాములు చేసేందుకు కృషి చేసింది. అయితే ఈ సత్ప్రయత్నం పెద్దగా ఫలించలేదు. ఖనిజాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేసి, వారి అభ్యున్నతికి తోడ్పడాలనే సత్సంకల్పం అంతిమంగా ఖనిజాలపై అదనపు సెస్ విధింపుగా పరిణమించింది! ఈ పన్ను ద్వారా సమకూరిన ఆదాయాన్ని డిఎమఎఫ్‌కు జమ చేశారు. అయితే ఆ సొమ్మును, ప్రభుత్వం తాను అభివృద్ధి పనులుగా పరిగణించిన వాటికి, ఖనిజాలను కనుగొన్న ప్రాంతాల ప్రజల భాగస్వామ్యం లేకుండానే ఖర్చు చేసేందుకు ఉపయోగించింది.

పర్యావరణ, అటవీ సంబంధిత అనుమతుల విషయంలో కూడా ఇదే పరిస్థితి ఉన్నది. ఈ ప్రాజెక్టులను ఆమోదించడం లేక ఆమోదించక పోవడంపై స్థానిక జనసముదాయాలకు హక్కు ఉండేలా చేయడమేది ఒకప్పుడు లక్ష్యంగా ఉండేది. అయితే స్థానికుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవడమనేది రానురాను తగ్గిపోయింది. అభివృద్ధి సాధన పేరిట స్థానికుల మాటను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. అభివృద్ధి ప్రాజెక్టులపై స్థానికుల అభిప్రాయాలు, అభ్యంతరాలను విధిగా పరిగనలోకి తీసుకోవాలనే నిబంధనను చిత్తశుద్ధితో అమలుపరిచినట్టయితే సామాజికంగా సమ్మిళిత, పర్యావరణ పరంగా న్యాయమైన, భద్రమైన భవిష్యత్తును నిర్మించేందుకు దోహదం జరిగి ఉండేది.

ఇప్పుడు మళ్లీ ప్రశ్న ఏమిటంటే భూతాపాన్ని పెంచని అధునాతన శిలాజేతర ఇంధనాల ఆధారిత హరిత ఆర్థికంలో, స్థానిక ప్రజలకు మేలు జరిగేలా వివాదాలను పరిష్కరించడానికి దోహదం చేసే నిబంధనలను ప్రభుత్వాలు రూపొందిస్తాయా? పరివర్తన ఆరాటంలో అవే పాత పద్ధతులను మరింత లోపభూయిష్టంగా ఆచరిస్తాయా? వాస్తవమేమిటంటే శిలాజ ఇంధనాల ఆధారిత పాత ఆర్థిక వ్యవస్థ సృష్టించిన సంపద నుంచి అత్యధిక ప్రజలు ఏ మాత్రం లబ్ధి పొందలేదు. మరి అధునాతన శిలాజేతర ఇంధనాల ఆధారిత కొత్త ఆర్థికం పర్యావరణ సమతుల్యతను కాపాడే, సామన్యుల శ్రేయస్సుకు హామీ పడే సమ్మళిత సమాజ నిర్మాణానికి దారి తీస్తుందా? అలా కాని పక్షంలో కొత్త ఆర్థికం కొత్తదీ కాదు, హరితమైనదీ కాదు.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్,

భూపంపిణీతోనే రాజ్యాధికారం!

ప్రస్తుత రాజకీయాల్లో కింది కులాలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్తున్న సందర్భంలో దళితులకు రాజ్యాధికారం, వ్యవసాయ భూమి ఈ రెంటిలో ఏది ప్రధానం అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అవి ఒకటి వ్యవస్థకి, మరొకటి ఆర్థిక వనరుకి సంబంధించినప్పటికీ, వేరు వేరు అంశాలుగా కనిపించినప్పటికీ, ఒకదానితో ఒకటి సంబంధాన్ని కలిగి ఉంటాయి.

సాధారణంగా సామాజిక ఉద్యమాలు లక్ష్యాల వైపు ప్రయాణంలో విఫలమయ్యేది ప్రజలను సమీకరించడంలోనే. ముందుగా ప్రజలు ఏ సమస్య వలన ఇబ్బంది పడుతున్నారు, ఎందువలన ఉద్యమంలో భాగం కావట్లేదు అనేది పరిశీలన చేసుకోవాలి. నేను గ్రామీణ ప్రాంతాలలో పరిశోధన నిమిత్తం తిరిగినప్పుడు కింది కులాల్లో వ్యవసాయ భూమి లేకపోవడం ప్రధాన సమస్యగా గుర్తించాను. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్న దళితులు స్వంత భూమి లేని కారణంగా వ్యవసాయ కూలీలుగా ఉన్నారని గణాంకాలు చెప్తున్నాయి. అంటే భూమి ఉన్నా లేకున్నా వ్యవసాయ భూమి అనేది వారి రోజువారి జీవనోపాధికి ప్రధానమైనది. చారిత్రాత్మకంగా చూస్తే దళితులకు స్వాతంత్రం కంటే ముందు వ్యవసాయ భూమిపై హక్కు లేదు. అప్పుడు ఉన్న జమిందారీ, ఇనాందారీ, రైత్వారీ లాంటి వ్యవస్థలన్నీ కూడా ఆధిపత్య కులాలకు మేలు చేసినవే. కాబట్టి దళితులు భూమి పొందే అవకాశమే లేదు. ఉదాహరణకు, రాయలసీమ ప్రాంతంలో అప్పటి కలెక్టర్ థామస్ మన్రో అమలు చేసిన రైత్వారీ రెవిన్యూ వ్యవస్థను గమనిస్తే, పంట పండించే వనరులున్న ఎవరైనా భూమిని వ్యవసాయానికి వినియోగించుకోవచ్చు. అయితే దళితులకు వాళ్ళ లేబర్ పవర్ తప్ప ఎలాంటి వనరులు లేవు. అంటే ఈ రైత్వారీ వ్యవస్థ వల్ల ఎక్కువగా లబ్ధి పొందింది వనరులున్న అగ్ర కులాలే. ఈ విధంగా అప్పటి ఏ రెవిన్యూ వ్యవస్థ కూడా కింది కులాలకు మేలు చేయలేదు.

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వాలు భూ సంబంధిత చట్టాలు తెచ్చి దళిత, ఆదివాసి, వెనకబడిన వర్గాలకు భూ పంపిణీ చేసినప్పటికీ అది పూర్తి స్థాయిలో అవలేదు. ల్యాండ్ సీలింగ్‌లో కొంత మిగులు భూమి వచ్చినప్పటికీ అది కాలక్రమేణా మళ్ళీ అగ్రకులాల చేతుల్లోకి వెళ్లిపోయింది. దళితులలో ఉన్న కొద్దిపాటి రైతులను గమనిస్తే ఎక్కువ భాగం చిన్న సన్నకారు రైతులే.

అందుచేత, ఇక్కడ సామాజిక ఉద్యమాల ప్రధాన ఎజెండా రాజ్యాధికారం కంటే భూమిగానే ఉండాలి. ఇది తదుపరి సామాజిక చైతన్యం వైపు, రాజ్యాధికారంవైపు పయనించేందుకు దోహదం చేస్తాయి. సంక్షేమ పథకాలు దళితులకు ఎంత ముఖ్యమో అందులో భాగంగా భూమి, దాని అనుబంధ వనరులు కూడా అంతే ముఖ్యం. ప్రస్తుత ప్రభుత్వాలు సంక్షేమం పేరిట దళితులకు భూపంపిణీ చేయడాన్ని పూర్తిగా విస్మరించాయి. భూ పంపిణీ జరిగేలా పౌర హక్కుల సంఘాలు, మేధావులు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి.

– చిన్నరంగయ్య దండు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

కుర్చీలాట

ఓట్ల తంత్రం
మిత్రశత్రు బేధాలు
కుర్చీ సారాంశం
కుర్చీ బాట
జెండాల కుస్తీ కాట
రిఫరీ ఓటర్
వేయాలి ఓటు
ప్రజాబంధపుబలం
శాసన ధర్మం
కీచుకీచులు
కోతుల కొమ్మలాట
చూడ ముచ్చట
రోజుకో వేషం
ఎన్నికల వేదిక
నమ్మక ద్రోహం


– రేడియమ్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్ రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

సమగ్ర అభివృద్ధికి ఆక్సిజన్ రిజర్వేషన్లు

భారత రాజ్యాంగం దేశంలో అత్యంత వెనుకబడిన, అణచివేయబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు, ఆర్థికంగా బలహీనుల అభివృద్ధికి రిజర్వేషన్ల విధానం ద్వారా ఎంతో దోహదం చేసింది. ఈ విధానం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాలయాల అడ్మిషన్ల వంటి ప్రక్రియల్లో ఆయా వర్గాల ప్రవేశం సుగమమై వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతుల్లో విస్తృతమైన మార్పులు వచ్చినవి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రిజర్వేషన్ల వ్యవస్థను రద్దు చేయాలన్న ఉద్దేశంలో భాగంగా బీజేపీ తన పదేళ్ల పాలనలో వందకు పైగా ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో అమ్మివేసింది. ప్రభుత్వ సంస్థలు తగ్గితే ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గుతాయి. క్రమంగా రిజర్వేషన్లు నామమాత్రంగా మారతాయి. దీనితో పైన పేర్కొన్న వర్గాలన్నిటికీ ప్రాతినిధ్యం తగ్గుతుంది. ఇది బీజేపీ ఉద్దేశం. కాని కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో అణచివేయబడిన వర్గాల ప్రాధాన్యత పెంచటానికి 2024 ఎన్నికల మేనిఫెస్టోలో రిజర్వేషన్ల పరిమితి 50శాతం కంటే ఎక్కువగా పెంచుతామని ప్రకటించింది.

> కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్ గాంధీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున రేవంత్ రెడ్డి కుల గణనకు సంపూర్ణంగా కట్టుబడి ఉన్నారు. గాంధీ అన్నట్లు 'అన్ని కులాల సమగ్ర ఐక్యతే భారతీయతకు మూలం'. కులగణన ద్వారా రిజర్వేషన్లు పెంచి భారతీయ మూలవాసుల సమగ్ర సమ్మిళిత అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోంది.



బీజేపీ పదేళ్ల పాలనలో ప్రభుత్వ రంగ సంస్థల అమ్మటం, అనుయాయులకు ఓడ రేవులు విమానాశ్రయాలు ఇవ్వటం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం మినహా చేసిన అభివృద్ధి ఏమీ లేదు. పైగా ప్రధానమంత్రి మోదీ ఎన్నికల ప్రచారంలో తన స్థాయిని దిగజార్చుకుని ముస్లిం రిజర్వేషన్లు వంటి అంశాలపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయటం దురదృష్టకరం. అంతేగాక కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు తగ్గించి ముస్లింలకు 15శాతం రిజర్వేషన్లు ఇస్తుందని మరో అబద్ధపు ప్రచారం ప్రారంభించారు. వాస్తవానికి కాంగ్రెస్ ఎన్నికల పత్రంలో ఎక్కడా వీటి గురించి చర్చలేదు. అయితే భారత్‌లో తీవ్రంగా ఉన్న ఆదాయ అసమానతలను అంచనా వేసి ఆర్థిక విధానాల్లో మార్పులు తీసుకురావడం ద్వారా సంపద సమాన పంపిణీ చేస్తామని, ఆదాయ అసమానతల నిర్మూలన చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో తెలిపింది. ఈ అంశాన్నే మోదీ వక్రీకరించారు.

దేశంలో ముస్లింల సామాజిక వెనుకబాటుతనం ముస్లిం రిజర్వేషన్ల అవసరాన్ని తప్పనిసరి చేస్తున్నది. మన దేశంలో ముస్లింలు భారతీయ మూల సూత్రాలైన ఏకేశ్వరోపాసన, గురు పరంపర, అగ్నిపూజ, నాట్యం, సంగీతం వంటి అంశాలను అనుసరించే సూఫీ మార్గాన్ని అనుసరించేవారు, అంతేకాక, అధికులు పాస్మాండ ముస్లింలు. ముస్లింల స్థితిగతులపై నియమించబడిన రాజేందర్ సచార్, సుధీర్ కమిటీలు ముస్లింలు ఎస్సీ, ఎస్టీల కంటే వెనుకబడి ఉన్నారని తెలిపినాయి. కాబట్టి ముస్లిం రిజర్వేషన్లు అనేవి మత కోణంలో కాకుండా సామాజిక, ఆర్థిక కోణంలో పరిగణించబడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో అమలు అవుతున్నాయి. దాదాపు దేశవ్యాప్తంగా 15శాతం కన్నా ఎక్కువగా ఉన్న ప్రధాన మైనారిటీ వర్గం అయిన ముస్లింలను ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావటానికి ఈ రిజర్వేషన్లు దోహదం చేస్తాయి.

రిజర్వేషన్లను 50శాతానికి పెంచాలి అంటే కులగణన తప్పనిసరి. కులగణన ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల జనాభా వివరాలు తెలిసిన తర్వాత తదనుగుణంగా రిజర్వేషన్లు అమలైతే వారి ప్రాతినిధ్యం న్యాయంగా పెరిగి సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుంది. కులగణన ద్వారా ఆయా వర్గాలకు ప్రత్యేకంగా ప్రణాళికలు, విధానాల రూపకల్పన చేయడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది. దేశంలో 1931 నాటివి మినహా బీసీ గణాంకాలు అందుబాటులో లేవు. కాబట్టి దేశంలో కుల గణన ద్వారా బీసీ జనాభా లెక్కించడం ద్వారా వారి స్థితిగతులను అంచనా వేయవచ్చు. భారతీయ మూలవాసులు, భూమి పుత్రులు అయిన ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి కులగణన తప్పనిసరి అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మూలాల ఆధారంగా శూద్రునిగా ప్రకటించుకుని, వారి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, కులగణన ద్వారా వారికి ఖచ్చితంగా తగిన రాజకీయ, ఆర్థిక ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పటం గమనార్హం.

రిజర్వేషన్లు, రాజ్యాంగం, కులగణన వంటి అంశాల్లో బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యల పట్ల దేశ వ్యాప్తంగా తీవ్ర విమర్శలు ఎదురు కావడంతో బీజేపీ యుటర్న్ తీసుకుని మాట మారుస్తున్నది. ఓబీసీ వ్యతిరేకత వల్ల తమ ఓట్లకు గండి పడుతుందని రిజర్వేషన్లు రద్దు చేసే ఆలోచన లేదని వివరణ ఇచ్చుకుంది. కులగణనకు బీహార్‌లో బీజేపీ అనుకూలంగాను, కేంద్రంలో బీజేపీ వ్యతిరేకంగానూ ఉంటూ రెండు నాలుకల ధోరణి అవలంభించటం సిగ్గుచేటు. దీనికి ప్రధాన కారణం దేశంలో కులగణన వల్ల రిజర్వేషన్ల పరిమితిని పెంచాల్సిన అవసరం బైటపడటం, ఇతర అనేక డిమాండ్లు నెరవేర్చాల్సి రావటం. స్వంత రాజకీయ ప్రయోజనాల కోసం కులగణనను బీజేపీ వ్యతిరేకించటం పూర్తిగా ఖండించాల్సిన అంశం.

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్ గాంధీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున రేవంత్ రెడ్డి కుల గణనకు సంపూర్ణంగా కట్టుబడి ఉన్నారు. గాంధీ అన్నట్లు 'అన్ని కులాల సమగ్ర ఐక్యతే భారతీయతకు మూలం'. కులగణన ద్వారా రిజర్వేషన్లు పెంచి భారతీయ మూలవాసుల సమగ్ర సమ్మిళిత అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోంది.

■ డా. రియాజ్
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి



ఈవీఎం, వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఎన్నికల పరిశీలకుడు స్వాగత్ రణ్వీర్ చంద్ (ఫైల్)



సర్వం సిద్ధం

- లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు యంత్రాంగం కసరత్తు
- వరంగల్ నియోజకవర్గంలో 1,900 పోలింగ్ కేంద్రాలు
- ఓటింగ్ శాతం పెంపునకు అధికారుల యత్నం
- ప్రతీ పోలింగ్ కేంద్రానికి మూడు ఈవీఎంల కేటాయింపు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే 9: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించిన చర్యలను వరంగల్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల విధుల్లో భాగస్వాములైన అధికారులతో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఇప్పటికే ఈవీఎంల కమిషనింగ్‌ను పూర్తిచేశారు. 1,900 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతీ పోలింగ్ కేంద్రానికి మూడు ఈవీఎంల చొప్పున కేటాయించనున్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం వరంగల్ పార్లమెంట్ పరిధిలో 18,24,466మంది ఓటర్లు, 1,026 మంది సర్వీస్ ఓటర్లు, 181 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియకు అవసరమైన 8,685 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించి వారికి శిక్షణనిచ్చారు. ఓటర్లకు బీఎల్‌వోల ద్వారా ఓటరు స్లిప్పులను పంపిణీ చేయిస్తున్నారు.

వెబ్‌కాస్టింగ్‌తో పోలింగ్ సరళి పరిశీలన

పోలింగ్ సమయంలో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 1,900 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా వీటిలో 247 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 1,309 కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్, 397 పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు 497మంది మైక్రో అబ్జర్వర్లతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 3,200 మంది పోలీసులతో పాటు 32 కంపెనీల బలగాలతో పహరా చేపట్టనున్నాయి.

ఎండల నేపథ్యంలో పోలింగ్ సమయం పొడిగింపు

షెడ్యూల్ ప్రకారం 13వతేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరగనుండగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలింగ్ సమయాన్ని ఒక గంట పాటు పొడిగిస్తూ అంటే సాయంత్రం 6గంటల వరకు నిర్వహించనున్నట్టు ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట తదితర ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుండగా.. సమస్యాత్మక నియోజకవర్గమైన భూపాలపల్లిలో మాత్రం సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగియనుంది.

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి

ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం తీవ్రమైన కృషి చేస్తోంది. కళాశాలలు, సహాయక సంఘాలు, కమ్యూనిటీ సెంటర్లు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పలు చోట్ల స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఓటు హక్కు విలువను, ఓటు వినియోగంపై విస్తృతమైన ప్రచారంతో పాటు ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియలో పలువురు అధికారులు కీలక భూమిక పోషిస్తున్నారు. రిటర్నింగ్ అధికారిగా వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాలకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్నారు. వీరితో పాటు మరో 11 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, నలుగురు డిప్యూటీ ఎలక్షన్ ఆఫీసర్లు, ఒక జనరల్ అబ్జర్వర్, ఒక పోలీస అబ్జర్వర్‌తోపాటు ఇద్దరు వ్యయపరిశీలకులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితో పాటు పోలింగ్ జరిగే 13వ తేదీన 8685 మంది సిబ్బంది వివిధ హోదాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.

ముమ్మరమైన తనిఖీలు

ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో

మిగతా 8వ పేజీలో..

హోం ఓటింగ్ పూర్తి

ఎన్నికల ప్రకియలో భాగంగా ఇంటి వద్ద ఓటు విధానం పూర్తయింది. 85ఏళ్లు పైబడిన ఓటర్లు 1,010 మంది, 796 మంది పీడబ్ల్యూడీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఎన్నికల విధులు నిర్వహించే 12,710 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు నియోజకవర్గ కేంద్రాల్లోని ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయాల్లో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే చాలా మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.



కాజీపేటలో జరిగిన బీసీ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కావ్య

అభివృద్ధిని విస్మరించిన బీజేపీ

- పార్లమెంటుకు పంపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా..
- వరంగల్‌ను ఎడ్యుకేషనల్, ఐటీ, ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతా..
- దేవాదుల మూడో దశ పూర్తి చేయించి ప్రతీ ఎకరాకు సాగు నీరందిస్తా..
- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య



వివరాలు : 7లో..

6



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

నామినేషన్ వేసిన గుజ్జుల

- పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా ప్రేమేందర్‌రెడ్డి

గురువారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 37.0° C | కనిష్ఠం : 25.0° C



నేత్ర పర్వంగా బ్రహ్మోత్సవాలు

- ఘనంగా శ్రీభద్రకాళి, భద్రేశ్వర కల్యాణోత్సవాలు ప్రారంభం

వరంగల్ కల్చరల్, మే 9: ఓరుగల్లు నగరంలో చారిత్రక భద్రకాళి దేవస్థానంలో గురువారం శ్రీభద్రకాళి, భద్రేశ్వర కల్యాణ బ్రహ్మోత్సవాలు వేద నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో జ్యోతి ప్రజ్వలనతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు నేతృత్వంలో అర్చక బృందం 12 రోజుల ఉత్సవాలను ఆరంభించారు. ఆలయంలో గణపతి, గౌరీ పూజతో నిత్య పూజ, రుత్వికుల దీక్షాధారణ, ఉత్సవ మూర్తులకు స్నపన పూజ నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని గణపతి, సుదర్శన, చరాయతన సైత భద్రకాళి పరివశ్య చండీహోమాన్ని నిర్వహించారు. సాయంత్రం నవగ్రహ, వాస్తు, యోగిని, ధ్వజాది వాసం నిర్వహించారు. ఉత్సవాల్లో బబగంగా మొదటి రోజు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మున్నూరు కాపు సంఘం ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య నేతృత్వంలో అమ్మవారికి పట్టువస్త్రాలు, పూజా ద్రవ్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్, కొండా దేవయ్య తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, అమ్మవారి కల్యాణబ్రహ్మోత్సవాల నేపథ్యంలో శుక్రవారం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని వర్ధిని పూజ, యాగశాల ప్రవేశం, ద్వారతోరణ పూజ, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

- రిజర్వేషన్లు, పదవులను కూడా కబ్జా చేసింది కడియమే..
- ఆయన రాజకీయాల్లోకి రాక ముందే నేను కాంట్రాక్టర్‌ను
- రిజర్వేషన్ల రద్దుపై కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం
- ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ కట్టుబడి ఉన్నారు
- బీజేపీ గెలుపుతోనే ఓరుగల్లు అభివృద్ధి సాధ్యం
- ఎయిర్‌పోర్టు, రైల్వేలైన్, ఐఐఎం, టెక్స్‌టైల్ పార్కు రావాలంటే బీజేపీ గెలువాలి
- వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఈ ఎన్నికల్లో బీజేపీకే ఓటెందుకు వేయాలంటే మీరేం చెబుతారు?

అరూరి : మళ్లీ కేంద్రంలో ఏర్పడేది బీజేపీ ప్రభుత్వమే. వరంగల్‌లో కూడా బీజేపీ ఎంపీ ఉంటే కేంద్రం నుంచి భారీగా నిధులు తెచ్చే అవకాశం ఉంటుంది. పదేళ్లుగా ప్రతిపక్ష ఎంపీ ఉండటం మూలంగా కేంద్రం వరంగల్ నగరాన్ని స్మార్ట్ సిటీగా, హెరిటేజ్ సిటీ పథకం కింద ఎంపిక చేసినా ఆశించిన స్థాయిలో నిధులు రాలేదు. అలాగే మెగా టెక్స్ టైల్ పార్కును ప్రధాని మోదీ 2023లోనే పీఎం మిత్ర పథకం కింద ఎంపిక చేసినా నిధులు తీసుకరాలేకపోయారు. ఇలా కేంద్రం నుంచి వచ్చే పథకాలు అన్ని అమలు కావాలంటే ఇక్కడ కూడా బీజేపీ ఎంపీ ఉండాలి. నాకు ఒక్క అవకాశం ఇస్తే మోదీ సహకారంతో ఓరుగల్లును అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా.



కబ్జాల చరిత్ర ఎవరిదో ప్రజలకు తెలుసు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

'ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చినా.. కబ్జాల చరిత్ర నాకు లేదు. పదవులు, రిజర్వేషన్లు కబ్జా చేసి, రాజకీయాల్లో తనకు పోటీగా ఎవరిని ఎదగకుండా అణగతొక్కిన చరిత్ర ఎవరికి ఉందో ప్రజలకు తెలుసు. బీజేపీ గెలిస్తే ఓరుగల్లును అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా' అని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ స్పష్టం చేశారు. రిజర్వేషన్ల రద్దుపై ప్రచారం, ఎస్సీ వర్గీకరణతో పాటు వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, రైల్వేలైన్, ఐటీ పార్కులు, అండర్ డ్రైనేజీ లాంటి సమస్యలకు పరిష్కారం దొరుకుందంటున్న అరూరి రమేష్‌తో 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి' ఇంటర్వ్యూ.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: ప్రచార సరళి ఎలా ఉంది? ప్రజల నుంచి స్పందన ఎలా వస్తోంది?

అరూరి రమేష్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో అన్ని వర్గాల ప్రజల నుంచి పూర్తి మద్దతు లభిస్తోంది. ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ప్రజల్లోనే ఉంటున్నా. పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల్లో పర్యటిస్తున్నా. పదేళ్లలో మోదీ చేసిన అభివృద్ధి, అయోధ్యలో రామమందిర నిర్మాణంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజలంతా అబ్‌కీ బార్ మోదీ సర్కార్ అంటున్నారు. యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు ఇలా అందరూ బీజేపీకే భరోసా ఇస్తున్నారు. 1984లో బీజేపీ గెలిచిన సీటు ఇది.. ప్రజల ఆశీస్సులు, మోదీ చరిష్మాతో 40ఏళ్ల తరువాత చరిత్రను పునరావృతం చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

ఆంధ్రజ్యోతి: బీజేపీలో అందరూ పూర్తిగా సహకరిస్తున్నారా?

అరూరి: బీజేపీలో ప్రతీ ఒక్క నేత పూర్తిగా సహకరిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నాతో పాటు శ్రమిస్తున్నారు. కార్యకర్తల రుణం తీర్చుకోలేనిది. మండుటెండల్లోనూ బూత్‌స్థాయిలో ఇంటింటికి తిరిగి మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాలంటే వరంగల్‌లో బీజేపీ గెలువాలని ప్రచారం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మీపై వస్తున్న కబ్జాల ఆరోపణలపై మీ సమాధానమేంటి?

అరూరి: రాజకీయంగా ఎదుర్కొలేక చేస్తున్న పస లేని ఆరోపణలు ఇవీ. అసలు కబ్జాలు చేసింది కడియం శ్రీహరే. తన 40ఏళ్ల రాజకీయ జీవితంలో దళితులకు రావాల్సిన పదవులన్నింటిని ఆయనే కబ్జా చేశారు. రిజర్వేషన్లను కబ్జా చేసి ఉద్యోగాలను, ఆయా పార్టీల్లో పదవులు, ప్రభుత్వాల్లో మంత్రి పదవులను పొందారు. చివరకు పార్టీలో వేరే వ్యక్తికి రావాల్సిన ఎంపీ టికెట్‌ను కూడా తన కూతురు కోసం కబ్జా చేసి, సిన్సియర్‌గా పార్టీలో పని చేసే నేతలకు ద్రోహం చేశారు. నీతి, నిజాయితీ గురించి మాట్లాడే శ్రీహరికి ఇంద్రభవనం లాంటి ఇల్లు ఎలా వచ్చింది? వివిధ ప్రాంతాల్లో భూములు ఎలా కొనుగోలు చేశారో ప్రజలకు తెలుసు. ఆయన రాజకీయాల్లోకి రాక ముందే నేను కాంట్రాక్టర్‌ను. ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చిన. రెండు పర్యాయాలు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు నా పక్కనే ఉన్న శ్రీహరికి అప్పుడెందుకు కబ్జాలు గుర్తుకు రాలేదు. తప్పుడు ఆరోపణలను ప్రజలు ఎప్పుడూ స్వీకరించరు.

ఆంధ్రజ్యోతి: బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారనే ప్రచారం జరుగుతోంది కదా?

అరూరి : కాంగ్రెస్ చేస్తున్న ఈ ప్రచారం ప్రజల్లో ఫెయిల్ అయింది. ధర్మవంతమైన పాలన అందిస్తున్న ప్రధాని మోదీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారం. ఓ బీసీ బిడ్డగా ప్రధాని తన వారి కోసం

మిగతా 8వ పేజీలో..



జన సభలో మాట్లాడుతున్న భజన్‌లాల్ శర్మ

వరంగల్‌ను స్మార్ట్ సిటీగా మారుస్తాం..

- బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం
- 70 ఏళ్ల కాంగ్రెస్ పరిపాలనతో అభివృద్ధి శూన్యం
- తొర్రూరు జనసభలో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్‌శర్మ

7

సమష్టిగా కృషిచేస్తే వరంగల్ ఎంపీ మనదే..

- బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి..
- కాంగ్రెస్ వందరోజుల పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారు..
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- తొర్రూరులో ఎన్నికల ప్రచారం

తొర్రూరు రూరల్, మే 9: ఓటర్లలో మార్పు వచ్చిందని.. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషిచేస్తే వరంగల్ లోక్‌సభ స్థానం బీఆర్ఎస్‌దేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని చెర్లపాలెం, చీకటాయపాలెం, అమ్మాపురం గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపుకోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ముఖ్యనాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వందరోజుల పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమిలేదని, ప్రజలు విసుగెత్తిపోయారని, బీఆర్ఎస్ అభ్యర్థికి ఓట్లు వేయాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, కనీసం తాగునీటిని కూడా అందించలేని పరిస్థితిలో ఉందన్నారు. అతి తక్కువరోజుల్లోనే రేవంత్‌రెడ్డి సర్కారుపై వ్యతిరేకత వచ్చిందని, ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నందున్న కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తి నిలదీసే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరువు, కష్టాలు, కరెంట్ కోతలు మళ్లీ మొదలైనట్లు వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగేవిధంగా చూస్తామని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందని పక్షంలో ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. నమ్మించి మోసం చేసిన వారికి ఈ ఎన్నికల్లో శాశ్వతంగా రాజకీయంగా రాజకీయ సమాధి చేయాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ పేదల నడ్డివిరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఇప్పటికే జిల్లాలో సర్వేలన్నీ బీఆర్ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయని, కొంచం కష్టపడితే వరంగల్ స్థానం కైవసం చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీలో ఉండి పదవులు అనుభవించి, బ్లాక్‌మెయిల్ చేసిన నాయకులు ఎంత మంది పార్టీని విడిచి వెళ్లినా నష్టంలేదని, ఉన్న ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎర్రబెల్లి దయాకర్ రావు భరోసా ఇచ్చారు. తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలోని 3,4,5,6,7,8 వార్డులోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, కన్వీనర్లు, బూత్ కో-కన్వీనర్లు, మహిళ నాయకులు, ఇన్‌చార్జీలతో పలుచోట్ల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లి అవగాహన కలిపించాలన్నారు. 10మంది ఉన్న ప్రతీచోటా ప్రభుత్వ వైఫల్యాలపై చర్చపెట్టాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటికే ఎమ్మెల్సీలు ఉండగా, ఇంకా గళం బలంగా వినిపించాలంటే ఎంపీగా సుధీర్‌కుమార్‌ను గెలుపించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, పొనుగోటి సోమేశ్వర్‌రావు, ఆశయ్య, ముద్దం వీరారెడ్డి, నట్ల నాగలక్ష్మీ, సరోజవెంకన్న, డొనుక ఉప్పలయ్య, కిరణ్‌కుమార్, విజయ, పూలమ్మ, కళావతి, అర్జున్‌రాజు, జైసింగ్, జంపా తదితరులు పాల్గొన్నారు.



చెర్లపాలెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు









FARNAZ

నేడు అక్షయ తృతీయ

బంగారం దుకాణాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



వరంగల్ కల్చరల్, మే 9 : వైశాఖ మాసంలో ప్రధానంగా వచ్చే పర్వదినం అక్షయ తృతీయ. నేడు(శుక్రవారం) అక్షయ తృతీయ పురస్కరించుకుని పరశురాముడి జయంతిని కూడా ఆచరిస్తారు. నేడు బంగారం (స్వర్ణం)కొనుగోలు చేస్తే శుభాలు జరుగుతాయనినమ్మకం. అక్షయ తృతీయ రోజున కనీసం గ్రాము బంగారమైనా కొనుగోలుచేసి ఇంట్లో ఉంచుతారు. అక్షయ అనే పదం శాశ్వతమైనదని, శక్తివంతమైన ఈరోజుని పురాణాల్లో ఉందని చెబుతుంటారు. అక్షయ తృతీయ సందర్భంగా నగరంలో బంగారం అమ్మే దుకాణాలు అమ్మకాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురిజ, గ్రాము, అర గ్రాము, అర తులం, తులం వంటి ప్యాకేజీలు తయారుచేసి అమ్మకాలకు సిద్ధం చేశారు. గత మాసం పెళ్లిళ్లు, శుభ కార్యాలు, ముహూర్తాలు ఉండటంతో తులం బంగారం ధర రూ.75 వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.70 వేలకు పలుకుతోంది. వెండి ధర కూడా తగ్గుముఖం పట్టింది. అక్షయ తృతీయ పర్వదినం రోజున బంగారం అమ్మకాలు పెరుగుతాయని వ్యాపారులు ఆశతో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అక్షయ తృతీయ రోజున దాదాపు 50 కిలోల వరకు బంగారం అమ్మకాలు జరుగుతాయని వ్యాపారులు భావిస్తున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వైశాఖ మాసంలో అక్షయ తృతీయ పర్వదినంగా పేర్కొంటారు. ఈరోజునే పరశురాముడి జయంతిగా భావిస్తారు. ఆలయాల్లో అక్షయతృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పెద్ద ఎత్తున లక్ష్మీదేవికి అర్చనలు చేస్తారు.







నామినేషన్ వేసిన గుజ్జుల

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా ప్రేమేందర్‌రెడ్డి దాఖలు

హనుమకొండ టౌన్, మే 9: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నిక బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్ వేశారు. నల్లగొండ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌తో కలిసి ర్యాలీగా వెళ్లి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ నుంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గట్టికొప్పుల రాంబాబు, నల్లగొండ పార్లమెంట్ ప్రభారి చాడ శ్రీనువాస్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ప్రధాన కార్యదర్శి గాడపల్లి రాజేశ్వర్‌రావు హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనువాస్, గురిజాల శ్రీరామ్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, వెంకటరమణా రెడ్డి, వన్నాల వెంకటరమణ, యువ మోర్చా నాయకుడు అపరూప సాయి, మాహబూబాబాద్ నుంచి లక్ష్మణ్‌నాయక్, తరలివెళ్లారు.

ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్


ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న దయాకర్

దుగ్గొండి/ వరంగల్ ఎడ్యుకేషన్ , మే 9: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు. దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన గజ్జి దయాకర్‌గురువారం నామినేషన్ దాఖ లు చేశారు. నల్లగొండలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేసిన అనంతరం దయాకర్ మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతీ గ్రాడ్యుయేట్ ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అలాగే కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థి జాక్ నేత, తెలంగాణ ఉద్యమకా రుడు, కేయూ గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ రాజు నామినేషన్ దాఖలు చేశారు. గురువారం నల్లగొండలోని రిటర్నింగ్ అధికారికి ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా రాజునాయక్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల పరిరక్షణ, విద్యార్థి, ఉద్యమకారుల సంక్షేమం, యువత, నిరుద్యోగుల సమస్యలపై చట్టసభల్లో గళం ఎత్తేందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. కేయూ విద్యార్థి నేతగా నన్ను ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీజీబీవీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేడ రంజిత్‌కుమార్, ఉద్యమకారుడు జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు విజయ్‌ఖన్నా, ములుగు జిల్లా జేఏసీ కన్వీనర్ పోరిక అశోక్, విద్యార్థి నేత భూక్యా వెంకట్ పాల్గొన్నారు.


నల్గొండలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న గుగులోత్ రాజు

అమెరికాలో హనుమకొండ విద్యార్థి అదృశ్యం

కాంకార్డియా యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతున్న రూపేష్ చంద్ర

ఈనెల 2న అదృశ్యం.. చికాగో పోలీసులకు ఫిర్యాదు


తల్లిదండ్రులతో రూపేష్ చంద్ర

వరంగల్ క్రైం, మే 9: అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ చేసేందుకు వెళ్లిన హనుమకొండకు చెందిన చింతకింది రూపేష్ చంద్ర(26) ఈనెల 2న అదృశ్యమయ్యాడు. 2న హనుమకొండ నయింనగర్‌లో ఉంటున్న తన తల్లిదండ్రులైన సదానందం, ఉమలతో రూపేష్ చంద్ర మాట్లాడాడు. మరుసటి రోజు తల్లిదండ్రులు కొడుకుతో మాట్లాడేందుకు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు.. కుమారుడి స్నేహితుడికి కాల్‌చేయగా రెండు రోజులు వేరే స్నేహితుడి వద్దకు వెళుతున్నానని చెప్పాడని తెలిపాడు. వారంరోజులు గడిచినా కుమారుడి ఆచూకీ తెలియకపోవడంతో అమెరికాలోని తానా సభ్యుల సహకారంతో చికాగో పోలీసులకు పిర్యాదు చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను, స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి తన కుమారుడి ఆచూకీ కోసం సహకరించాలని సదానందం, ఉమలు విజ్ఞప్తి చేసారు.

కాగా మెకానిక్ అయిన సదానందం-ఉమ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అరుణ్ తండ్రికి సహకరిస్తూ మెకానిక్ పని చేస్తున్నాడు. రెండో కుమారుడైన రూపేష్ చంద్ర ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేసి ఎంఎస్ కోసం 2019లో లండన్ వెళ్లాడు. 2022లో ఇండియాకు తిరిగి వచ్చిన రూపేష్ చంద్ర.. 2023 డిసెంబర్‌లో డబుల్ ఎంఎస్ కోసం అమెరికా వెళ్లాడు. చికాగోలో విస్కాన్సిన్‌లోని కాంకార్డియా యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతున్నాడు. మే 2న అదృశ్యమైన రూపేష్ చంద్ర అచూకీ వారంరోజులుగా తెలియడం లేదు. వారం నుంచి తల్లిదండ్రులు సదానందం, ఉమలు కన్నీరు మున్నీరవుతున్నారు. తీవ్ర ఆందోళన చెందుచున్నారు. వారిని ఓదార్చడం ఎవరివల్లా కావడంలేదు. కుమారుడి అదృశ్యం వారి ఇంట విషాదం నెలకొంది.

ప్రశాంతంగా ఎప్‌సెట్

వరంగల్ ఎడ్యుకేషన్, మే 9: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్‌సెట్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. నగరంలో ఏర్పాటు చేసిన 10 పరీక్ష కేంద్రాలతో పాటు నర్సంపేటలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలోని 10 కేంద్రాల్లో జరిగిన మొదటి విడత పరీక్షలలో 2,168 మంది విద్యార్థులకు గాను 2,119 మంది 97.7 శాతం మంది విద్యార్థులు హాజరు కాగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన పరీక్షలో 2,168కి 2,121 మంది 97.8 శాతం విద్యార్థులు హాజరయ్యారు. ఇక నర్సంపేటలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఉదయం 393కు 389 మంది, సాయంత్రం 393కు 385 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎప్‌సెట్ స్టేట్ కన్వీనర్ దీన్‌కుమార్ తెలిపారు. శుక్ర, శనివారాల్లో సైతం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముల్కనూర్ సహకార బ్యాంకుకు ఉత్తమ అవార్డు


ముల్కనూర్ బ్యాంకు ఉత్తమ అవార్డును అందుకుంటున్న స్వామిరావు

భీమదేవరపల్లి, మే 9 : మండలంలోని ముల్కనూర్ సహకార బ్యాంకు మెలైన మొక్కజొన్న విత్తన ఉత్పత్తిలో విత్తన ప్రమాణాలు పాటించి మెలైన విత్తనాలు తయారు చేసినందుకు ఉత్తమ సహకార సంఘంగా అవార్డును అందుకుంది. గురువారం హైదరాబాద్‌లో 67వ మొక్కజొన్న వర్క్ షాప్ నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు వర్క్ షాపు ఇండియన్ ఇనిస్టిట్యూట్ మొక్కజొన్న రీసెర్చ్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో దేశంలో 200 హైబ్రిడ్ రకాల మొక్కజొన్నలను విడుదల చేశారు. మెలైన మొక్కజొన్న విత్తనాల తయారీలో ముల్కనూర్ సహకార బ్యాంకు, పశ్చిమ బెంగాల్‌లోని మరొక సహకార బ్యాంకు ఉత్తమ సహకార సంస్థల అవార్డులను అందుకున్నాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ మొక్కజొన్న రీసెర్చ్ సెంటర్ న్యూఢిల్లీ డైరెక్టర్ హెచ్‌ఎస్ జార్జ్ ఈ ఉత్తమ అవార్డును ముల్కనూర్ బ్యాంకు వ్యవసాయాధికారి స్వామిరావుకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మరొక వ్యవసాయాధికారి సాయి, మొక్కజొన్న పండించే రైతులు జిమ్మల భీమ్‌రెడ్డి, చీకట్ల రాజయ్యలను ఐఎంఆర్ డైరెక్టర్ జార్జ్ సన్మానించారు.

స్పోర్ట్స్ కోచింగ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ స్పోర్ట్స్, మే 9 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు లక్ష్మీబాయి నేషనల్ ఇన్స్టూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్వాలియర్‌లో స్పోర్ట్స్ కోచింగ్‌లో డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశాల కోసం అర్హులైన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 40 యేళ్ల వయస్సు లోబడి డిప్లొమాలో ఇంటర్మీడియట్ పూర్తి చేసినవారు, పీజీ డిప్లొమాలో డిగ్రీ పూర్తి చేసి కనీసం 3సార్లు యూనివర్సిటీల క్రీడల్లో పాల్గొనడం, సీనియర్ నేషనల్స్ క్రీడలో పాల్గొని ఏదైనా పతకం సాధించిన హనుమకొండ జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. మరిన్ని వివరాలకు www.lnipe.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని అశోక్‌కుమార్ కోరారు.

వర్ధన్నపేటలో చెల్లని రూపాయి..
వరంగల్‌లో చెల్లుతుందా..?


బీసీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి కావ్య

- మోదీ, అరూరి రమేశ్‌కు దిమ్మతిరిగే ఫలితాలివ్వాలి
- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

కాజీపేట, మే 9: అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గంలో చెల్లని రూపాయి.. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్‌లో చెల్లుతుందా..? అని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో ప్రధాని మోదీ, అరూరి రమేశ్‌కు దిమ్మతిరిగే ఫలితాలివ్వాలని కోరారు. కాజీపేట ఫాతిమానగర్ వైష్ణవి గ్రాండ్ హోటల్‌లో గురువారం బీసీల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి కడియం కావ్య హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అండగా ఉంటుందన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టగానే బీసీలతో పాటు అన్నివర్గాలకు సమన్యాయం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో దేశ ప్రజల స్థితిగతులు, వారి జీవన విధానాలను పరిశీలించారన్నారు. ఎయిర్‌పోర్టులు, బ్యాంకులు, రైల్వేలను అమ్మేసి అదానీ, అంబానీలకు ప్రయోజనం చేసేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. బీసీల రిజర్వేషన్లు తొలగించేందుకు చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధాని చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. మీ ఇంటి బిడ్డగా వస్తున్న తనను ఈ ఎన్నికల్లో ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల హామీలను కాంగ్రెస్ పూర్తి స్థాయిలో అమలు చేసిందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన అందించిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులను ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, బీసీ రక్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమౌళి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చు ఆనంద్, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మన శోభారాణి, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల హరిప్రసాద్‌తోపాటు బీసీ సంఘ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన బీజేపీ

వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య


మీట్ ద ప్రెస్‌లో మాట్లాడుతున్న కడియం కావ్య

వడ్డెపల్లి, మే 9: పదేళ్ల పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధిని విస్మరించిందని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన 'మీట్ ద ప్రెస్'లో ఆమె మాట్లాడారు. తాను రాజకీయాలకు రాకముందే కడియం ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టి పేదలకు సేవలను అందించానన్నారు. వృత్తిరిత్యా డాక్టర్‌ను అయిన తాను.. పేద ప్రజలకు వైద్యాన్ని అందించానని పేర్కొన్నారు. తనను గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతానని కడియం కావ్య స్పష్టంచేశారు. హైదరాబాద్ తర్వాత పారిశ్రామికంగా అభివృద్ధి అయ్యే అవకాశాలు వరంగల్‌కే ఎక్కువగా ఉన్నా.. గత బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అభివృద్ధి చేయకుండా ఈ ప్రాంతం పట్ల శీతకన్ను ప్రదర్శించాయని విమర్శించారు.

తనను గెలిపించి లోక్‌సభకు పంపిస్తే వరంగల్‌ను ఎడ్యుకేషనల్, ఐటీ, ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతానని కావ్య హామీ ఇచ్చారు. దేవాదుల మూడో దశ పూర్తి చేయించి ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి నేషనల్ హైవేను ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. ఉత్తర, దక్షిణ భారత దేశ కూడలి కాజీపేట జంక్షన్‌ను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయిస్తానని పేర్కొన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధనకు పాటుపడుతానని తెలిపారు. కాకతీయ మెగా లెదర్ పార్కుతో పాటు మరిన్ని పరిశ్రమలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. మహిళలకు గార్మెంట్ తయారీలో శిక్షణ ఇప్పించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించి మహిళా సాధికారతకు తోడ్పాటు అందిస్తానని కడియం కావ్య స్పష్టం చేశారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు ఏర్పాటుతో పాటు జిల్లా కేంద్రంలో యువతకు ఉపాధి కల్పించే ఐటీ పార్కులను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

తాను దళిత మహిళనే కాదని ఎవరైనా అనుకుంటే నిరూపించాలని కడియం కావ్య సవాల్‌విసిరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో వరంగల్ లోక్‌సభ ప్రాంతంలోనిసమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరకు జాతీయ హోదా గత ప్రభుత్వాలు తీసుకురాలేదని ఆమె విమర్శించారు. వరంగల్‌కు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)ను తీసుకురావడానికి కృషి చేస్తానని కడియం కావ్య తెలిపారు. విభజన చట్టంలోని హామీలను బీజేపీ ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో పాటు కాంగ్రెస్ ప్రతిపాదించిన పాంచ్ న్యాయ్‌లను అమలు చేయించి రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యేందుకు కృషి చేస్తానని అన్నారు. 35 ఏళ్ల తర్వాత ఒక మహిళకు వరంగల్ లోక్‌సభకు పోటీ చేసే అవకాశం లభించిందని, ఆడబిడ్డగా, చెల్లెగా ఆశీర్వదించాలని కావ్య కోరారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన మీట్‌దప్రెస్‌లో ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, వివిధ యూనియన్ల నేతలు బీఆర్ లెనిన్, మెండు రవీందర్,జర్నలిస్టులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన
పార్టీలకు ఓటు వేయొద్దు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

స్టేషన్‌ఘన్‌పూర్, మే 9 : మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేయవద్దని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం రాత్రి నిర్వహించిన వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నానని తెలిపారు. వివిధ పార్టీల నుంచి అనేక పదవులు ఇస్తామని అవకాశం వచ్చినప్పటికీ మాదిగ జాతి మేలు కోసం పదవులు తీసుకోలేదన్నారు. వర్గీకరణ విషయమై అన్నిపార్టీలను కలిసినప్పటికీ ఏదో రకంగా తమ జాతి ఓట్లను వేయించుకొని మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంటేనే మాదిగలను శత్రువులుగా చూసే పార్టీ అన్నారు. వర్గీకరణ విషయమై ప్రశ్నించిన తనను కేసీఆర్ దుర్మార్గంగా జైలుకు పంపించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ఎస్సీ నియోజకవర్గాల్లో ఒక్క స్థానం కూడా మాదిగకు ఇవ్వకుండా మాదిగలను మోసం చేశారని తెలిపారు. కడియం శ్రీహరి ఒకే ఎన్నికల్లో రెండు పార్టీల టికెట్‌లు తెచ్చుకొని చరిత్ర సృష్టించారని తెలిపారు. కడియం శ్రీహరి ఒక నకిలీ ఎస్సీ అన్నారు. కడియం నకిలీ ఎస్సీ అయి నప్పుడు ఆయన కూతురు నకిలీ ఎస్సీ కాదా అని ప్రశ్నించారు. ఊరుకో ఓటు లేని బైండ్ల వ్యక్తికి ఓటు వేసి మాదిగలు మనకు మనం మోసం చేసుకోవద్దు అని కోరారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థి మాదిగ అని ఓటు వేసి మాదిగలను మోసం చేసుకోవద్దని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను ఒప్పుకున్న బీజేపీ పార్టీ అభ్యర్థి అరూరి రమేష్‌కు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చాడ ఏలియా, గాదె శ్రీధర్, మంద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ఉండాలంటే మోదీకి వ్యతిరేకంగా నిలబడాలి

- బీజేపీ పదేళ్ల కాలంలో ప్రజలకు ఒరిగిందేమిలేదు..
- రాజ్యాంగ పరిరక్షణ కోసం బీజేపీకి గుణపాఠం చెప్పాలి
- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్


సదస్సులో మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్

నర్సంపేట టౌన్, మే 9 : భారత రాజ్యాంగం పరిరక్షించబడాలంటే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా నిలబడి ఓడించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన భారత రాజ్యాంగ పరిరక్షణ-ప్రజా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కోదండరామ్ మాట్లాడారు. కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వ పదేళ్ల కాలంలో బడా పెట్టుబడిదారి సంస్థలు, కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టిందే తప్ప.. సామాన్య ప్రజలకు వారు చేసిందేమీ లేదన్నారు. పైగా జీఎస్టీ పేరుతో పన్నులు వసూలు చేసి నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగేలా చేసి సామాన్య ప్రజల నడ్డి విరిచిందన్నారు. ధరల పెరుగుదల వల్ల వ్యవసాయ పనిముట్ల ధరలు, ట్రాక్టర్ కిరాయిలు, ఎరువుల ధరలు పెరిగి వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయేలా పాలన సాగించారన్నారు. పెట్టుబడి ఎక్కువ, పండించిన పంటకు గిట్టుబాటు ధరరాక వ్యవసాయం చేయాలంటే ప్రజలు భయాందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ రంగాలకు అప్పగించడంతో ప్రభుత్వ ఉద్యోగాలు లేకుండా పోయాయన్నారు. ఉద్యోగాలు లభించక నిరుద్యోగం పెరిగిపోతున్నదన్నారు. దేశంలో 50 కోట్ల మంది ప్రజలకు దేశ సంపదలో ఆరున్నర శాతం వాటా మాత్రమే దక్కుతున్నదని, కేవలం 9 లక్షల మంది ఉన్న సంపన్నవర్గాలకు 40 శాతం ఆదాయంలో వాటా దక్కుతున్నదన్నారు. ఓటు కోసం వచ్చే బీజేపీ నాయకులను ప్రజలు నిలదీయాలని, పదేళ్ల వారు చేసిందేమిటని ప్రశ్నించాలన్నారు. బడా బాబులకు అండగా నిలుస్తున్న బీజేపీని వ్యతిరేకించాలన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రజలందరికీ సమాన అవకాశాలు పొందడానికి రాబోయే ఎన్నికల్లో తమ ఓటుతో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ దేశం, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారే తప్ప అభివృద్ధి చేసింది మాత్రం శూన్యమన్నారు. ఎంతో ఉన్నతమైన భారత రాజ్యాంగాన్ని కించపరిచేలా నాడు సీఎం హోదాలో ఉండి మాట్లాడిన కేసీఆర్.. ప్రజాగ్రహానికి గురయ్యారన్నారు. పదేళ్ల మోదీ పాలనలో దేశీయ ఉత్పత్తులు తగ్గాయని, కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. దేశంలో సుమారు 18మంది బడా పారిశ్రామిక వ్యక్తులకు రూ.13లక్షల 50వేల కోట్ల రుణం మాఫీ చేసిన ఘనుడు మోదీ అని ఎద్దేవా చేశారు. అటు మోదీ, ఇటు కేసీఆర్ ఇద్దరూ తోడు దొంగలేనని, వారిని రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ వెంకటరమణ, సోమ రామ్మూర్తి, టీజేఎస్ నాయకులు గుంటి రాంచందర్, షేక్ జావెద్, మైస శ్రీనివాస్, నాగన్న, పిల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం బీసీ-ఏ జాబితాలో ముదిరాజ్‌లను చేర్చవద్దని కోరుతూ బీసీ కులాల పరిరక్షణ సమితి నాయకుడు ప్రొఫెసర్ కోదండరాంకు వినతి పత్రం అందజేశారు.

ప్రశాంతంగా పోలింగ్‌ను పూర్తి చేయాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, మే 9: ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పోలింగ్‌ను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులకు, పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల ఇన్‌చార్జిలకు సంబంధిత అధికారులతో కలెక్టర్ సిక్తాపట్నాయక్ గురువారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు సిబ్బందికి కేటాయించిన ఈవీఎంలను తీసుకునేటప్పుడు, పోలింగ్ నిర్వహణ అనంతరం తిరిగి ఇచ్చేటప్పుడు అన్నింటి వివరాలను సరిచూసుకోవాలన్నారు. మూడు బ్యాలెట్ యూనిట్లు ఉన్నందున వాటికి సంబంధించి జాగ్రత్తగా సరిచూసుకోవాలని సూచించారు. కౌంటర్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వందశాతం వెబ్ కాస్టింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, పరకాల, హనుమకొండ నియోజకవర్గాల ఏఆర్వోలు డాక్టర్ కె.నారాయణ, వెంకటేష్, తహసీల్దార్లు రాజ్‌కుమార్, నాగరాజు, జ్యోతి వరలక్ష్మీదేవి, రియాజుద్దిన్, జగన్ మోహన్‌రెడ్డి, డీపీఓ విజయలక్ష్మీ, సెక్టార్ అధికారులు, రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం

ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా స్వీప్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో గురువారం సాయంత్రం స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమం ఏర్పాటు చేశారు. సందర్భంగా సాంస్కృతిక కళాకారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పబ్లిక్‌గార్డెన్ చుట్టూ ర్యాలీ తీశారు. అనంతరం ఎన్నికల్లో తప్పకుండా ఓటు వేస్తామని, తమ చుట్టు పక్కల ఉన్న ఓటర్లను ఓటు వేసే విధంగా చైతన్యవంతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు
పటిష్ఠ బందోబస్తు

- వరంగల్ పరిధిలో విధుల్లో 3,200 మంది పోలీసులు
- 26 కంపెనీల కేంద్ర బలగాలతో ఎన్నికల బందోబస్తు

వరంగల్ క్రైం, మే 9: లోక్‌సభ ఎన్నికల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టనున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ లోక్‌సభ నియోజకవర్గానికి ఈ నెల 13న నిర్వహించనున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోనున్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు.. భూపాలపల్లి, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, పరకాలతోపాటు హుస్నాబాద్, హుజురాబాద్‌కు చెందిన కొన్ని పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయి. ఏడు నియోజకవర్గాల్లో 1,682 పోలింగ్ కేంద్రాలుండగా, వీటిలో సమస్యాత్మకమైన కేంద్రాలు 184, సాధారణ కేంద్రాలు 1491, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు 7 ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇప్పటికే 3,200 మంది స్థానిక పోలీసులతో పాటు ఆరు కంపెనీల కేంద్ర బలగాలు విధులు నిర్వహిస్తున్నాయి. ఒకటి రెండు రోజుల్లో మరో 20 కంపెనీల కేంద్రబలగాలు రానున్నాయి. పోలింగ్ ముగిసి ఈవీఎంలు భద్రపరిచే వరకు బలగాలు విధులు నిర్వహించనున్నారు.

కాగా, ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయి కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి కమిషనరేట్ పరిధిలో 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. రూ.50వేలకు మించి నగదు కలిగి ఉంటే స్వాధీనం చేసుకున్నారు. ఇలా నెలరోజుల్లో దాదాపు రూ2కోట్ల మేర నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు అధికారికంగా ప్రకటించారు. కాగా, ఇప్పటికే కేంద్ర బలగాలతో గ్రామాల్లో, పట్టణాల్లో కవాతు నిర్వహించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు వీక్షించేందుకు పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు.

పోలింగ్ కేంద్రాలు ఇవే..

- భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో 49 పోలింగ్ కేంద్రాలుండగా, వీటిలో సమస్యాత్మకం 8, సాధారణ 34, నక్సల్స్ ప్రభావితం 7.
- వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో 230 పోలింగ్ కేంద్రాలుండగా, వీటిలో సమస్యాత్మకం 33, సాధారణం 197.
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 244 పోలింగ్ కేంద్రాలుండగా, సమస్యాత్మకం 30, సాధారణం 214.
- స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో 295 పోలింగ్ కేంద్రాలుండగా, సమస్యాత్మకం 28, సాధారణం 267.
- వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో 279 పోలింగ్ కేంద్రాలు ఉండగా, సమస్యాత్మకం 30, సాధారణం 249.
- పాలకుర్తి నియోకవర్గ పరిధిలో 191 పోలింగ్ కేంద్రాలుండగా, సమస్యాత్మకం 14, సాధారణం 177.
- పరకాల నియోజవకర్గ పరిధిలో 239 పోలింగ్ కేంద్రాలుండగా, సమస్యాత్మకం 21, సాధారణం 218.
- హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో 90 పోలింగ్ కేంద్రాలు ఉండగా, సమస్యాత్మకం 16, సాధారణం 74.
- హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో 65 పోలింగ్ కేంద్రాలు ఉండగా, సమస్యాత్మకం 4, సాధారణం 61.



వరంగల్‌ను స్మార్ట్ సిటీగా మారుస్తాం..

- 70 ఏళ్ల కాంగ్రెస్ పరిపాలనతో అభివృద్ధి శూన్యం
- తొర్రూరు జనసభలో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్‌శర్మ


రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మకు జ్ఞాపికను అందజేస్తున్న అరూరి రమేష్

తొర్రూరు రూరల్, మే 9 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపిస్తే..వరంగల్‌ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ స్పష్టం చేశారు. గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోసం ఏర్పాటుచేసిన పాలకుర్తి నియోకవర్గ జనసభకు హాజరైన ఆయన మాట్లాడారు. వరంగల్ అతిపురాతనమైన ప్రాంతమని, ఇక్కడికి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలన్నా, పిల్లల భవిష్యత్ కోసం బీజేపీ వస్తేనే సాధ్యమని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. 70 ఏళ్ల పాటు దేశంలో పరిపాలన చేసిన కాంగ్రెస్ చేసిందేమి లేదని దోపిడీలు, స్కామ్‌లు, కులమత రాజకీయాలే అని విమర్శించారు. రైతులు కార్మికులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ పథకాలు తీసుకువస్తున్నట్లు చెప్పారు. మోదీతోనే దేశంలో నక్సలిజం, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. దేశ సమగ్రాభివృద్ధి కోసం కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావాలని, మోదీ మూడోసారి ప్రధాని కావాలని భజన్‌లాల్ శర్మ అన్నారు. దేశానికి ప్రధానిగా పని చేసిన తెలుగు బిడ్డను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తే, బీజేపీ భారతరత్న ఇచ్చి గౌరవించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉగ్రవాదం, అవినీతి రాజకీయాలు రాజ్యమేలుతాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలతో కూరుకుపోయిందని, అక్రమార్కులకు అండగా ఉన్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధిచెప్పాలన్నారు. కాగా, తొర్రూరు పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ యువజన, సీనియర్ నాయకులు తూర్పాటి పాండు, వెంకటేష్, సాయి ముఖేష్, మెండీస్, భిక్షం, సంతోష్, అశోక్‌తో పాటు పలువురు నాయకులు బీజేపీ పార్టీలో చేరారు.

వరంగల్‌ను నెంబర్‌వన్‌గా నిలుపుతా : అరూరి రమేష్

ఈ ఎన్నికల్లో తనను ఆదరిస్తే వరంగల్ ప్రాంతాన్ని దేశంలో నెంబర్ 1గా నిలుపుతానని, ముచ్చటగా మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధానిమోదీని మెప్పించి అధిక నిధులు తీసుకొచ్చి వరంగల్‌లో పరిశ్రమలు, ఐటీ కారిడార్, టెక్స్‌టైల్ పార్కు, తొర్రూరు మునిసిపాలిటీ అభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు అసెంబ్లీ కన్వీనర్ పూసాల శ్రీమాన్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, జనగామ జిల్లా అధ్యక్షుడు వైపీ రావు, లేగా రాంమోహన్‌రెడ్డి, రవికుమార్, మురళీధర్‌గౌడ్, రమేష్, కుమార్, కొలుపుల శంకర్, వెంకటేశ్వర్లు, సురేష్, పులేందర్, ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ జరపడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్


మాట్లాడుతున్న బండారి స్వాగత్ రణ్వీర్ చంద్

వడ్డెపల్లి, మే 9: స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణలో, ఓటింగ్ జరపడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ అన్నారు. హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో గురువారం వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో విధులు నిర్వర్తించే మైక్రో అబ్జర్వర్లకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా బండారి స్వాగత్ రణ్వీర్‌చంద్ మాట్లాడుతూ.. పోలింగ్ ఆరంభం నుంచి ముగిసే వరకు జరిగిన సంఘటనలు అన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. ఓటింగ్ తర్వాత ఓటరు తన ఓటు ఎవరికి వేశారనే రహస్యాన్ని బయటపెట్టకుండా చూడాలని పేర్కొన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రంలో వసతులు ఉండేలా కోరారు. మైక్రో అబ్జర్వర్లు నిర్దేశించిన 18 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని, ఈ అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి బాలకృష్ణ, లీడ్ బ్యాంకు మేనేజర్ హవేలి రాజు, మాస్టర్ ట్రెయినర్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

- ఏఆర్వో, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- సెక్టార్ అధికారులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మే 9: లోక్‌సభ ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని ఏఆర్వో, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఎన్నికల సెక్టార్ అధికారులతో సమావేశమయ్యారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎన్నికల సజావుగా జరిగేందుకు అందరు కృషి చేయాలని అన్నారు. సెక్టార్ అధికారులకు పోలింగ్ స్టేషన్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి మౌలిక సదుపాయాలు సరిచూసుకోవాలని అన్నారు. పోలింగ్ స్టేషన్‌లలో సిబ్బందికి, ఓటర్లకు కనీస వసతులు కల్పించాలని, విద్యుత్, మంచినీరు, ఫర్నిచర్, టాయిలెట్స్, వీల్ చైర్లు ఉండేలా చూడాలన్నారు. భోజన, ఇతర సౌకర్యాలు సీఎంహెచ్‌వో చూస్తారని చెప్పారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాలకు వందమీటర్ల దూరంలో ఎలాంటి రాతలు, వాల్‌పోస్టర్లు, ప్రచారాలు ఉండకుండా చూడాలన్నారు. ప్రతీ రెండు గంటలకు ఒకమారు పోలింగ్ శాతాన్ని ఏఆర్వోకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఏఎల్ఎంటీలు సందీప్, కనుకయ్య, నాగరాజుతో పాటు సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.


ఏడునూతులలో మిర్చి బజ్జీలు కాలుస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

మిర్చీబజ్జీలు వేసిన ఎర్రబెల్లి

కొడకండ్ల, మే 9 : వరంగల్ లోకసభ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం ప్రచారం నిర్వహించారు. ఏడునూతులలో రోడ్డుపక్కన ఉన్న హోటల్‌లో మిర్చీ బజ్జీలు కాలుస్తూ, టీ తాగుతూ యజమానులు, కస్టమర్లను బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు.

కాంగ్రెస్ గ్యారంటీలను చూసి ప్రజలు మోసపోయారు..

- అనతి కాలంలోనే వాస్తవం తెలుసుకున్నారు..
- వరంగల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురుతుంది
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయభాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న వినయభాస్కర్

రాంనగర్, మే 9: మోసపూరిత కాంగ్రెస్ గ్యారంటీలను చూసి ప్రజలు మోసపోయారని, అనతికాలంలోనే వాస్తవం తెలుసుకున్నారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముస్లిం, సిక్కులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ వైఫల్యం చెందిందన్నారు. బీఆర్ఎస్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ పబ్బం గడుపుకుంటోందని ఆరోపించారు. బీజేపీ మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయాలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. ఆ రెండు పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని వినయభాస్కర్ కోరారు.

మాజీ హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. రంజాన్‌కు దుస్తులు ఇవ్వడంతో పాటు షాదీముబారక్ పథకం ద్వారా నిరుపేదలకు ఆర్థిక సహాయం చేసిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అనతికాలంలోనే వ్యతిరేకత వచ్చిందన్నారు. రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. మోదీ, రేవంత్ ఇద్దరు ఒక్కటేనని, ఆ ఇద్దరు నేతలు చేసింది శూన్యమని ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ నిఖార్సైన ఉద్యమకారుడని, ఆయనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ముస్లింల వ్యతిరేక ప్రభుత్వం రేవంత్ ప్రభుత్వమన్నారు. రేవంత్ కేబినెట్‌లో ముస్లింలకు చోటివ్వలేదన్నారు. తనను గెలిపిస్తే వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో నేతలు యూసుఫ్ జాయిద్, సిరాజొద్దిన్, నయీమ్, మహమూద్, చోటు, సాదిక్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, మే9: నిబంధనలు ఉల్లఘించిన 10 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ పోలీసుల తెలిపారు. వారి కథనం ప్రకారం.. తనిఖీల్లో పట్టుబడ్డ 10 మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఐదుగురికి రూ. 9,000, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఐదుగురికి రూ.5,400లను జరిమానాగా న్యాయమూర్తి రమేశ్ విధించారన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

హనుమకొండ టౌన్, మే9: హనుమకొండ గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గకాలనీలో గురువారం సాయంత్రం వచ్చిన ఈదురు గాలులకు ఆరు విద్యుత్ పోల్స్ విరిగాయి. సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలమేరకు ఆపరేషన్స్ డైరెక్టర్ వి.మోహన్‌రావు, హనుమకొండ టౌన్ డీఈ పరిధిలోని అధికారురులు సంఘటనా స్థలానికి చేరుకొని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించారు.

సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో 21 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. 21 ఎఫ్ఎస్‌టీ, 21 ఎస్ఎస్‌టీ, 11 వీఎస్‌టీ, 8 వీవీటీ బృందాలతో నిరంతర గస్తీ నిర్వహిస్తున్నారు. అలాగే 3200 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలు ఇవే..

పోలింగ్ రోజున ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విధులు నిర్వర్తించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వరంగల్ పార్లమెంట్‌లో 12,710 పోస్టల్ బ్యాటెల్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 9544 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నెల 10వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు అవకాశం ఉంది. స్టేషన్ ఘనపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ ఉద్యోగుల కోసం జిల్లా పరిషత్ హైస్కూల్ (స్టేషన్ ఘనపూర్), పాలకుర్తి ఉద్యోగుల కోసం టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ గర్ల్స్ జూనియర్ కాలేజీ (పాలకుర్తి), పరకాల ఉద్యోగుల కోసం పరకాల ఆర్డీవో కార్యాలయం, వరంగల్ పశ్చిమ ఉద్యోగుల కోసం హనుమకొండలోని ప్రభుత్వ పాఠశాల, వరంగల్ తూర్పు ఉద్యోగుల కోసం లాల్ బహదూర్ కాలేజీ, వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఉద్యోగుల కోసం తహసీల్దార్ కార్యాలయం (వర్ధన్నపేట), మామునూరు క్యాంప్‌లోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల, భూపాలపల్లి ఉద్యోగులకు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల (భూపాలపల్లి)లో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు.

కబ్జాల చరిత్ర ఎవరిదో ప్రజలకు తెలుసు

(5వ పేజీ తరువాయి)

రిజర్వేషన్లు పెంచుతారే తప్ప రద్దు చేస్తారా? వరంగల్ సభలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లను పెంచుతామని, రద్దు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దీంతో కాంగ్రెస్ ప్రచారాన్ని ప్రజలు నమ్మటం లేదు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సుమోటగా తీసుకుని.. తప్పుడు ప్రచారం చేస్తూ.. ఎస్సీ, ఎస్టీలను ఆందోళనకు గురి చేస్తున్నవారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.

ఆంధ్రజ్యోతి: ఎస్సీ వర్గీకరణ ఈసారి సాధ్యమవుతుందని భావిస్తున్నారా...?

అరూరి : వందకు వంద శాతం ఎస్సీ వర్గీకరణ ప్రధాని మోదీతోనే సాధ్యమవుతుంది. మోదీ మాట ఇస్తే తప్పే రకం కాదు. మంద కృష్ణమాదిగ చేస్తున్న వర్గీకరణ మహాఉద్యమానికి ఆయన మద్దతు ప్రకటించారు. ఇప్పటికే వర్గీకరణ కోసం కేంద్రం ఓ కమిటీ కూడా వేసింది. కొన్ని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మోదీ పరిష్కరిస్తారనే విశ్వాసం ఉంది.

ఆంధ్రజ్యోతి: గెలిస్తే వరంగల్‌కు మీరు ఏం చేయాలనుకుంటున్నారు?

అరూరి : అభివృద్ధి పరంగా ఎంతో వెనకబడిన వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయటమే నా తొలి ప్రాధాన్యం. వరంగల్‌కు విమానాశ్రయం, భూపాలపల్లికి రైల్వేలైన్ తీసుకొస్తా. వర్షకాలంలో జలదిగ్బంధానికి గురవుతున్న వరంగల్ మహానగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు కృషి చేస్తా. కాజీపేట రైల్వేస్టేషన్ డివిజన్ స్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి, పంట, వస్త్ర పరిశోధన కేంద్రాల ఏర్పాటు, వరంగల్‌లో ఐఐఎం, కొత్త జిల్లాలో నవోదయ పాఠశాలలతో పాటు కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి నా ప్రాధాన్యత అంశాలు. వీటితో పాటు కాకతీయు కళా సంపదకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తా. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పార్లమెంట్‌లో ప్రస్తావించి ఓరుగల్లు అభివృద్ధికి శ్రమిస్తా.

విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 9: సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.రాజు, సీహెచ్. రవీందర్‌రాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌సీటీఈ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాటిని దాచిపెట్టిన విద్యాశాఖ కమిషనర్‌పై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కడియం కావ్యను గెలిపించాలి



కాజీపేటలో ప్రచారంలో పాల్గొన్న తక్కళ్లపల్లి శ్రీనివాస రావు

కాజీపేట, మే 9: తెలంగాణ అభివృద్ధిపై బీజేపీ చిన్నచూపు చూస్తూ, తెలంగాణలో విద్వేషం సృష్టిస్తున్న బీజేపీని ఓడించి, ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. కాజీపేటలో గురువారం ఏఆర్ఆర్ కాలనీ, వైఎస్ఆర్ నగర్ కాలనీలో సీపీఐ ప్రచారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస రావు మాట్లాడుతూ.. తెలంగాణపై బీజేపీ మొదటినుంచి మోసపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత విభజన హామీలు నెరవేర్చకుండా వివక్ష ప్రదర్శిస్తోందన్నారు. వామపక్ష పార్టీలు బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపిస్తే పెండింగ్ ప్రాజెక్టులు వస్తాయన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నెదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి తోపాటు స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● కాజీపేట సోమిడిలో గురువారం కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ బూత్‌కమిటీ సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● ఐనవోలు: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. సీపీఎం పార్టీ బలపర్చిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ.. వెంకటపురంలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో సొసైటీ డైరెక్టర్ మేటే చిరంజీవి, నాయకులు విఠల్, నారాయణరెడ్డి, ఉప్పలయ్య, రాంబాబు, రవి, నర్సయ్య, రవి, మహేందర్, వెంకటేష్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

● ధర్మసాగర్: కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు ముత్తిరెడ్డి అమరేందర్‌రెడ్డి కోరారు. ధర్మసాగర్ మండలం కేశవనగర్ శివారు బంజారుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● న్యూశాయంపేట: కాంగ్రెస్ అభ్యర్థి కావ్యను గెలిపించాలని 31వ డివిజన్ న్యూశాయంపేటలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు మామిండ్ల సురేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రచార కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు పాల్గొన్నారు. అలాగే వామపక్ష పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని సీపీఎం కాజీపేట మండల కమిటీ సభ్యులు ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

● వడ్డేపల్లి: కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని జవహర్ కాలనీలో డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపే తమ లక్ష్యమని వైఎస్ఆర్- టీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, సంగాల ఇర్మియా అన్నారు. 56వ డివిజన్ బృందావన కాలనీలో కడియం కావ్యను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

● మడికొండ: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గురువారం 44, 45 డివిజన్ల పరిధిలోని కడిపికొండ, రాంపేటలో ప్రచారం నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్నర్ మీటింగ్‌లో కావ్య మాట్లాడుతూ.. వరంగల్ సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తి మన ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ మడికొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కుర్ల మోహన్, భైరి లింగమూర్తి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, వాల్మీకి బోయ సంఘం పెద్దలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, కడియం కావ్యను మడికొండకు చెందిన జంగా రాఘవరెడ్డి వర్గీయులు హనుమకొండలోని ఆమె నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ ఎన్నికలలో తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం రజినీవేణు యాదవ్, దువ్వ విజయ్, కొప్పుల నవీన్, మందల సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావ్యను గెలిపించండి : కడియం

ధర్మసాగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపిస్తే మీ సేవ చేసుకుంటూ తాను, తన కూతురు గ్రామాలను అభివృద్ధి చేస్తామని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం వేలేరు మండలం పీచర, వేలేరు, ధర్మసాగర్ మండలం నారాయణగిరి, ముప్పారం, ధర్మసాగర్ గ్రామాలలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, మన రిజర్వేషన్లు పదిలంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ గెలవాలన్నారు. బీజేపీకి ముస్లింలు, క్రిస్టియన్లు, మైనారిటీలు, మహిళలు అంటే గిట్టదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం, గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. రానున్న రోజుల్లో సీఎం సహకారంతో అధిక నిధులు తీసుకువచ్చి గ్రామాలను మరింత అభివృద్ధి చేయడమే తన లక్ష్మమన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసింది ఏమి లేదన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావ్యను గెలిపించాలని శ్రీహరి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాద్, నారాయణగిరి గ్రామశాఖ అధ్యక్షుడు రాజయ్య, ముప్పారం గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశం భద్రంగా ఉండాలంటే బీజేపీని గెలిపించండి

వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్



హనుమకొండలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

ధర్మసాగర్, మే 9: భారతదేశం భద్రంగా ఉండాలంటే భారతీయ జనతా పార్టీని గెలిపించాలని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ అన్నారు. బీజేపీకి ఓటు వేసి నరేంద్రమోదీని మూడోసారి ప్రధానమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. ధర్మసాగర్, పెద్దపెండ్యాల గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆరూరి మాట్లాడారు. తాను పక్కా లోకల్ అని.. ఈ నియోజకవర్గానికి చెందిన దళిత బిడ్డనని, తనను ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ధర్మసాగర్‌లో చాలా సమస్యలు ఉన్నాయని, నక్కలతూము ద్వారా రైతుల పంట పొలాలకు కడియం శ్రీహరి సాగు నీరు అందించలేక పోయారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, జిల్లా నాయకులు విజయరావు, మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యంపై మోదీ ప్రత్యేక దృష్టి

హనుమకొండ టౌన్: 10 యేళ్లలో మోదీ ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. హనుమకొండలోని ఓ హోటల్‌లో ఐఎంఏ, ఆయుర్వేద వైద్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. భారతదేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా మోదీ నిలిపాడన్నారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, వైద్యులు కాశీప్రసాద్, విజయ్‌చందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఇతర వైద్యుల పాల్గొన్నారు.

బీజేపీలోకి కాశాగూడెం మాజీ సర్పంచ్

వర్ధన్నపేట మండలం కాశాగూడెం మాజీ సర్పంచ్ షేక్ సఫియా యాకూబ్ గురువారం తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని వరంగల్ లోక్‌సభ బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశలంలో బీజేపీ అభ్యర్థి అరూరి కషాయపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్ హైదర్, గుమ్మా, షేక్‌బాషా, మహ్మద్ రియాజ్, మహ్మద్ జయాబీ, సల్మా, కాశీంబీ, కరీం, యాకూబ్, ఆరీఫ్, రషీద్, హర్షద్ ఉన్నారు.

బీజేపీకి మంద కృష్ణ మద్దతు పలకడం దుర్మార్గం

వడ్డేపల్లి, మే 9: మనువాద, మతోన్మాద బీజేపీకి ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ లోక్‌సభ ఎన్నికల్లో మద్దతు పలకడం దుర్మార్గమని తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి చైర్మన్ పోకల కిరణ్‌కుమార్ మాదిగ, రాష్ట్ర ప్రధాన సలహాదారు సంగీతపు రాజలింగం అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీకి మద్దతు పలికి మాదిగ సమాజాన్ని మంద కృష్ణ మాదిగ ఆ పార్టీకి తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత బొట్ల భిక్షపతి మాదిగ, మహాకూటమి రాష్ట్ర, జిల్లా నాయకులు కల్యాణ్, ప్రేమ్‌రాజ్, గోవింద్ నరేష్, కట్టా స్వామి, మున్నగి రఘు మాదిగ, కృపానందం, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను విస్మరించిన బీజేపీ, బీఆర్ఎస్..

వడ్డెపల్లి, మే 9: బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు విశ్వబ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరించాయని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి చారి అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు ఒరిగింది శూన్యమని దుయ్యబట్టారు. ఈ నెల 11న హనుమకొండ కేయూ 100 ఫీట్ల రోడ్డులోని శ్యామల గార్డెన్‌లో సాయంత్రం 4 గంటలకు నిర్వహించే విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం సభలో విశ్వబ్రాహ్మణ సంఘీయులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు శృంగారపు వెంకటేశ్వర్లు, రుద్రోజు మణీంద్రనాథ్, గన్నోజు జగన్, కలకోటి శ్రీధర్, కురిమిళ్ల రమేష్, నర్సింహచారి, బాలోజీ భద్రయ్య, రాంమూర్తి, సిద్దు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

వరంగల్ మెడికల్, మే 9: ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం కాజీపేటలోని బస్తీ దవాఖాన ఆరోగ్యకేంద్రం వద్ద స్వీప్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కాజీపేట బస్తీ ఆరోగ్యకేంద్రం నుంచి కాజీపేట, దర్గా జంక్షన్ వరకు కొనసాగింది. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు విధిగా వినియోగించుకోవాలని నినాదాలు చేశా రు. అనంతరం కాజీపేట దర్గా జంక్షన్‌లో మానవహారం నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సృజన, అశోక్‌రెడ్డి, డాక్టర్ వివేక్ వర్ధన్, టి.మాధవరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కర్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పది గ్రేడ్ సాధించడం అభినందనీయం



సన్మానించిన విద్యార్థులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, మే 9: జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే, గురుకుల, ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ, గిరిజన, మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన 20 మంది పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ అబ్దుల్ హై, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటు ద్వారాలనే ప్రజాస్వామ్యం మనుగడ

వరంగల్ కార్పొరేషన్, మే 9: ఓటు ద్వారానే ప్రజాస్వామ్యం మనుగడ సాధిస్తుందని వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ తూర్పు ఏనుమాముల మార్గెట్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గురువారం ఓటర్లు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భాగ్యలక్ష్మి మాట్లాడారు. అక్కడ పని చేసే సిబ్బందికి, హమాలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం అందరం తప్పకుండా ఓట్లు వేస్తాం.. వేయిస్తాం అని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ డీడీ ప్రసాదరావు, కార్యదర్శి గుగులోతు రెడ్డి, వరంగల్ తూర్పు నోడర్ అధికారి రాజేశ్‌కుమార్, దివ్యాంగుల నోడల్ అధికారి సత్యవాణి, మార్కెటింగ్ కమిటీ జాయింట్ సెక్రెటరి శ్రీనివాస్, టీఎంసీ రమేష్, సీవోలు శ్రీలత, ప్రవీణ్, రవ, అలీలతో పాటు మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిక్ లైన్ యార్డులో స్క్రాబ్ బోగీకి మంటలు

అప్రమత్తమైన రైల్వే అధికారులు, మంటలార్పిన ఫైర్‌సిబ్బంది



మంటలార్పుతున్న ఫైర్‌సిబ్బంది

కాజీపేట, మే 9: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలోని సిక్‌లైన్ యార్డులో గురువారం సాయంత్రం ఓ స్క్రాప్ బోగీకి మంటలంటుకున్నాయి.. అప్రమత్తమైన రైల్వే అధికారులు ఫైర్‌సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్‌సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలార్పారు. రైల్వే అధికారులు, రైల్వే సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట రైల్వే స్టేషన్ సిక్‌లైన్‌లోని ఏడు కోచింగ్ స్క్రాబ్ బోగీలను రైల్వే ఉన్నతాధికారులు ఓ ప్రైవేట్ సంస్థకు స్క్రాప్ కింద అమ్మకం చేసి అప్పగించారు. ఈ క్రమంలో స్క్రాబ్ బోగీలను కొనుగోలు చేసిన సంస్థ బోగీల విడి భాగాలను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసే క్రమంలో చివర ఉన్న గార్డుబోగీలో ఆయిల్ పడి ఉండడంతో గ్యాస్‌కట్టర్‌తో కట్‌చేస్తుండగా నిప్పంటుకుంది. దీంతో సిబ్బంది మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికీ మంటలు ఆరక పోగా చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఫైర్‌సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి వచ్చి మంటలార్పారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు.. రైల్వేకు కూడా ఎలాంటి నష్టం జరగలేదని రైల్వే అధికారులు తెలిపారు.

యువత ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి


వరంగల్ మెడికల్, మే 9: సమాజంలో రోజురోజుకూ విస్తరిస్తున్న ఎయిడ్స్ పట్ల నేటి యువత అప్రమత్తంగా ఉంటూ పలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ప్రసాద్ సూచించారు. కాళోజీ నారాయణంరావు ఆరోగ్య యూనివర్సిటీ చేపట్టిన యూనివర్సిటీ స్థాయి కాలేజీ విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం కేఎంసీలోని ఎన్ఆర్ఐ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మోహన్ దాస్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ మీద అవగాహన కలిగి ఉండాలని, అందరూ విధిగా పరీక్షలు చేసుకోవాలన్నారు. ఎయిడ్స్ రాకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రపంచం మొత్తం మీద ఏఏ సంస్థలు ఏ విధంగా దశల వారిగా పని చేస్తున్నాయో వివరించారు.

ఇప్పటివరకు ఇంతపెద్ద కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఒక లక్ష ఆరువేల మంది ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్నారని వివరించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, డాక్టర్ మదన్‌మోహన్, స్వప్నమాధురి, వరంగల్ పరిధిలోని పలు కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

అలకానంద కాలనీలో చోరీ

వరంగల్ క్రైం, మే 9: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకానంద కాలనీలో ఒకరి ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన జి.శ్రీదేవి నివాసంలో చోరీ జరుగగా తొమ్మిదిన్న తులాల బంగారం, రూ.15వేల నగదు అపహరించుకువెళ్లారు. వేసవి కావడంతో గురువారం భవనంపైన పడుకున్నారు. శుక్రవారం ఉదయం కిందికివచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉంది. లోనికివెళ్లి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి బంగారం, నగదు అపహరించుకువెళ్లినట్లు గుర్తించారు. ఇంటి యజమానురాలు శ్రీదేవి కేయూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీ విషయాన్ని ఎస్ఐ సురేష్ ధ్రువీకరించారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తలసీమియా బాధితులను ఆదుకోవాలి



జీన్ హెన్రీ డ్యూనాట్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

సుబేదారి, మే 9: సమాజంలోని ప్రతీ ఒక్కరు తలసేమియా బాధితులను బాధ్యతగా ఆదుకోవాలని రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ సుబేదారి క్రాస్ రోడ్డులోని రెడ్ క్రాస్ భవన్‌లో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవంతో పాటు అంతర్జాతీయ తలసేమియా దినోత్సవాన్ని జిల్లా రెడ్ క్రాస్ పాలక వర్గం సభ్యులు ఘనంగా నిర్వహించారు. తొలుత చైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి రెడ్ క్రాస్ జెండాను ఆవిష్కరించి అనంతరం జీన్ హెన్రీ డ్యూనాట్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించి రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, జిల్లా పాలక వర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డాక్టర్ ఎం. శేష మాధవ్, డాక్టర్ సీహెచ్. సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, రెడ్ క్రాస్ డాక్టర్లురెడ్ క్రాస్ సిబ్బంది, జీవిత కాల సభ్యులు పాల్గొన్నారు.

పాల బిల్లులు చెల్లించాలని పాడి రైతుల ధర్నా

న్యూశాయంపేట, మే9: పాల బిల్లులు చెల్లించాలని పాడి రైతులు గురువారం అలంకార్ సమీపంలో ని విజయ డెయిరీ ఎదుట ధర్నా చేశారు. విజయ కాకతీయ పాడి రైతుల సంఘం అధ్యక్షుడు ఇరుకు దేవేందర్‌రావు మాట్లాడుతూ.. ఇటీవల పాల బిల్లులు చెల్లించడంలో ఆలస్యం జరుగుతోందని, 15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాలన్నారు. అనంతరం విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్‌కు సకాలంలో చెల్లించి సమ స్య పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వేలేరు(ధర్మసాగర్) మే 9: చికిత్స పొందుతూ మేకల ఈశ్వరమ్మ(50) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్సై హరిత గురువారం తెలిపారు. వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ కొన్నేళ్ల నుంచి కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతోంది, కాగా, చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనస్తాపం చెందిన ఆమె బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను 108లో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈశ్వరమ్మకు భర్త, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

టీపీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మహాత్మా

వరంగల్ లీగల్, మే 9: రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, సీనియర్ న్యాయవాది నల్ల మహాత్మా టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా చేస్తూ పార్టీకి విశిష్ట సేవలు అందిస్తున్నారు.



రాష్ట్రపతి నుంచి పద్మశ్రీ అందుకుంటున్న ఉమామహేశ్వరి, ఆనందాచారి

చిరంజీవి, వైజయంతీ మాలకు పద్మవిభూషణ్ ప్రదానం

- పద్మశ్రీలు స్వీకరించిన వేలు ఆనందాచారి, ఉమా మహేశ్వరి, కూరెళ్ల విఠలాచార్య
- రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా ప్రదానోత్సవం
- హాజరైన ఉపరాష్ట్రపతి, ప్రధాని, రాంచరణ్ తదితరులు



పురస్కార ప్రదానోత్సవంలో రాంచరణ్, ఉపాసన, సురేఖ

న్యూఢిల్లీ, మే 9 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ సినీ నటుడు చిరంజీవి, ప్రముఖ నర్తకి వైజయంతీ మాల బాలికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలో రెండో అత్యున్నత మైన పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందజేశారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్, చిరంజీవి కుమారుడు, ప్రముఖ సినీ నటుడు రాంచరణ్, ఆయన సతీమణి ఉపాసన తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పురస్కారాల ప్రదానంలో భాగంగా ఇద్దరికి పద్మవిభూషణ్, 9 మందికి పద్మభూషణ్, 55 మందికి పద్మశ్రీలను రాష్ట్రపతి బహూకరించారు. సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీవీ, బీజేపీ నేతలు సత్యవ్రత ముఖర్జీ, ఓ రాజగోపాల్, దివంగత సినీనటుడు విజయకాంత్, లద్దాఖ్ ఆధ్యాత్మిక గురువు తోగ్దాన్ రింపోచే, గుజరాతి పత్రిక జన్మభూమి ఎడిటర్ కుందన్ వ్యాస్, బాంబే సమాచార్ యజమాని హోర్ముస్ జీ కామా తదితరులకు పద్మభూషణ్ ప్రదానం చేశారు. విజయకాంత్, ఫాతిమా బీవి, సత్యవ్రత ముఖర్జీ బంధువులు వారి తరఫున పురస్కారాన్ని స్వీకరించారు. కాగా పద్మశ్రీ పురస్కారాలు స్వీకరించిన తెలుగు వారిలో యాదాద్రి శిల్పకారుడు వేలు ఆనందాచారి, హరికథా కళాకారిణి ఉమామహేశ్వరి, ప్రముఖ సాహితీ వేత్త, ఇంటినే గ్రంథాలయంగా మార్చిన కూరెళ్ల విఠలాచార్య ఉన్నారు. గుజరాత్‌కు చెందిన సాహితీవేత్త, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత రఘువీర్ చౌదరి, తొలి మహిళా మావటి పర్బతి బారువా, ఆదివాసీ పర్యావరణవేత్త చామి ముర్ము తదితరులు కూడా పద్మశ్రీ పురస్కారాలను స్వీకరించారు. కాగా, 2024 పద్మ అవార్డుల ప్రదానోత్సవ తొలివిడత కార్యక్రమాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 22న చేపట్టగా.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పద్మవిభూషణ్, మరికొంత మందికి పద్మ పురస్కారాలను రాష్ట్రపతి అందించగా.. గురువారం మిగతా వారికి అందజేశారు.

పైపుల లారీలో రూ. 8.36 కోట్లు!

- గరికపాడు వద్ద పట్టుకున్న ఎస్టీఎఫ్
- డ్రైవర్ క్యాబిన్, లారీ బాడీ మధ్య అరలో
- మొత్తం ఐదు అట్టపెట్టెల్లో నగదు
- చిత్తూరు వైసీపీ నేతవేనా?

విజయవాడ(ఆంధ్రజ్యోతి)/వేటపాలెం(చీరాల), మే 9: సార్వత్రిక ఎన్నికల వేళ అక్రమంగా తరలిస్తున్న సొమ్మును పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించి సీజ్ చేస్తున్నారు. తాజాగా ఎన్టీఆర్ జిల్లా గరికపాడు చెక్‌పోస్టు వద్ద లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ.8.36 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోని మెదక్ నుంచి పైపుల లోడుతో వస్తున్న లారీని గురువారం తెల్లవారుజామున ఒంటి గంట తర్వాత స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో పైపులు తప్ప ఎలాంటి నగదు లభించ లేదు. దీంతో డ్రైవర్, క్లీనర్‌ను ప్రశ్నించారు. దీంతో డ్రైవర్ క్యాబిన్‌కు, లారీ బాడీకి మధ్య ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన అరలో నగదు ఉన్నట్లు వారు వెల్లడించారు. పోలీసులు అరను తెరిచి ఐదు అట్టపెట్టెల్లో నగదు ఉన్నట్లు గుర్తించారు. ఐదు కౌంటింగ్ యంత్రాలను తెప్పించి నగదును లెక్కించగా 8,36,78,000 ఉన్నట్లు తేలింది.

టీడీపీ నేతల ఫిర్యాదుతో...

ఈ నగదు ప్రకాశం జిల్లాలో వైసీపీ తరఫున పోటీ చేస్తున్న చిత్తూరు జిల్లా నేతవని విశ్వసనీయ సమాచారం. ఈ లారీకి సంబంధించిన పక్కా సమాచారం టీడీపీ నేతలకు రావడంతో వారు అప్రమత్తమయ్యారు. వైసీపీ నేతలకు సంబంధించిన నగదు అని చెబితే పోలీసులు ఎలా స్పందిస్తారోననే అనుమానంతో టీడీపీ నేతలకు చెందిన నగదు ఫలానా లారీలో వస్తోందని సీ-విజిల్ యాప్‌లో టీడీపీ నేతలే ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు లారీని తనిఖీ చేశారు. కాగా, పట్టుబడిన లారీతో పాటు మరో 3 లారీల్లోనూ నగదు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ లారీ పట్టుబడటంతో వెనుక ఉన్న లారీల డ్రైవర్లు అప్రమత్తమయ్యారు. ఏపీలోకి ప్రవేశించకుండా లారీలు వెనక్కి తిప్పుకొని వెళ్లిపోయినట్లు సమాచారం.

బాదుడు లేని పాలన అందిస్తా

జగన్‌లా అప్పులు తెచ్చి బటన్ నొక్కను.. సంపద సృష్టిస్తా.. సంక్షేమం, అభివృద్ధి చేపడతా

- ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో తీవ్ర నష్టం
- మన భూములపై మనకు హక్కుండదు
- టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టీకరణ



మన్యం జిల్లా కురుపాంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, హాజరైన జనం

పార్వతీపురం/విజయనగరం/విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పన్నుల బాదుడు లేని పారదర్శక పాలన అందిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. జనం భవిష్యత్‌కు కూటమిదే బాధ్యతని భరోసా ఇచ్చారు. జగన్ భారీగా అప్పులు తెచ్చి బటన్ నొక్కుడు చేసి మిగిలిన మొత్తాన్ని జేబులోకి బుక్కుకుంటున్నారని ఆరోపించారు. అలాంటి పని తాను చేయనని.. సంపదను సృష్టించి ఆ సొమ్ముతో ఇప్పుడున్న సంక్షేమ పథకాలతో పాటు మిగిలినవీ అమలు చేస్తానన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇచ్చి అన్ని విధాలా మంచి పాలన అందిస్తానని తెలిపారు. గురువారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, విజయనగరం జిల్లా చీపురుపల్లి, విశాఖ నగరంలో నిర్వహించిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ బటన్ నొక్కినా ఖాతాల్లోకి డబ్బులు రావడం లేదన్నారు. మరోవైపు ధరలు, పన్నులు పెంచేశారని... వచ్చిన డబ్బులు వచ్చినట్లే పోయి తిరిగి అప్పులు మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎవరి జీవితాల్లోనూ వెలుగులు లేవని.. జీవన ప్రమాణాలు పెరగలేదని చెప్పారు. గిరిజనులకు, దళితులకు, బీసీలకు ఒక అన్నగా, తమ్ముడుగా, కుటుంబ పెద్దగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మహిళలను మహాశక్తి మంతులుగా తీర్చిదిద్దుతానని, ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. గత ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని దళితులకు, గిరిజనులకు, ఇతర సామాజిక వర్గాలకు జలగ జగన్ ద్రోహం చేశాడని ఆరోపించారు. ఆయన మీ బిడ్డ కాదని రాష్ట్రానికి పట్టిన కేన్సర్ గడ్డ అని ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన జీవో నంబర్ 3ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి స్థానికంగా గిరిజనులకు ఉద్యోగాలు లేకుండా చేసిందన్నారు. గిరిజన ప్రాంతాల ప్రజలు జగన్‌కు ఓటు వేసి గెలిపిస్తే ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయకుండా కాటు వేశారని.. గిరిజనుల కోసం 16 పథకాలను తాను అమలు చేస్తే జగన్ రద్దు చేసి అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. వారి పిల్లల కోసం బెస్ట్ ఎవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించానని.. ఆయన ఇదీ రద్దు చేశానని చెప్పారు. తెలుగుదేశం కాలంలో 60 శాతం సబ్సిడీతో ట్రైకార్ రుణాలు అందిస్తే.. జగన్ ఎక్కడా ఇవ్వలేదని.. ఎన్టీఆర్ పెట్టిన ఐటీడీఏలను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 3ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీల కోసం 27 సంక్షేమ పథకాలను, బీసీల కోసం, ఇతర సామాజికవర్గాల కోసం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కూడా జగన్ రద్దు చేశారని, దగాకోరు జగన్‌ను ఇంటికి పంపించి వైసీపీని భూ స్థాపితం చేయాలని పిలుపిచ్చారు. నవరత్నాలు నవమోసాలని విమర్శించారు. 'మనం భూములు, ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఒరిజినల్ పత్రాలు జగన్ వద్ద, జిరాక్స్ పత్రాలు భూ యజమానుల వద్ద ఉంచడం వెనుక కుట్ర ఉంది. ఈ చట్టం ద్వారా మన భూములపై హక్కులు కోల్పోతాం. అమ్మాలన్నా, కొనాలన్నా ఆ భూమి మనదేనని రుజువు చేసుకోవాలి. అలా రుజువు చేసుకోవాలంటే మళ్లీ అధికారుల చుట్టూనే తిరగాలి. అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం మెగా డీఎస్సీపై చేస్తా. రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపైనే చేస్తా' అని అన్నారు.



దాతల సాయం కోరుతున్న సాయిచరణ్, కుటుంబసభ్యులు

మా నాన్నని బతికించండి..

- అరుదైన క్యాన్సర్‌తో బాధపడుతున్న సిద్దిపేట వాసి
- నాలుగు నెలలుగా కొనసాగుతున్న చికిత్స
- మెరుగైన చికిత్స కోసం దాతలు సాయం కోరుతూ కన్నబిడ్డల వేడుకోలు

సిద్దిపేట టౌన్, మే9: కోటి మందిలో ఒకరికి వచ్చే అరుదైన క్యాన్సర్‌తో బాధపడుతున్న తమ తండ్రికి చికిత్స చేయించేందుకు అవసరమైన ఆర్థిక సాయం చేయాలంటూ ఇద్దరు చిన్నారులు వేడుకుంటున్నారు. అలాగే, తమ కొడుకుని కాపాడుకునేందుకు సాయం చేయాలంటూ ఆ రోగి తల్లిదండ్రులూ కన్నీటి పర్యంతమవుతున్నారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. సిద్దిపేటకు చెందిన సిరిసిల్ల రాము, సునీత దంపతులకు కుమారుడు సాయిచరణ్ (35) ఉన్నాడు. సాయిచరణ్‌కు భార్య లక్ష్మిప్రసన్న, కుమార్తెలు లక్ష్మిసుసజ్ఞ(6), స్మయ(2 నెలలు) ఉన్నారు. నాలుగు నెలల క్రితం సాయిచరణ్‌కు తీవ్రమైన జ్వరం రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. కానీ, జ్వరం తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చేసిన వైద్య పరీక్షల్లో సాయిచరణ్.. అక్యూర్డ్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్)తో బాధపడుతున్నట్టు తేలింది. జన్యు మార్పిడి కారణంగా కోటి మందిలో ఒకరికి వచ్చే ఈ క్యాన్సర్ ప్రాణాంతకమని, వెంటనే చికిత్స ప్రారంభించాలని వైద్యులు సూచించారు. దీంతో సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో తమ ఇంటిని విక్రయించగా వచ్చిన రూ.18 లక్షలతో కుటుంబసభ్యులు సాయిచరణ్‌కు చికిత్స చేయించారు. హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో నాలుగు నెలలుగా కీమోథెరపీ చేయించుకున్న సాయిచరణ్‌కు మరో రెండ్రోజుల్లో స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా తండ్రి రాము రక్తమూలకణాలను సాయిచరణ్‌కు ఎక్కిస్తారు. ఈ చికిత్స ద్వారా ఏడాదిన్నరలోగా సాయిచరణ్‌కు ఉన్న వ్యాధి 90 శాతం తగ్గే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. అయితే, ఈ చికిత్సకు రూ.25 లక్షలు అవసరం. వెల్డింగ్ దుకాణంలో పని చేసి రాము ప్రస్తుతం అన్నీతానై కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇప్పటికే ఉన్న ఇంటిని అమ్మేసిన ఆ కుటుంబం చికిత్సకు అవసరమైన డబ్బు కోసం దాతల సాయం కోరుతోంది. ఇద్దరు చిన్నారుల తండ్రైన సాయిచరణ్‌కు సాయం చేయాలనుకునే దాతలు 92955 55855 నెంబరుకు ఫోన్‌పే ద్వారా డబ్బు పంపించాలని లేదా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులోని సిరిసిల్ల సాయిచరణ్ ఖాతా(23990100004002, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఐఓబీఏ0002399)లో నగదు జమచేయాలని ఆ కుటుంబం కోరింది.



అబ్ కీ బార్?


హిందూ, ముస్లింల సంఖ్యను ఎలా నిర్ధారిస్తారు?: తేజస్వీ



పాట్నా, మే 9: దేశంలో జన గణన జరగకుండానే హిందూ, ముస్లింల జనాభాపై కేంద్రం ఒక నిర్ణయానికి ఎలా వస్తుందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. భారత్‌లో ముస్లింల జనాభా పెరిగిందని అదే సమయంలో హిందువుల జన సంఖ్యలో తగ్గుదల ఉందంటూ ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి వెల్లడించిన నివేదికపై ఆయన మాట్లాడారు. ఇటువంటి చర్యల ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందూ, ముస్లింల మధ్య గొడవలు సృష్టించేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు.

దేశంలో నీగ్రో, మంగోలాయిడ్ ప్రజలు!

- కాంగ్రెస్‌నేత అధీర్ రంజన్ చౌధురి వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, మే 9: 'దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లలా ఉంటారు' అంటూ కీలకమైన ఎన్నికల సమయంలో శామ్‌పిట్రోడా చేసిన వ్యాఖ్యలతో పార్టీకి కలిగిన నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ ఉంటే.. ఆ పార్టీకే చెందిన మరో సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధురి.. పిట్రోడా వ్యాఖ్యలను సమర్థించేలా మాట్లాడి మరోసారి బీజేపీ నేతల విమర్శలకు ఆస్కారమిచ్చారు. శామ్‌పిట్రోడా వ్యాఖ్యలపై ఆయన స్పందన కోరగా.. "ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలపైనా నేనేమీ మాట్లాడదల్చుకోలేదు. మనదేశంలో ప్రోటో ఆస్ట్రలాయిడ్, నెగ్రిటా (నీగ్రో), మంగోలాయిడ్ జాతులకు చెందినవారున్నారు. మనదేశ నైసర్గిక స్వరూపం (టోపోగ్రఫీ) కారణంగా దేశంలో ఒక్కోచోట ఒక్కో రూపురేఖలున్నవారు ఉంటారు. ఇదే మనం నేర్చుకున్నది. అందరూ ఒకలా ఉండరు. కొంతమంది నల్లగా.. కొంతమంది తెల్లగా ఉంటారు" అని ఆయన వ్యాఖ్యానించారు. అధీర్ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. "ఒక్క శామ్‌పిట్రోడాయే కాదు.. మొత్తం కాంగ్రెస్ నేతలందరూ జాతివివక్ష వ్యాఖ్యలు చేస్తారు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన అధీర్‌ను పార్టీ నుంచి కాంగ్రెస్ బహిష్కరిస్తుందా? అని నిలదీశారు.

అధికారం.. మోదీ చేజారుతోంది: రాహుల్



న్యూఢిల్లీ/రాయ్‌బరేలి, మే 9: దేశంలో ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు మోదీ చేజారిపోతున్నాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. దాంతో ప్రజల దృష్టిని మరల్చేందుకు ఆయన కొత్త నాటకానికి తెరలేపే అవకాశాలు ఉన్నాయని, దేశ యువత ఆ మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గురువారం 'ఎక్స్‌'లో రాహుల్ గాంధీ వీడియో సందేశం విడుదల చేశారు. జూన్ 4న తాము అధికారం చేపట్టబోతున్నామని, ఆగస్టు 15 నుంచి 30 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టబోతున్నామని ప్రకటించారు. యువతే దేశానికి బలం అని అన్నారు.

మోదీ 'బాబ్రీ తాళం' వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధం: ప్రియాంక

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అయోధ్యలోని రామాలయానికి 'బాబ్రీ తాళం' వేస్తారంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధమని ఆ పార్టీ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా గురువారం అన్నారు. కోర్టు తీర్పును గౌరవించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు పేర్కొందని, గతంలోనూ ఇది పాటించామని, భవిష్యత్తులోనూ ఇదే చేస్తామని పాత్రికేయులతో రాయ్‌బరేలిలో ఆమె అన్నారు.

మోదీ, రాహుల్.. డిబేట్‌కి రండి

- ఇద్దరు మాజీ న్యాయమూర్తులు, హిందూ ఎడిటర్ ఆహ్వానం

న్యూఢిల్లీ, మే 9: రిజర్వేషన్లు, ఆర్టికల్ 370, సంపద పంపిణీ, ఎన్నికల బాండ్లు.. ఇలా పలు అంశాలపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పర విమర్శలు, ఆరోపణలతో వాగ్యుద్ధాలకు దిగడం చాలాకాలంగా చూస్తున్నదే! అయితే.. ఇలా ఆరోపణలు, దూషణలతో సరిపెట్టకుండా ఆయా అంశాలపై ఇరుపార్టీల నేతల నడుమ సహేతుక చర్చ జరిగితే తాము ఎవరికి ఓటేయాలో ప్రజలు నిర్ణయించుకోగలుగుతారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకూర్, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఏపీ షా, హిందూ పత్రిక సంపాదకుడు ఎన్.రామ్ భావించారు. ఈమేరకు వారు.. పబ్లిక్ డిబేట్‌కు రావాల్సిందిగా కోరుతూ ప్రధాని మోదీకి, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. ఇరుపార్టీల నేతల మధ్య బహిరంగ చర్చ జరిగితే.. ప్రశ్నలు, ఆరోపణలు మాత్రమే కాక సమాధానాలు కూడా ప్రజలు వినగలుగుతారని, ఎవరికి ఓటేయాలో తేల్చుకుంటారని లేఖలో పేర్కొన్నారు. చర్చ ఎప్పుడు, ఎక్కడ జరగాలో, మోడరేటర్లుగా ఎవరు ఉండాలో.. ఇరుపార్టీల నేతల అంగీకారంతో నిర్ణయిస్తామని వారు తెలిపారు.

భారత ఎన్నికల్లో అమెరికా జోక్యం

- అంతర్గత రాజకీయాలను అస్థిరపరిచే కుట్ర: రష్యా

న్యూఢిల్లీ, మే 9: భారతదేశ లోక్‌సభ ఎన్నికల్లో జోక్యం చేసుకునేందుకు అగ్రరాజ్యం అమెరికా ప్రయత్నిస్తోందని రష్యా సంచలన ఆరోపణలు చేసింది. రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మారియా జఖారోవ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. భారత అంతర్గత రాజకీయాలను అస్థిరపరిచేందుకు, సార్వత్రిక ఎన్నికలను సంక్లిష్టం చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తోందన్నారు. ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యలో భారత ఇంటెలిజెన్స్ అధికారుల పాత్ర ఉందని అమెరికా చేసిన ఆరోపణనూ ఆమె ఖండించారు. మతస్వేచ్ఛకు సంబంధించి అమెరికా తరచుగా నిరాధార ఆరోపణలు చేస్తోందని, ఇది భారతదేశాన్ని అగౌరవపరచడమేనని స్పష్టం చేశారు. భారతీయుల మనస్తత్వాన్ని, చరిత్రను అర్థం చేసుకోవడంలో అమెరికా విఫలమైందన్నారు.

మమ్మల్ని టీఎంసీ నేతలు రేప్ చేయలేదు

- ఇద్దరు సందేశ్‌ఖాలీ బాధిత మహిళల వెల్లడి

కోల్‌కతా, మే 9: తీవ్ర కలకలం రేపిన పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీ వ్యవహారం మరో మలుపు తిరిగింది. టీఎంసీ నాయకులు తమపై లైంగిక దాడికి పాల్పడ్డారని అత్తాకోడళ్లయిన ఇద్దరు మహిళలు గతంలో ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకున్నారు. జాతీయ మహిళా కమిషన్ ఆదేశాలతో తమతో బలవంతంగా తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకున్నారని, వాటితో బోగస్ ఫిర్యాదు సృష్టించారని ఆరోపించారు. ఇందులో బీజేపీకి చెందిన ఇద్దరు మహిళలు (పియాలి దాస్, మంపీ దాస్) పాత్ర ఉందని తెలిపారు. బాధితుల జాబితాలో తమ పేర్లు ఉన్నట్టు తర్వాత తెలిసిందని పేర్కొన్నారు. టీఎంసీ నాయకులు తమపై ఎలాంటి ఎలాంటి అకృత్యాలకు పాల్పడలేదని తెలిపారు. ఫిర్యాదును వెనక్కి తీసుకోవడంతో బీజేపీ నాయకులు బెదిరిస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మార్పు దిశగా ఒడిసా!

పట్నాయక్‌కు రాజకీయ పరీక్ష.. నవీన్ ఇమేజ్ బీజేడీని కాపాడేనా?.. పాతికేళ్ల వ్యతిరేకత అధిగమించేనా?

- విజయం కోసం బీజేపీ తహతహ
- లోక్‌సభ స్థానాలపై పట్టు బిగింపు
- 2019లో 8 నుంచి ఇప్పుడు 16కు ప్లాన్
- అధికారం కోసమూ పక్కా వ్యూహం
- కేడర్ లేక వెనుకబడిన కాంగ్రెస్ పార్టీ
- 13 నుంచి మూడు దశల్లో పోలింగ్



న్యూఢిల్లీ, మే 9: ఒడిసా ప్రజలు మార్పు కోరుకుంటున్నారా? పాతికేళ్ల నవీన్ పట్నాయక్ పాలనను మార్చాలని చూస్తున్నారా? ఇదే అదునుగా బీజేపీ పుంజుకుని, విజయం దక్కించుకునేందుకు తహతహలాడుతోందా? అంటే ఔననే అంటున్నారు పరిశీలకులు. అయితే, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఇమేజ్ కొంత వరకు అధికార పార్టీ బిజు జనతా దళ్(బీజేడీ)కి దన్నుగా నిలుస్తుందని.. అధికార పీఠాన్ని మరోసారి అందించే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. నవీన్ మంచితనం, పారదర్శక పాలన వంటివి ఆయనను కాపాడే అవకాశం ఉందని అంటున్నారు. అయినప్పటికీ ప్రస్తుతం జరుగుతున్న ఒడిసా అసెంబ్లీ ఎన్నికలు నవీన్ పట్నాయక్‌కు రాజకీయ పరీక్ష పెడుతున్నాయని చెబుతున్నారు. ఒడిసాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు మే 13న ప్రారంభమై జూన్ 1 వరకు మొత్తం మూడు దశల్లో జరగనున్నాయి. దీంతో ప్రధాన ప్రతిపక్షాలకు మరింత అవకాశం చిక్కినట్టయిందని పరిశీలకులు చెబుతున్నారు. ఇక, విపక్షాలు చేస్తున్న ఎన్నికల ప్రచారాలకు భారీ ఎత్తున ప్రజలు పోటెత్తుతున్నారు. ఈ నెల 6న ప్రధాని మోదీ బెర్హంపూర్, నబరంగపూర్‌లో నిర్వహించిన సభకు వేల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఒకవైపు వడగాడ్పులు, తీవ్రమైన ఎండ కొనసాగుతున్నా లెక్కచేయకుండా మోదీ సభకు హాజరుకావడం గమనార్హం. అదేవిధంగా ఏప్రిల్ 28న కేంద్రపారాలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహించిన సభకు కూడా ప్రజలు వేలాదిగా హాజరయ్యారు. 42 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా లెక్కచేయకుండా ఈ సభకు రావడం విశేషం. ఈ పరిణామాలను గమనిస్తే సుదీర్ఘ బీజేడీ పాలనను మార్చాలన్న స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్టు కనిపిస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే, సీఎం నవీన్ పట్నాయక్ ఇమేజ్ బీజేడీకి కలిసి వస్తుందని, ప్రభుత్వ వ్యతిరేకతను అడ్డుకునే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అధికార పార్టీ బీజేడీపై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తున్నా.. సీఎం నవీన్‌పై మాత్రం కాదని అంటున్నారు.

జూన్ 4తో సరి: మోదీ

ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తున్నారు. "జూన్ 4.. బీజేడీ ప్రభుత్వానికి ఎక్స్‌పెయిరీ డేట్. ఆ రోజుతో ఆ పార్టీ ప్రభుత్వం సరి" అని వ్యాఖ్యానిస్తున్నారు.

అంతేకాదు.. తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని జోస్యం చెబుతున్నారు. మరోవైపు రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అంచనా ప్రకారం ఒడిసాలోని లోక్‌సభ స్థానాల్లో బీజేపీ భారీ ఎత్తున పుంజుకుంటుందని చెబుతున్నారు.

విసిగిపోయాం: జనం

క్షేత్రస్థాయిలో జరుగుతున్న పలు సర్వేల్లో ప్రజలు బీజేడీ సర్కారుతో విసిగిపోయామని చెబుతున్నారు. ఈ దఫా తాము బీజేపీకి వేటేయాలని నిర్ణయించుకున్నామని చెబుతుండడం గమనార్హం. ఇక్కడ బీజేపీ కంటే కూడా.. ప్రధాని మోదీ ఇమేజ్ ఎక్కువగా పని చేస్తుండడం గమనార్హం. టీకొట్లు, బడ్డీ కొట్లు ఇలా జనసమర్థం ఉన్న ప్రాంతాల్లో ప్రజల అభిప్రాయం తీసుకున్నప్పుడు మెజారిటీ అభిప్రాయం బీజేడీకి వ్యతిరేకంగానే ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇక్కడి వారు.. బీజేడీకి వ్యతిరేకంగా ఓటేస్తామని చెబుతున్నారు. ముఖ్యంగా పేదలు, గిరిజనులు మార్పు కోరుకుంటున్నారు. దీంతో వీరి సంప్రదాయ ఓట్లు ఈసారి బీజేడీ నుంచి బీజేపీకి మారే అవకాశం కనిపిస్తోంది. అయితే.. కొన్ని చోట్ల మాత్రం కాంగ్రెస్ కూడా పోటీ ఇస్తుండడంతో త్రిముఖ పోరులో ఓటు ఎటు పడుతుందనేది ఆసక్తిగా మారింది. పట్టణ, నగర ప్రాంతాల్లో ఓటర్లను సోషల్ మీడియా ప్రభావితం చేస్తోంది. ఇక, రాజధాని భువనేశ్వర్ వంటి కీలక నగరాల్లో ప్రజలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. బీజేపీ అద్భుతాలు ఏమీ చేయలేదని అంటున్నా.. ఈసారి మార్పు కోరుకుంటున్నట్టు చెబుతున్నారు. ఈ పరిణామం బీజేపీకి మేలు చేసే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

పోల్ మేనేజ్‌మెంట్‌లో బీజేడీ దూకుడు

పాతికేళ్లుగా అధికారంలో ఉండడంతో బీజేడీకి క్షేత్రస్థాయిలో బలమైన కార్యకర్తలు, పార్టీని ముందుకు నడిపించే నేతలు, పోల్ మేనేజ్‌మెంట్ చేసేవారు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఇదే సమయంలో కాంగ్రెస్‌కు బలమైన కేడర్ లేకపోవడంతో ప్రభుత్వ వ్యతిరేకతను అందిపుచ్చుకోవడంలో వెనుకబడింది. బీజేపీ విషయాన్ని గమనిస్తే గత పదేళ్లుగా ఒడిసాపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కార్యకర్తలను పెంచుకోవడం, నాయకులను ప్రోత్సహించడంలో ముందుంది. ఫలితంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఒడిసాలోని 21 స్థానాలకుగాను ఏకంగా 8 చోట్ల బీజేపీ విజయం నమోదుచేసింది. కాంగ్రెస్ ఒకస్థానానికే పరిమితం కాగా అధికార బీజేడీ 12 స్థానాలు దక్కించుకుంది. ఈ పరిణామం ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీకి మరింత కలిసివస్తోందని అంటున్నారు పరిశీలకులు. గత ఎన్నికల్లో 8 చోట్ల గెలిచిన కమలనాథులు తాజా ఎన్నికల్లో ఈ సంఖ్యను రెట్టింపు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

అసెంబ్లీ సీట్లపై కూడా..

ఒడిసా అసెంబ్లీ ఎన్నికల్లోనూ పుంజుకునేందుకు బీజేపీ తీవ్రంగా శ్రమిస్తోంది. 2019 ఎన్నికల్లో నవీన్ నేతృత్వంలోని అధికార పార్టీ బీజేడీ 147 స్థానాలకు గాను 112 చోట్ల విజయం దక్కించుకుంది. ఇక, బీజేపీ 2014లో గెలుచుకున్న 13 స్థానాలను కాపాడుకుంటూ మరో 10 స్థానాల్లో పుంజుకుంది. మొత్తంగా 23 చోట్ల విజయం దక్కించుకున్న ప్రధాన ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీ కేవలం 9 స్థానాలకే పరిమితమైంది. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండడం గమనార్హం.

చౌతాలా పార్టీలో చీలిక!

- హరియాణా సంక్షోభంలో మరో మలుపు
- మాజీ సీఎం ఖట్టర్‌తో నలుగురు జేజేపీ ఎమ్మెల్యేల భేటీ
- విశ్వాసపరీక్షకు ఆదేశించాలని గవర్నర్‌కు దుష్యంత్ చౌతాలా లేఖ



న్యూఢిల్లీ, మే 9 (ఆంధ్రజ్యోతి): హరియాణాలో రాజకీయ సంక్షోభం కొత్త మలుపులు తీసుకుంటోంది. కాంగ్రెస్‌తో కలిసి బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని భావిస్తున్న జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) చీలిక ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఆ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేల్లో నలుగురు గురువారం బీజేపీ నేత, రాష్ట్ర మాజీ సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ విలేకర్లతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని, మార్చిలో జరిగిన విశ్వాస పరీక్షలో విజయం సాధించామని, అవసరమైతే మరోసారి విశ్వాసపరీక్షకు సిద్ధమని స్పష్టం చేశారు. మరోవైపు, దుష్యంత్ చౌతాలా గురువారం రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయకు లేఖ రాశారు. బీజేపీ ప్రభుత్వం మైనారిటీలో పడినందున శాసనసభలో మెజారిటీ నిరూపించుకోవల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కూడా గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరింది. రాష్ట్రంలో పరిస్థితులను వివరించటానికి శుక్రవారం తమకు సమయం ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. హరియాణాలో రాష్ట్రపతి పాలన విధించి తాజాగా అసెంబ్లీ ఎన్నికలు జరిపించాలని కాంగ్రెస్ ఇప్పటికే డిమాండ్ చేసింది.

అసెంబ్లీలో బలాబలాలు

ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకోవడంతో హరియాణలో సీఎం నాయబ్‌సింగ్ సైనీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీలో పడిన విషయం తెలిసిందే. 90 సీట్లు ఉండే హరియాణా అసెంబ్లీలో రెండు సీట్లు ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం 88 మంది సభ్యులు ఉన్నారు. మెజారిటీకి 45 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా బీజేపీకి శాసనసభలో 40 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. 10 మంది సభ్యులు ఉన్న జేజేపీ తొలుత బీజేపీకి మద్దతు ఇచ్చినప్పటికీ మార్చిలో ఉపసంహరించుకుంది. కాంగ్రెస్‌కు 30 మంది ఎమ్మెల్యేలున్నారు. ఐఎన్ఎల్‌డీ, హరియాణా లోకహిత్ పార్టీలకు చెరో ఎమ్మెల్యే ఉన్నారు. ఆరుగురు ఇండిపెండెంట్లు. కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే మరో 15 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. అక్టోబరులో హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది.

బాణాసంచా కర్మాగారంలో భారీ విస్ఫోటం


- 8 మంది దుర్మరణం.. 14 మందికి తీవ్ర గాయాలు
- ఐదుగురి పరిస్థితి విషమం.. శివకాశిలో ఘటన

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని విరుదునగర్ జిల్లా శివకాశి సమీపంలోని ఓ బాణసంచా కర్మాగారంలో భారీ విస్ఫోటం సంభవించింది. హఠాత్తుగా సంభవించిన పేలుడు కారణంగా ఐదుగురు మహిళలు సహా 8మంది దుర్మరణం చెందారు. మరో 14 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల్లోనూ మహిళలే అధికంగా ఉన్నారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. తిరుత్తంగల్ స్టాండర్డ్ కాలనీకి చెందిన శరవణన్ (55) సెంగమలపట్టిలో 'సుదర్శన్ ఫైర్ వర్క్స్' పేరుతో బాణాసంచా తయారీ కర్మాగారం నిర్వహిస్తున్నాడు. కర్మాగారంలో 20 గదులుండగా.. 80 మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. కర్మాగారంలోని ఓ గదిలో గురువారం మధ్యాహ్నం 2గంటల సమయంలో హఠాత్తుగా పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి మిగిలిన గదుల్లోని బాణసంచా కూడా పేలిపోయింది. ఈ ప్రమాదంలో మొత్తం 7గదులు కుప్పకూలగా, ఆ గదుల్లో పని చేస్తున్న కార్మికుల శరీరాలు ఛిద్రమయ్యాయి. కనీసం గుర్తు పట్టేందుకు కూడా వీలు లేకుండా శరీరాలు తునాతునకలయ్యాయి. మరికొందరి శరీరమంతా కాలుతుండగా కొన ప్రాణాలతో బయటపడగలిగారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకునేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నలుగురు మహిళలు సహా మొత్తం ఆరుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, తీవ్రంగా గాయపడిన 16 మందిని శివకాశి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహిళ సహా ఇద్దరు మరణించారు. మృతులను చెన్నైకి చెందిన రమేశ్, సిలోన్ కాలనీకి చెందిన ముత్తు, మురుగన్ కాలనీకి చెందిన భాగ్యం (55), పారైపట్టికి చెందిన అవుడయమ్మాళ్ (80), శివకాశి నెహ్రూజీ నగర్‌కు చెందిన మారియమ్మాళ్ (50), మేల్ చిన్నయాపురానికి చెందిన విజయకుమార్ (28), చొక్కలింగపురానికి చెందిన కాళీశ్వరన్, శివకాశి సిలోన్ కాలనీకి చెందిన లక్ష్మి (40)గా పోలీసులు గుర్తించారు. కర్మాగారం యజమాని, మేనేజర్‌పై కేసు నమోదు చేసి వారి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

భూమి ఇస్తారా? చస్తారా?

నియోమ్ నగర నిర్మాణం కోసం సౌదీ క్రూరత్వం.. భూసేకరణకు అడ్డుపడితే చంపేయాలని ఆదేశం

- ఒకరి కాల్చివేత, 47 మందిపై ఉగ్రకేసులు, ఐదుగురికి మరణశిక్ష
- 500 బిలియన్ డాలర్ల వ్యయంతో స్మార్ట్ సిటీ నిర్మాణం
- 3 గ్రామాలు ఖాళీ, 6వేల మంది తరలింపు



న్యూఢిల్లీ, మే 9: భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వాలు ఏమైనా ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే ప్రజల నుంచి భూమిని సేకరించడం, బాధితులకు పరిహారం ఇవ్వడం, పునరావాసం కల్పించడం సహజంగా జరిగేవి. కానీ ఈ విషయంలో సౌదీ అరేబియా పాలకుల పద్ధతే వేరు. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ మానసపుత్రిక.. కలల నగరం 'నియోమ్' నిర్మాణం విషయంలో అక్కడి పాలకులు అత్యంత క్రూరంగా వ్యవహరిస్తున్నారు. మహానగర నిర్మాణానికి ఎవరైనా అడ్డుపడినా, భూమిచ్చేందుకు నిరాకరించిన వారి ప్రాణాలు తీయాలని అక్కడి అధికారులను ఆదేశించారని తెలిసింది. ఈ ఆదేశాల ప్రకారం దళాలు ఓ వ్యక్తిని కాల్చిచంపారు. సౌదీ అత్యంత ప్రాధాన్యమిస్తున్న ఈ నియోమ్ ప్రాజె క్టు వెనక జరుగుతున్న దారుణాలను ఆ దేశ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి, కల్నల్ రబీహ్ ఎలెన్జీ బయటపెట్టారు. ప్రాణభయంతో సౌదీ నుంచి పారిపోయి ప్రస్తుతం యూకేలో ఆశ్రయం పొందుతున్న రబీహ్.. నియోమ్‌లో చీకటి కోణాన్ని ప్రముఖ వార్తాసంస్థ బీబీసీకి వెల్లడించారు. భూసేకరణకు నిరాకరించిన వారిని చంపేయాలని తనకు ఆదేశాలు అందాయని రబీహ్ పేర్కొన్నారు.

ఏమిటీ నియోమ్ ?

దేశంలో చమురు నిల్వలు తగ్గిపోతుండడం, ప్రపంచమంతా గ్రీన్ ఎనర్జీ (పునరుత్పాదక ఇంధన వనరులు)వైపు చూస్తుండడంతో సౌదీ అరేబియా ప్రత్యామ్నాయ ఆదాయ వనరుల సృష్టిపై దృష్టిపెట్టింది. భవిష్యత్తులో తమ దేశ ఆదాయానికి ఇబ్బందిలేకుండా ఉండేందుకు పాలకులు నియోమ్ నగరాన్ని తెరమీదకు తెచ్చారు. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఈ నియోమ్ స్మార్ట్ సిటీని పర్యాటక కేంద్రం, గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రణాళికలు చేశారు. 500 బిలియన్ డాలర్ల బడ్జెట్‌తో ఎర్రసముద్రం తీరంలో 26,500 చదరపు కిలోమీటర్ల పరిధిలో 10 రీజియన్లుగా నియోమ్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ మెగాసిటీ న్యూయార్క్ కంటే 33రెట్లు పెద్దది. నియోమ్‌లో ఫ్లోటింగ్ పోర్టు, స్కైరిసార్టులు, మిర్రర్ సిటీ వంటివి ఉన్నాయి. 'ది లైన్' పేరిట చేపట్టిన నిర్మాణం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైనది. 100మీటర్ల ఎత్తులో 200మీటర్ల వెడల్పుతో 170కిలోమీటర్ల పొడవున్న నిర్మించనున్న ది లైన్‌ను కార్ ఫ్రీ(కార్లు లేని ప్రాంతం) సిటీగాతీర్చిదిద్దుతున్నారు. దిలైన్‌లో త్రీడీ కమ్యూనికేషన్ వ్యవస్థలు, కృత్రిమ మేధ సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రజలు 5 నిమిషాలు నడిస్తే నిత్యావసరాలు దొరుకుతాయి. దీని నిర్మాణంలో అద్దాల వినియోగం అధికంగా ఉం డనుంది. దిలైన్ కోసం పలు ప్రముఖ అంతర్జాతీయ నిర్మాణ రంగ సంస్థలు పని చేస్తుండగా 2030నాటికి 2.4 కిలోమీటర్ల నిర్మాణమే పూర్తవుతుందని అంచనా. ఇక, 2022లో వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం నియోమ్ ప్రాజెక్టులో భాగంగా ఫుట్‌బాల్ మైదానాల కంటే పెద్దవిగా ఉండే 10ప్యాలెస్‌లు నిర్మించాలని సౌదీ యువరాజు ఆదేశించారు. ఇక ది లైన్ నిర్మాణం కోసం భారీగా భూసేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా హువైటీ అనే తెగ ప్రజలు నివాసముండే 3 గ్రామాలను సౌదీ బలగాలు 2020లో ఖాళీ చేయించాయి. అప్పుడు భూసేకరణకు అడ్డుకున్న వారిని కాల్చిచంపాలని కల్నల్ రబీహ్‌కు ఆదేశాలు అందాయి. ఈ క్రమంలో తన భూమిలోకి అధికారులు రాకుండా అడ్డుపడిన అబ్దుల్ రహీమ్ అల్ హువైటీని బలగాలు కాల్చిచంపాయి. ఈ హత్యకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టిన గ్రామస్థుల్లో 49మందిని ఉగ్రనేరాల కింద అరెస్టు చేశారు. వారిలో ఐదుగురికి మరణశిక్ష విధించారు. వారి అంత్యక్రియ ల్లో పాల్గొన్న వారిపైనా కేసులు పెట్టారు. ప్రభు త్వ గణాంకాల ప్రకారం నియోమ్ ప్రాజెక్టు కోసం 6000మందిని ఇతర ప్రాంతాలకు తరలించారు. యూకే కేంద్రంగా పనిచేసే ఓ మానవ హక్కుల సంస్థ అంచనా ప్రకారం ఆసంఖ్య చా లా ఎక్కువుంటుంది. నగర నిర్మాణం పూర్తయ్యే లోపు సౌదీ ఇంకెన్నిఆగడాలకు పాల్పడుతుందో!!

ఓటేసిన బాలుడు!

మైనర్ కొడుకుతో తన ఓటును వేయించిన మధ్యప్రదేశ్ బీజేపీ నేత

న్యూఢిల్లీ, మే 9: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని బెరాసియాలో ఓ బాలుడు ఓటేసిన తాలుకు వీడియో సోషల్ మీడియాలో తాజాగా వైరల్‌గా మారింది. ఆ బాలుడు స్థానిక బీజేపీ నేత వినయ్ మెహర్ కుమారుడని గుర్తించారు. మంగళవారం వినయ్ మెహర్ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు కుమారుడితో కలసి పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఆయన తనకు బదులుగా కుమారుడితో ఈవీఎంపై బీజేపీకి ఓటు వేయించారు. ఈ తతంగాన్నంతా తన ఫోన్‌లో రికార్డు చేశారు. అనంతరం 14 సెకన్ల నిడివి గల ఈ వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్టు చేయగా వైరల్‌గా మారింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం కమల్‌నాథ్ కూడా ఈ ఘటనపై స్పందించారు. 'బీజేపీ.. ఎన్నికల కమిషన్‌ను పిల్లల ఆట వస్తువుగా మార్చేసింది. బీజేపీ నేత వినయ్ మెహర్ తన ఓటును కుమారుడితో వేయించారు. దీన్ని ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలోనూ పెట్టారు. అసలు పిల్లలను, మొబైల్‌ను పోలింగ్ బూత్‌లోకి ఎలా అనుమతించారు? దీనిపై ఏమైనా చర్యలుంటాయా?' అని ట్విటర్‌లో ప్రశ్నించారు. అయితే ఈ వీడియోపై ఇంకా ఎన్నికల సంఘం స్పందించలేదు. ఇటు జిల్లా కలెక్టర్ కౌశలేంద్ర విక్రమ్ సింగ్ ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. ఈనేపథ్యంలోనే ప్రిసైడింగ్ అధికారి సందీప్ సైనీని సస్పెండ్ చేయడంతో పాటు బీజేపీ నేత వినయ్ మెహర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో 25 మంది తొలగింపు

- మూకుమ్మడి సెలవుల ఫలితం
- మిగతా వారికి అల్టిమేటం జారీ
- సాయంత్రానికి సమ్మె విరమణ
- ఉద్యోగుల తొలగింపు నిర్ణయం వెనక్కి

న్యూఢిల్లీ, మే9: మూకుమ్మడి సెలవులు పెట్టిన సిబ్బందిపై ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ క్రమశిక్షణ చర్యలు ప్రారంభించింది. సాయంత్రానికి ఉద్యోగులు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. బుధవారం సుమారు 300మంది ఒక్కసారిగా సిక్‌లీవ్‌లు పెట్టడంతో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 90 విమానాలు రద్దయ్యాయి. ఇలా సెలవులు పెట్టిన వారిలో 25 మందిని గురువారం ఉదయం విధుల్లోంచి తొలగించింది. మిగతా వారికి "4గంటల్లోగా విధుల్లో చేరకుంటే తీవ్ర పరిణామాలుంటాయి" అంటూ అల్టిమేటం జారీ చేసింది. "మీ చర్య ఉద్దేశపూర్వకమేనని స్పష్టమవుతోంది. మీ చర్య వల్ల వేల మంది ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. భారీ ఆర్థికనష్టం వాటిల్లింది" అంటూ ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్స్‌లోస్పష్టంచేసింది. గురువారం 20రూట్లలో రెగ్యులర్ సర్వీసులు పునరుద్ధరించామని, 283విమానాలు నడిపామని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తెలిపింది. అయితే రెండో రోజూ 85 విమానాలు రద్దుకావడం గమనార్హం.! కాగా తొలగించిన ఉద్యోగుల తరఫున సంస్థ యాజమాన్యంతో మాట్లాడడానికి మధ్యవర్తిత్వం జరుపుతామని ఆ సంస్థ ఉద్యోగుల సంఘం ఏఐఎక్స్ఈయూ పేర్కొంది. ఎయిరిండియా మాత్రం తామెలాంటి సంఘాన్ని గుర్తించడంలేదని తేల్చిచెప్పింది. దీంతో ఢిల్లీలోని రీజినల్ లేబర్ కమిషనర్ అశోక్ పెరుమల్ల రంగంలోకి దిగారని, ఉద్యోగులపట్ల ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తీరును ఆయన తప్పుబడుతూ ఓ ఈ-మెయిల్ పంపినట్లు సమాచారం. ఉ ద్యోగుల సమస్యలను గుర్తించేందుకు ఒక ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారని, సంస్థ హెచ్‌ఆర్ అధికారులతో మాట్లాడాక విపక్ష, ప్యాకేజీల్లో తేడాలు నిజమేనని తేలినట్లు పెరుమల్ల పేర్కొన్నట్లు ఎన్డీటీవీ కథనం స్పష్టంచేస్తోంది. లేబర్ కమిషనర్ సీరియస్ అవుతుండడంతో సమ్మెను విరమిస్తున్నట్లు ఉద్యోగులు ప్రకటించగా.. తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటున్నట్లు సంస్థ హామీ ఇచ్చింది.

కేజ్రీవాల్ బెయిల్‌కు ఇస్తే తప్పుడు సంకేతాలు

- పిటిషన్‌ను వ్యతిరేకించిన ఈడీ

న్యూఢిల్లీ, మే 9(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చేసిన వినతిని ఈడీ వ్యతిరేకించింది. ఎన్నికలలో ప్రచారం చేయడమనేది ప్రాథమిక హక్కు ఏమీ కాదని, చట్టపరమైన, రాజ్యాంగపరమైన హక్కు కూడా కాదని తెలిపింది. ఈ మేరకు గురువారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. చట్టాలు అందరికీ సమానమేనని, ఎన్నికలలో ప్రచారం కోసం ఇప్పటివరకూ ఏ రాజకీయ నాయకుడికీ బెయిల్ మంజూరు చేయలేదని తెలిపింది. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇస్తే జైలులో ఉన్న రాజకీయ నాయకులందరూ ప్రచారం కోసం బెయిల్‌ను హక్కుగా కోరుకుంటారని వాదించింది. ఇది తప్పుడు సంకేతాలను పంపినట్లవుతుందని తెలిపింది. బెయిల్ పిటిషన్ శుక్రవారం విచారణకు రానున్న నేపథ్యంలో ఈడీ తన వైఖరిని వివరిస్తూ అఫిడవిట్ సమర్పించింది.

లోకం తీరు





11 నుంచి 13 వరకు మద్యం షాపుల బంద్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈనెల 13న పోలింగ్ జరగనున్నందున రాష్ట్ర వ్యాప్తంగా మద్యం విక్రయాలపై ఈసీ నిషేధం విధించింది. ఈనెల 11వ తేదీ సాయంత్రం 5గంటల నుంచి 13న సాయంత్రం 6 గంటల వరకు రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపులను మూసివేయాలని ఎన్నికల సంఘం గురువారం ఆదేశాలు జారీచేసింది. అదేవిధంగా జూన్4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్న సందర్భంగా ఆరోజు కూడా మద్యం దుకాణాలను మూసి ఉంచాలని ఈసీ పేర్కొంది. అంతేకాకుండా ఈసీ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారం గడువు ముగిసిన తర్వాత సభలు, ర్యాలీలు, సమావేశాలపై నిషేధం విధించింది.

దుబాయ్‌లో కాంగ్రెస్ ప్రచార జోరు

- 'గల్ఫ్ పాలసీ' ప్రభావం చూపుతుందని ఆశాభావం

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

తెలంగాణలో లోక్‌సభ పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ దుబాయ్‌లో కాంగ్రెస్ తరఫున నేతలు ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు. నగరంలోని వివిధ కార్మిక క్యాంప్‌లలో లోక్‌సభ అభ్యర్థులకు మద్దతుగా కాంగ్రెస్ ఎన్నారై సెల్ యూఏఈ అధ్యక్షుడు ఎస్వీ రెడ్డి ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా ప్రచారం చేస్తున్నారు. బర్ దుబాయ్, అల్ ఖోసెస్‌లతో పాటు సోనాపూర్, జబల్ అలీలోని లేబర్ క్యాంప్‌లలో ఉంటున్న వేలాది మంది తెలంగాణ ప్రవాసీలను కాంగ్రెస్ కార్యకర్తలు కలుస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని స్వదేశంలోని కుటుంబ సభ్యులకు సూచించాలని కోరుతున్నారు. దుబాయ్, షార్జాతో పాటు ఇతర ఎమిరేట్లలోనూ ప్రచారాన్ని ముమ్మరం చేశామని ఎస్వీ రెడ్డి తెలిపారు. ప్రవాసీల సమగ్ర సంక్షేమం కోసం గల్ఫ్ పాలసీని రూపొందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన గల్ఫ్‌లోని తెలంగాణ ప్రవాసీలలో గణనీయమైన ప్రభావం చూపిస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ

- దీపాదాస్‌మున్షీ, మంత్రి ఉత్తమ్ సమక్షంలో చేరిక


శంకరమ్మను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న దీపాదాస్ మున్షీ, మంత్రి ఉత్తమ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)/హుజూర్‌నగర్, మోత్కూరు, మే 9: తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆమెతోపాటు పలువురు బీఆర్ఎస్ నేతలూ పార్టీలో చేరగా..వారికి దీపాదాస్ మున్షీ, ఉత్తమ్‌లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీరా ఆత్మారాం నాయక్ గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 2018, 2023 ఎన్నికల్లో ఆసిఫాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆయన పోటీ చేశారు. ఆయనతోపాటు జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులూ కాంగ్రెస్‌లో చేరారు.

కారు బోల్తా... కాంగ్రెస్ మహిళా నేత మృతి

మహాముత్తారం మే 9: కారుబోల్తా పడి భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు జాడి కీర్తిబాయి (42) మృతి చెందారు. ఆమె భర్త, జిల్లా కార్యదర్శి జాడి రాజయ్య తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మహాముత్తారం మండలం యామన్‌పల్లి-నిమ్మలగూడెం గ్రామాల మధ్య గురువారం జరిగింది. మహాముత్తారం మండలం స్తంభంపల్లి (పీపీ) గ్రామానికి చెందిన జాడి రాజయ్య, కీర్తిబాయి దంపతులు 20 ఏళ్లుగా కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా మహాముత్తారం మండలం బోర్లగూడెంలో ప్రచారం నిర్వహించడానికి కారులో బయల్దేరారు. కారును రాజయ్య నడుపుతుండగా కీర్తిబాయి పక్కన కూర్చున్నారు. ఈ క్రమంలో వీరి కారు అదుపు తప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కనున్న చిన్నపాటి లోయలో పడింది. దీంతో కీర్తిబాయి అక్కడికక్కడే మృతి చెందారు. రాజయ్య తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కీర్తిబాయి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

కోడ్ ఉల్లంఘించిన మోదీపై చర్యలు తీసుకోండి

- సీఈసీ రాజీవ్‌కుమార్‌కు కాంగ్రెస్ నేత జి.నిరంజన్ ఫిర్యాదు

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ.. ఓ చిన్న పిల్లాడిని ఎత్తుకొని ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేశారని ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించమేనని సీఈసీ రాజీవ్‌కుమార్‌కు ఏఐసీసీ సభ్యుడు జి.నిరంజన్ ఫిర్యాదు చేశారు. కోడ్ ఉల్లంఘించిన మోదీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సీఈసీకి ఆన్‌లైన్ ద్వారా గురువారం ఫిర్యాదు చేశారు. వరంగల్ ప్రచారంలో లక్ష్మీపురం వద్ద ఓ చిన్న పిల్లవాడిని ఎత్తుకోవడం.. మీడియా ద్వారా ప్రజలను ఆకర్షించే ప్రయత్నమేనని దీనిపై సీఈసీ తక్షణం స్పందించాలని, తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఆయా పార్టీలు, ప్రతినిధులు ఎన్నికల ప్రచారం, ర్యాలీల్లో చిన్నపిల్లలకు సంబంధించి ఎటువంటి కార్యక్రమాలు ఉండకూడదని ఈసీ వెల్లడించిందని పేర్కొన్నారు.

వెంకట్రామిరెడ్డి డబ్బు, మద్యం పంచుతున్నారు

- సీఈవో వికాస్‌రాజ్‌కు బీజేపీ నేత ఫిర్యాదు

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): మెదక్ లోక్‌సభ స్థానం నుంచి పోటీలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ప్రజలకు డబ్బులు, మద్యం, చీరలు పంచుతున్నారని సీఈవో వికాస్‌రాజ్‌కు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం సీఈవో కార్యాలయానికి వచ్చి ఆయన వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి సంబంధించిన జేపీ బ్రదర్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్స్, రాజ్‌పుష్ప కన్‌స్ట్రక్షన్స్, ఆయన బంధువులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్థానిక అధికారులు దృష్టి పెట్టడం లేదని, దీనిపై తక్షణం స్పందించి ఓటర్లను ప్రలోభపెట్టే పనులకు అడ్డుకట్ట వేయాలని వికాస్‌రాజ్‌ను బీజేపీ నేత కోరారు.

మోదీ పరివారంలో అంతా నేరస్థులే..

- కాంగ్రెస్‌తోనే మహిళలకు రక్షణ: అల్కా లాంబ

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పరివారంలో అంతా నేరస్థులు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన వారే ఉన్నారంటూ మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ ఆరోపించారు. ఆయన పరివారంలో మహిళలపై బలాత్కారానికి పాల్పడ్డ ప్రజ్వల్ రేవణ్ణ, మహిళా క్రీడాకారులను వేధింపులకు గురి చేసిన బ్రిజ్ భూషణ్ తదితరులే ఉన్నారన్నారు. ప్రజ్వల్ రేవణ్ణ కోసం మోదీ స్వయంగా ప్రచారం చేయడం దుర్మార్గమని విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'మోదీ కా పరివార్.. బలాత్కార్ జనతా పార్టీ' పేరుతో ప్రజ్వల్ రేవణ్ణ, బ్రిజ్ భూషణ్ తదితరుల ఫొటోలతో కూడిన పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలను వంటింటికే పరిమితం చేసే ప్రయత్నం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు చేస్తున్నాయి. రాజ్యాంగాన్నే మార్చేసి రిజర్వేషన్లను ఎత్తేయాలన్న కుట్ర జరుగుతోంది. మహిళలకు రక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం' అని కోరారు.

'పట్టభద్రుల ఎమ్మెల్సీ'కి 84 నామినేషన్లు

నల్లగొండ టౌన్/నల్లగొండ, మే 9: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఈనెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మొత్తం 84 మంది అభ్యర్థులు 117 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్‌కుమార్), బీఆర్ఎస్ అభ్యర్థిగా రాకేశ్ రెడ్డి, బీజేపీ తరఫున గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి నామినేషన్ వేశారు. చివరిరోజు ఏకంగా 40 మంది అభ్యర్థులు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి నామినేషన్ పత్రాలను అందజేశారు. శుక్రవారం నామినేషన్లను పరిశీలించనుండగా, ఉపసంహరణకు గడువు ఈనెల 13వ తేదీతో ముగియనుంది.

రాజ్యాంగాన్ని మార్చడం.. దేశం ఆత్మపై దాడే

(మొదటిపేజీ తరువాయి)



సరూర్‌నగర్ జన జాతర సభలో రేవంత్ మాట్లాడుతుండగా ఫోన్‌లో ఫొటో తీస్తున్న రాహుల్; సభకు హాజరైన జనం

వృథా చేయాలన్నదే బీజేపీ ఆలోచన. ఇక్కడి నుంచి నేను వారికి స్పష్టం చేయదలచుకున్నా. ప్రపంచంలోని ఏ శక్తి కూడా రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను మార్చలేదు. ప్రజల తరఫున మేమందరం ముందుండి రాజ్యాంగాన్ని రక్షిస్తాం" అని పేర్కొన్నారు. రిజర్వేషన్లు ఉంచాలా? తొలగించాలా? అనే అంశంపైనే ఇప్పుడు యుద్ధం జరుగుతోందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 50శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. కేంద్రంలో జూన్ 4న ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, పంద్రాగస్టులోగా కేంద్రంలో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు.

ఎవరేమన్నా పేదల పక్షానే ఉంటాం

గత పదేళ్లలో 22 మంది బడా పారిశ్రామికవేత్తల కోసమే మోదీ పని చేశారని, వారికి సంబంధించిన రూ.16లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఈ నిధులతో దేశవ్యాప్తంగా 24ఏళ్ల పాటు ఉపాధి హామీ పథకాన్ని నిర్విఘ్నంగా కొనసాగించవచ్చని చెప్పారు. ఇక, తాము అధికారం చేపట్టగానే రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామన్నారు. వరితోపాటు అన్ని పంటలకు చట్ట పరిధిలో కనీస మద్దతు ధర ఇప్పించి తీరుతామని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం కార్మికులకు ఇస్తున్న కూలిని రూ.250 నుంచి రూ.400కు పెంచుతామని భరోసా ఇచ్చారు. ఆశా, అంగన్‌వాడీలకు రెట్టింపు వేతనం అందజేస్తామని ప్రకటించారు. మోదీ హయాంలో కోటీశ్వరులకు దోచిపెట్టిన సొమ్మును పేదల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. "తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న పేదల కుటుంబాల జాబితా సిద్ధం చేస్తాం. పేద కుటుంబంలోని ఒక మహిళను ఎంపిక చేసి, ఆమె బ్యాంకు ఖాతాలో నెలకు రూ.8500 చొప్పున ఏటా రూ.లక్ష వేస్తాం. ఈ పథకంతో దేశంలోని ప్రతి పేద కుటుంబం జీవనమే మారిపోతుంది. మోదీ ప్రభుత్వం కోటీశ్వరులను మరింత ధనవంతులుగా చేస్తే.. మేము పేదలను లక్షాధికారులను చేస్తాం" అని పేర్కొన్నారు. మేము ఇలాంటి హామీలు ఇస్తుండటంతో మీడియా సైతం తమకు వ్యతిరేకంగా మాట్లాడుతోందని రాహుల్ ఆరోపించారు. బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తే స్పందించని వాళ్లు.. తాము పేదలకు మంచి చేస్తామంటే మాత్రం ప్రశ్నలు వేస్తున్నారని మండిపడ్డారు. అంబానీ, అదానీలకు మద్దతు పలికే మీడియా ఏం రాసుకున్నా పర్వా లేదని, తాము మాత్రం పేదల పక్షాన నిలుస్తామని స్పష్టం చేశారు. పేదల బ్యాంకు ఖాతాల్లో కోట్ల రూపాయలు జమ చేయబోతున్నామని పేర్కొన్నారు.

పట్టభద్రులకు అప్రెంటిస్‌షిప్..

మోదీ పాలనలో నిరుద్యోగుల సంఖ్య భారీగా పెరిగిందని రాహుల్‌గాంధీ విమర్శించారు. నోట్ల రద్దు, జీఎస్టీతోపాటు అగ్నివీర్ వంటి పథకాలతో దేశంలోని కోట్లాది మంది యువతను నిరుద్యోగులుగా మార్చారని ధ్వజమెత్తారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తాము అప్రెంటిస్‌షిప్ హక్కు పేరిట కొత్త చట్టం తేబోతున్నామని తెలిపారు. పట్టభద్రులైన ధనిక కుటుంబాల పిల్లలకు మాత్రమే ఇప్పుడు అప్రెంటిస్‌షిప్ చేసే అవకాశం ఉందని, తాము దేశంలోని ప్రతీ పట్టభద్రుడికి అప్రెంటిస్‌షిప్ హక్కు ఇవ్వబోతున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు, పాఠశాలలు, ఆస్పత్రులు, కంపెనీల్లో యువతకు అప్రెంటిస్‌షిప్ అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఏడాది పాటు కచ్చితంగా వారికి ఉపాధి ఉంటుందని, ఈ కాలంలో నెలకు రూ.8500చొప్పున రూ.లక్ష అందిస్తామని వివరించారు. తెలంగాణలో ఇప్పటికే చేపట్టిన కులగణనను దేశవ్యాప్తంగా అమలు చేస్తామని ప్రకటించారు. దీంతో దేశంలోని పేదలు, దళితులు, బీసీలు, ఆదివాసీలు, మైనారిటీలకు వారి భాగస్వామ్యం గురించి తెలుస్తుందని, తద్వారా దేశ రాజకీయాలు మారిపోతాయని పేర్కొన్నారు. దేశ సంపదంతా ఇప్పుడు 2శాతం మంది చేతుల్లోనే ఉందని, కులగణన తర్వాత అది మారుతుందని తెలిపారు.

రేవంత్ బృందం.. బాగా పని చేస్తోంది

"తెలంగాణలో రేవంత్ రెడ్డి బృందం ఇక్కడ చాలా బాగా పనిచేస్తోంది. ఇప్పటికే 20వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.10లక్షల ఆరోగ్య బీమా, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు అందిస్తుంది" అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. గత ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, పంద్రాగస్టులోగా రైతులకు చెందిన రూ.2లక్షల రుణాలను మాఫీ చేయనున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి లోక్‌సభకు పంపాలని సూచించారు.

సభలు విజయవంతం.. శ్రేణుల్లో జోష్

హైదరాబాద్ సిటీ: సరూర్‌నగర్ జనజాతర సభ అనంతరం సిటీ బస్సులో రాహుల్, రేవంత్‌రెడ్డి ప్రయాణించారు. దిల్‌సుఖ్‌నగర్ వద్ద వారిద్దరూ ఆర్టీసీ బస్సు ఎక్కి మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు కాంగ్రెస్ పాంచ్‌న్యాయ్ కరపత్రాలను రాహుల్ అందించారు. కాగా, నర్సాపూర్, సరూర్‌నగర్ సభలు విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. సాయంత్రం వేళ నిర్వహించిన సభలకు పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా తరలివచ్చారు. రాహుల్ గాంధీ, రేవంత్ వేదికపైకి చేరుకోగానే.. పీఎం, సీఎం అంటూ ప్రజలు నినాదాలు చేశారు. సరూర్‌నగర్ సభలో రేవంత్ మాట్లాడుతుండగా రాహుల్‌గాంధీ ఫొటో తీయడం.. ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పట్టు వదలని ఢిల్లీ పోలీసులు!

- అమిత్ షా ఫేక్ వీడియో వ్యవహారంలో మధ్యంతర ఉత్తర్వులు ఎత్తేయాలని పిటిషన్
- లంచ్‌మోషన్‌కు నిరాకరించిన హైకోర్టు
- దిగువ కోర్టులో పీటీ వారెంట్ వేసుకోవచ్చని వ్యాఖ్య

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరించి, వీడియో వైరల్ చేశారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు... నిందితుల అరెస్టుపై పట్టు వదలడం లేదు. ఈ కేసు విషయమై గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను విచారించేందుకు హైకోర్టు అనుమతి నిరాకరించింది. కింది కోర్టులో పీటీ వారెంట్ వేసుకోవాలని సూచించింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేయగా, టీపీసీసీ సోషల్ మీడియా కార్యకర్త మన్నె సతీశ్‌సహా పలువురికి బెయిల్ వచ్చింది. అయితే, ఢిల్లీ పోలీసులు సైతం తమను అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని, ఒకే రకమైన ఆరోపణలతో నమోదైన కేసులో ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకోకుండా అడ్డుకోవాలని నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కఠిన చర్యలు తీసుకోవద్దని జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం 3న ఆదేశాలు జారీ చేసింది. సదరు ఆదేశాలను ఎత్తేయాలని, నిందితులను అదుపులోకి తీసుకునేలా అనుమతి ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు తాజాగా గురువారం హైకోర్టు వెకేషన్ బెంచ్ ఎదుట లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను అత్యవసరంగా వినాల్సిన అవసరం లేదంటూ జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి అనుమతి నిరాకరించారు. ఢిల్లీ పోలీసుల ముందు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించేందుకు వీలుగా దిగువ కోర్టును ఆశ్రయించి.. పీటీ వారెంట్ దాఖలు చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. మరోవైపు.. టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శులను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీచేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై వెకేషన్ కోర్టు జడ్జి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ వ్యవహారంలో ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, మళ్లీ కార్యకర్తల తరఫున రాజకీయ పార్టీ పిటిషన్ వేయడమేంటని ప్రశ్నించారు. ఎవరి స్వేచ్ఛకు భంగం కలిగితే వారే కోర్టుకు రావాలి తప్పితే పార్టీలు రావడం ఏంటని అడిగారు. ఇప్పటికే ఆదేశాలు అమలులో ఉన్నందున పిటిషన్‌ను ముగిస్తామని పేర్కొన్నారు. పిటిషనర్ నుంచి మరిన్ని సూచనలు తీసుకుంటామని సీనియర్ న్యాయవాది రవీందర్‌రెడ్డి విజ్ఞప్తి చేయడంతో విచారణను జూన్‌కు వాయిదా వేశారు.

విశ్వనగరంపై బీజేపీ విషం

- హైదరాబాద్‌లో మత చిచ్చుకు కుట్రలు
- అల్లర్లు చెలరేగితే పెట్టుబడులు రావు
- బీజేపీ పుట్టకముందే మనోళ్లు శ్రీరామనవమి జరపలేదా?
- నవనీత్‌కౌర్‌పై చర్యలు తీసుకోవాలి
- జనజాతర సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, సంగారెడ్డి, మే 9 (ఆంధ్రజ్యోతి): విశ్వనగరం హైదరాబాద్‌పై బీజేపీ వాళ్లు విషం చిమ్ముతున్నారని.. మతాల మధ్య చిచ్చు పెట్టి, ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది తప్ప బీజేపీకి వేరే ఆలోచనే లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. బీజేపీ వాళ్లు అనుకున్నట్లు హైదరాబాద్ నగరంలో మతపిచ్చి, మతకల్లోలాలు చెలరేగి శాంతి భద్రతలు దెబ్బతింటే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తయా? ఉపాధి అవకాశాలు ఉంటయా? అని ప్రశ్నించారు. బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ బిడ్డపైనా ఉందన్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం.. హైదరాబాద్ నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు వంటి మౌలిక సదుపాయాలను తీసుకొచ్చిందని, కృష్ణా, గోదావరి జలాలను తరలించిందని, రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడిందని సీఎం గుర్తు చేశారు. కాబట్టే తెలంగాణకు వేల కోట్ల పెట్టుబడులు, వందలాది పరిశ్రమలు, ఐటీ, ఫార్మా కంపెనీలు, లక్షలాది ఉద్యోగాలు వచ్చాయన్నారు. దీంతో హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందిందని.. దశాబ్దాల కృషితో ఈ స్థాయికి వచ్చిన విశ్వనగరంపైన బీజేపీ విషం చిమ్మే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 'బీజేపీ పుట్టకముందే మన తాత ముత్తాతలు శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి పండుగలను జరపలేదా? పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మలకు పూజలు చేయలేదా... కోడిని కోసి కల్లు పొయ్యలేదా? వీళ్లు మనకు హిందుత్వం గురించి నేర్పాలా?' అని పేర్కొన్నారు. అయోధ్యలో రాములవారి ప్రతిష్ఠకు 15 రోజుల ముందే బీజేపీ వాళ్లు దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలకు అక్షింతలు పంపించి ఓట్ల భిక్షం ఎత్తుకునే ప్రయత్నం చేశారన్నారు. విగ్రహ ప్రతిష్ఠకు ముందే అక్షింతలు పంచటం ఏమిటని సీఎం నిలదీశారు. 15 సెకన్ల సమయం ఇస్తే దేశంలోని మైనార్టీలను తుదముట్టిస్తామన్న బీజేపీ మహిళా ఎంపీ (నవనీత్ కౌర్)పై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, బీజేపీ నుంచి ఆమెను బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్య వంటివి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ జరిగిన 17 లోక్‌సభ ఎన్నికలు సంక్షేమం, అభివృద్ధి, దేశ భద్రత వంటి అంశాల ప్రాతిపదికన జరిగాయని సీఎం గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న 18వ లోక్‌సభ ఎన్నికలు వీటన్నింటికన్నా భిన్నమైనవని, మోదీ, అమిత్ షాల దాడితో రాజ్యాంగం, రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయని, ఈ నేపథ్యంలో వచ్చిన లోక్‌సభ ఎన్నికలు మనకు జీవన్మరణ సమస్య వంటివని రేవంత్ చెప్పారు. కాగా, గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరైన జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అభ్యర్థి ఎవరూ దొరకనట్టు, మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా ఇక్కడి రైతాంగాన్ని లాఠీలతో కొట్టించి, అవమానించిన వెంకట్రాంరెడ్డికి టికెట్ ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. టికెట్ కోసం కేసీఆర్, హరీశ్‌కు వెంకట్రాంరెడ్డి వందల కోట్ల రూపాయలను ముట్టజెప్పారని ఆరోపించారు.

13 సీట్లు మావే..!

- బీఆర్ఎస్‌కు ఒక్కటీరాదు.. 3చోట్ల బీజేపీతో పోటీ: మంత్రి ఉత్తమ్
- రాజ్యాంగాన్ని మార్చేందుకే 'ఇస్ బార్ చార్ సౌ' నినాదం
- రిజర్వేషన్లను ఎత్తేయాలని చూస్తున్న బీజేపీ: పొన్నం, శ్రీధర్



హైదరాబాద్, గోదావరిఖని/హుస్నాబాద్, మే 9: (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17సీట్లలో 13సీట్లు కాంగ్రెస్ పార్టీనే గెలవబోతున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటూ రాదన్నారు. 3సీట్లలో బీజేపీతో, ఒక్క సీటులో ఎంఐఎంతో తమకు పోటీ ఉంటుందని తెలిపారు. నల్లగొండ లోక్‌సభ సీటులో అత్యధిక మెజారిటీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు జనాలను మోసం చేసి మళ్లీ గెలవాలని చూస్తున్నాయని, తెలంగాణకు ఏం చేశారో ప్రధాని మోదీ చెప్పాలన్నారు. రిజర్వేషన్ల రద్దుపై బీజేపీ వాళ్లు చాలాసార్లు మాట్లాడారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆ పార్టీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఒక్క నిమిషం కూడా కరెంటు పోవడంలేదని, గతంలోకంటే నాణ్యమైన కరెంట్‌ను అందిస్తున్నామన్నారు. ఎన్నికలుకాగానే అర్హులకు రేషన్ కార్డులిస్తామని, ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులనూ ఆదుకుంటామని చెప్పారు. బీజేపీ 'ఇస్ బార్ చార్ సౌ' నినాదంతో ఎన్నికలకు వస్తోందని, పూర్తిస్థాయి మెజారిటీ సాధించడం ద్వారా రాజ్యాంగాన్ని మార్చడమే ఈ నినాదం వెనుకున్న ప్రధాన ఉద్దేశమని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. గురువారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీకి అదాని, అంబానీలతో సంబంధం ఉందని మోదీ ఆరోపిస్తున్నారని, ఆయన దగ్గరే కేంద్ర ప్రభుత్వం, వ్యవస్థలు ఉన్నాయని, అవన్నీ పని చేయడం లేదా అని ప్రశ్నించారు. రాహుల్ నీతివంతమైన నాయకుడని, ఆయన కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని కొనియాడారు. మరోవైపు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహించిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను ఎత్తేయాలని బీజేపీ భావిస్తోందని ఆరోపించారు. మోదీ పదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. ఆయన మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పకుండా అక్షింతలు వచ్చాయా..? రాముడు ఫొటో వచ్చిందా..? అంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మోదీ వేములవాడకు వస్తే ఆలయ అభివృద్ధికి ఏదైనా ఇస్తారనుకున్నాం కానీ ఒక కోడే కూడా ఇవ్వలేదని పొన్నం దుయ్యబట్టారు. అనంతరం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని ఓడిస్తేనే దేశంలో ప్రజాస్వామ్యానికి మనుగడ ఉంటుందని అన్నారు..

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ ఇవ్వండి

మళ్లీ నన్ను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించినా పర్వాలేదు కానీ..

- కష్టపడ్డ వారికే స్థానిక సంస్థల్లో అవకాశాలు
- 2 రోజులు విస్తృతంగా ప్రచారం చేయండి
- బీఆర్ఎస్‌తోనే కాంగ్రెస్‌కు ప్రధాన పోటీ
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి


మల్కాపూర్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

కొండాపూర్, మే 9: మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించినా పర్వాలేదు కానీ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌పై కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ ఇవ్వాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డి సమీపంలోని మల్కాపూర్ వద్ద ఓ ఫంక్షన్ హాలులో గురువారం నాడు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మెదక్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో కాంగ్రెస్‌కు 100 ఓట్ల మెజారిటీ తగ్గకుండా చూడాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారిని గెలిపించే బాధ్యత తనదేనని చెప్పారు. కష్టపడే వారికే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్ల ఎన్నికల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 13న పోలింగ్ ఉన్నందున రెండు రోజుల పాటు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. తమకు బీఆర్ఎస్‌తోనే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు, అధికారం లేనందువల్లనే ఓటమి చవిచూశామన్నారు. ప్రస్తుతం అధికారం ఉన్నందున నియోజకవర్గంలో పుష్కలమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. నియోజకవర్గంలో ఒక్క ఓటు తక్కువ వచ్చినా అవమానంగా భావించాల్సి వస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం గ్రామ, వార్డుస్థాయి నాయకులే భారం మోయాలని సూచించారు. తాను నాలుగు నియోజకవర్గాల్లో ప్రచారం చేసి తన వంతు భారం మోశానని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయదలచిన నాయకులు ఈ ఎన్నికల్లో తమ వంతు భారం భరించి భారీ మెజారిటీ ఇచ్చేందుకు కష్టపడాలన్నారు. ఈ రెండు రోజులు కష్టపడి నీలం మధును గెలిపించుకుంటే ఐదేళ్ల అభివృద్ధికి కాంగ్రెస్ కార్యకర్తలుగా మీకు మంచి పేరు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుసుమ్ కుమార్, తోపాజీ అనంతకిషన్, మనోజ్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కుమార్, నర్సింహారెడ్డి, అంజనేయులు, మునిపల్లి సత్యనారాయణ, రాంరెడ్డి, రఘుగౌడ్, మోతీలాల్, సంతోష్, బుచ్చిరాములు, వై.ప్రభు, జాన్సన్ పాల్గొన్నారు.



అదృష్టవశాత్తు రేవంత్ సీఎం అయ్యారు

రేవంత్‌రెడ్డి ఏదో అదృష్టవశాత్తు ముఖ్యమంత్రి అయ్యారు. కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారే తప్ప మమకారంతో కాదు. అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్ మాదిరిగానే నిరుద్యోగులు, రైతులు, యువతను మోసం చేశారు. జూన్ 4వ తేదీ తర్వాత రాష్ట్రంలో ఎవరూ ఊహించని విధంగా రాజకీయ మార్పులు జరుగుతాయి.

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్





ఎల్బీ స్టేడియంలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు

రిజర్వేషన్లపై రాహుల్ సినిమా ఫ్లాప్

- కేసీఆర్ మాటలను ప్రజలు పట్టించుకోవడం లేదు: కిషన్ రెడ్డి
- మత ప్రాతిపదికన దేశ విభజనకు కాంగ్రెస్ యత్నం: లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, బౌద్ధనగర్, తిమ్మాపూర్, బర్కత్‌పుర, హైదరాబాద్, హుస్నాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్నికల జిమ్మిక్కులు చేస్తూ బట్ట కాల్చి మొహమ్మీద వేసే ప్రయత్నం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రిజర్వేషన్ల అంశంపై డైరెక్ట్ చేసిన రాహుల్ గాంధీ సినిమా ఫ్లాప్ అయ్యిందని పేర్కొన్నారు. బీజేపీ మళ్లీ వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తోందంటూ కాంగ్రెస్ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలను ఏ ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. ఈసారి రాష్ట్రంలో డబుల్ డిజిట్‌లో స్థానాలు గెలుస్తామని, దీన్ని ఏ శక్తులూ అడ్డుకోలేవని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని సీతాఫల్‌మండిలో జరిగిన బైక్ ర్యాలీ సందర్భంగా, ఎల్బీ స్టేడియంలో శుక్రవారం జరగనున్న మోదీ సభ కోసం ఏర్పాట్ల పరిశీలన సందర్భంగా బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌తో కలిసి కిషన్ రెడ్డి మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా నారాయణపేట సభలో ప్రధాని మోదీ పాల్గొంటారని, సాయంత్రం 4గంటలకు ఎల్బీ స్టేడియంలో సభకు ఆయన హాజరవుతారని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో సభ తెలంగాణకు కీలకమైన సభ అని, తెలంగాణ సమాజాన్ని ఉద్దేశించి మోదీ ఎన్నికల సందేశాన్ని ఇస్తారని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ మాటలను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదని, నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న గాడిద గుడ్డు ప్రచారం చివరికి ఆ పార్టీకే పరిమితమవుతుందన్నారు. హైకమాండ్ ఆదేశాలతో 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రజలను కలిశామని, ప్రత్యర్థి పార్టీలు ఎన్ని తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు చేసినా బీజేపీ పార్టీకి ఢోకా లేదని ధీమా వ్యక్తం చేశారు. కాగా మత ప్రాతిపదికన దేశవిభజనకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని.. ఆ పార్టీ పుట్టినప్పటి నుంచి వారి చరిత్ర ఇదేనని లక్ష్మణ్ అన్నారు. భారత్‌పై శ్యాంపిత్రోడా చేసిన వ్యాఖ్యలు జాత్యాహంకారానికి నిదర్శనం అని, ఆయన వ్యాఖ్యలను రాహుల్, ప్రియాంక ఖండించలేదని.. దీన్నిబట్టి దేశం పట్ల వారికి ఉన్న గౌరవం ఏంటో తెలుస్తోందని పేర్కొన్నారు. శ్యాంపిత్రోడా రాజీనామా అనేది కేవలం డ్రామా అని, ఆయన్ను దేశం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా కాంగ్రెస్, బీఆర్ఎస్.. వేములవాడ రాజన్న ఆలయ సెంటిమెంటును దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్ సమీపంలోని అలగనూరు, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బండి సంజయ్ మాట్లాడారు. మోదీ మళ్లీ ప్రధాని కాకుంటే దేశంలో మనం బతికే పరిస్థితి ఉండదు అని హెచ్చరించారు. కాంగ్రెస్ దగ్గర ఉన్నవి ఫోన్ ట్యాపింగ్ పైసలేనని.. కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే ట్యాపింగ్ కేసును మూసివేయొచ్చునని చెప్పారు.

పదిస్తే ముస్లిం రిజర్వేషన్ల రద్దు

పైగా దేశంలోనే తెలంగాణను నంబర్‌వన్ చేస్తాం.. రేవంత్ వినూ.. ఈసారి డబుల్ డిజిట్ ఖాయం

- 3 విడతల్లోనే 200 ఎంపీ స్థానాలు
- మొత్తం 400సీట్లు కైవసం చేసుకుంటాం
- ఈ ఎన్నికల్లో అభివృద్ధికి, జిహాద్‌కు పోరు
- అయోధ్య మందిరాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్
- మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే: షా

యాదాద్రి, మే 9 (ఆంధ్రజ్యోతి): "సీఎం రేవంత్‌రెడ్డీ వినూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి తెలంగాణలో డబుల్ డిజిట్ స్కోరు సాధిస్తాం. మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో 200 సీట్లకు పైగా స్థానాలు గెలుస్తాం. దేశవ్యాప్తంగా 400 స్థానాలను కైవసం చేసుకుంటాం" అని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మోదీ మూడోసారి అధికారంలోకొస్తే రిజర్వేషన్లు రద్దవుతాయంటూ కాంగ్రెస్ అబద్ధాలను ప్రచారం చేస్తోందని, తద్వారా ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పదేళ్ల పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని నడిపామని.. మరి రిజర్వేషన్లు రద్దయ్యాయా? అని ప్రశ్నించారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేస్తూ, ఈ వర్గాల రిజర్వేషన్ల నుంచి ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు ఇస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం నుంచి 10 లోక్‌సభ స్థానాలను బీజేపీకి ఇస్తే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని, పైగా రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్ చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బీజేపీ ఎన్నికల ప్రచారసభలో అమిత్ షా మాట్లాడారు. ఈ ఎన్నికలు మోదీ, రాహుల్‌గాంధీకి మధ్య జరుగుతున్న పోరు అని.. దేశాభివృద్ధికి, జిహాద్‌కు మధ్య జరుగుతున్న పోరు అని చెప్పారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు చైనా గ్యారెంటీలు అని, మోదీవి భారతీయ గ్యారెంటీలు అని చెబుతూ మోదీ మేనిఫెస్టోలో ఏం చెప్పారో అవి తప్పకుండా అమలు చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 70ఏళ్లు అయోధ్యను పట్టించుకోలేదని, ఆ పార్టీ రామ మందిర నిర్మాణాన్ని వ్యతిరేకించిందని విమర్శించారు. కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా తయారైందని, ఆ పార్టీ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా దొరకడంలేదని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీకి సన్నిహితుడైన భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ సంతకాన్ని ఫోర్జరీచేసి సస్పెండ్ అయ్యారని, అయినప్పటికీ ఆయన కాళ్లు పట్టుకుని అభ్యర్థిగా నిలబెట్టారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, వరి రూ.500బోనస్, రైతు భరోసా కింద రూ.15వేలు, బాలికలకు స్కూటీలు, తదితర హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. ఏబీసీ (ఎంఐఎం నేత అసదుద్దీన్, బీఆర్ఎస్, కాంగ్రెస్) ఒక్కటేనని, షరియత్, ఖురాన్ ఆధారంగా తెలంగాణను నడిపిస్తున్నారని ఆరోపించారు. మజ్లిస్ బీఆర్ఎస్, కాంగ్రెస్ హైదరాబాద్ విమోచన దినం జరకుండా అడ్డుకుంటాయన్నారు.



భువనగిరిలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన బీజేపీ కార్యకర్తలు; అభివాదం చేస్తున్న అమిత్ షా



1500కోట్లతో టెక్స్‌టైల్స్ అభివృద్ధి

దేశవ్యాప్తంగా టెక్స్‌టైల్స్ పార్కుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు కేటాయించిందని, భువనగిరిలో టెక్స్‌టైల్స్ పరిశ్రమ ఏర్పాటుకు మోదీ కృషి చేశారని అమిత్ షా తెలిపారు. భువనగిరి నుంచి భూపాలపల్లి వరకు, సూర్యపేట-సిద్దిపేట వరకు రూ.140 కోట్లతో జాతీయ రహదారులను నిర్మించామని తెలిపారు. బీబీనగర్‌లో ఎయిమ్స్‌ను నిర్మించి పేద ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామని, జనగామ నుంచి భువనగిరి వరకు రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, కొమురవెల్లిలో అత్యాధునిక రైల్వే స్టేషన్ నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రసంగించే ముందు అమిత్ షా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి, స్వర్ణగిరి వెంకటేశ్వరస్వామి, కొమురవెల్లి మల్లన్న, జైన్ మందిర్‌లోని దేవుళ్లను తలుచుకున్నారు

నేడు, రేపు అగ్రనేతల సభలు!

- నేడు నారాయణపేటకు ప్రధాని మోదీ
- రేపు వనపర్తి, వికారాబాద్‌లలో షా సభలు
- తాండూరుకు ప్రియాంకా గాంధీ

మహబూబ్‌నగర్, వికారాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు అగ్రనేతల ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లు, బహిరంగ సభల్లో పాల్గొనున్నారు. ఇందుకు గాను ఆయా పార్టీలు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ నారాయణపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సభకు హాజరవుతారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే సభకు బయల్దేరతారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి మక్తల్, షాద్‌నగర్‌లో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లలో పాల్గొంటారు. కాగా, ఈ నెల 11న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు హాజరుకానున్నారు. అదే రోజు వికారాబాద్‌లో జరిగే బహిరంగ సభలోనూ పాల్గొంటారు. అదే రోజు తాండూరులో విలియమ్ మూన్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ప్రియాంకా గాంధీ బహిరంగ సభ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఒకేరోజు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలు ఎన్నికల ప్రచార సభలకు హాజరవుతుండడంతో ఒక్కసారిగా వికారాబాద్ జిల్లాలో రాజకీయ వేడి పెరిగింది. పోటాపోటీగా జన సమీకరణ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు సిద్ధమవుతున్నాయి.

మీకైతే 15 నిమిషాలు.. మాకు 15 సెకన్లు చాలు

- ఒవైసీ సోదరుల మైండ్ బ్లాంక్ చేస్తాం
- నవనీత్ కౌర్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ సిటీ/సంతోష్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో రాజకీయ పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. రెచ్చగొట్టే సవాళ్లు, ప్రతి సవాళ్లతో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ వచ్చిన బీజేపీ నాయకురాలు నవనీత్ కౌర్ ఒవైసీ సోదరులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో అక్బరుద్దీన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. "గతంలో ఛోటేమియా(అక్బరుద్దీన్) 15 నిమిషాలు పోలీసులు లేకుంటే తామేంటో చూపిస్తామని అన్నారు. మీకైతే 15 నిమిషాలు.. మాకు 15 సెకన్లు చాలు. ఒవైసీ బ్రదర్స్ ఎక్కడ నుంచి వచ్చారో.. ఎక్కడికి వెళ్లారో కూడా తెలియకుండా చేస్తాం" అని అన్నారు. బుధవారం చంపాపేటలోని లక్ష్మీగార్డెన్స్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సమ్మేళనంలో నవనీత్ కౌర్ మాట్లాడారు. హైదరాబాద్ పాతబస్తీ మరో పాకిస్తాన్‌లా మారకుండా ఆపాలంటే మాధవీలతను భారీ మెజారిటీతో గెలుపించుకోవాలన్నారు.

15 సెకన్లు కాదు.. గంట తీస్కోండి

- ప్రధాని మీ వాళ్లే.. ఆర్ఎస్ఎస్ మీదే
- మేం భయపడేది లేదు: ఎంపీ అసద్
- నవనీత్ కౌర్ వ్యాఖ్యలకు కౌంటర్



హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఒవైసీ సోదరులను ఉద్దేశించి అమరావతి ఎంపీ నవనీత్ కౌర్ చేసిన వ్యాఖ్యలపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. "15 సెకన్లు కాదు. నేను మోదీకి చెబుతున్నా.. నవనీత్ కౌర్‌కు గంట సమయం ఇవ్వండి. ఏం చేస్తారు మీరు..? ముఖ్తార్ అన్సారీ, పీలూ ఖాన్‌లను చంపినట్లు చంపేస్తారా..? మీలో మానవత్వం ఏమాత్రం ఉందో మేం కూడా చూడాలనుకుంటున్నాం..? మీకు భయపడేది లేదు. మేం సిద్ధంగా ఉన్నాం. ఢిల్లీలో మీ వాళ్లే ప్రధానిగా ఉన్నారు. ఆర్ఎస్ఎస్ మీదే. అన్ని వ్యవస్థలూ మీ చేతుల్లో ఉన్నాయి. మీకు నచ్చింది చేయండి" అని అసద్ అన్నారు. మోదీ.. భారతీయ ముస్లింలను పాకిస్థానీలు అనుకుంటారని ఒవైసీ విమర్శించారు. చొరబాటుదారులని ముస్లింలకు ముద్ర వేశారని మండిపడ్డారు. ముస్లిం మహిళలు ఎక్కువగా పిల్లల్ని కంటున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని అసద్ ధ్వజమెత్తారు.

6 గ్యారంటీలు మోసం.. వస్తువులు తప్పనిసరి!

- జనరేటర్లు, ఇన్వర్టర్లు, క్యాండిల్స్, టార్చిలైట్లు, పవర్ బ్యాంక్, చార్జింగ్ బల్బులు అత్యవసరం: కేటీఆర్

హైదరాబాద్ సిటీ, భైంసా, నిర్మల్, హైదరాబాద్ మే 9 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలు అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. జనరేటర్లు, ఇన్వర్టర్లు, కొవ్వొత్తులు, టార్చిలైట్లు, పవర్ బ్యాంక్‌లు, చార్జింగ్ బల్బులను మనం గ్యారంటీగా నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి తీసుకువచ్చిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వస్తే ఈ దుస్థితి వస్తుందని అసెంబ్లీ ఎన్నికల ముందే చెప్పామని.. కాంగ్రెస్ కావాలా? కరెంట్ కావాలా? తేల్చుకోవాలని సూచించామని గుర్తుచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పలుచోట్ల నిర్వహించిన ఆత్మీయ, యువ, మైనారిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని ఆయా వర్గాల ప్రజలతో మాట్లాడారు. మల్కాజ్‌గిరి, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో యువతతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని.. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి జ్ఞాని నివేదితకు మద్దతునివ్వాలని కోరారు. తెలంగాణలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని, కరెంట్, నీళ్లు ఇచ్చేందుకు చేతనైతలేదు కానీ సినిమాల్లో విలన్లలా 'పేగులు మెడలేసుకుంటా.. లంకె బిందెలున్నాయనుకున్నా' అని అడ్డమైన డైలాగులు చెబుతున్నాడని విమర్శించారు. మోదీతో కొట్లాడే ధైర్యం రాహుల్‌కు లేదని, ప్రాంతీయ శక్తులే బలంగా మోదీని నిలువరించగలుగుతాయని పేర్కొన్నారు. కేంద్రపాలిత ప్రాంతం చేస్తే హైదరాబాద్ ఆగమవుతుందని, మన జుట్టు ఢిల్లీ వాడి చేతిలో పెట్టినట్టే అన్నారు. ఈ కుట్రలను అడ్డుకోవాలంటే, బీజేపీని గల్లా పట్టి అడగాలంటే బీఆర్ఎస్ గళం పార్లమెంట్‌లో ఉండాలని, 10-12 మంది ఎంపీలను గెలిపిస్తే మళ్లీ రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసించే పరిస్థితి వస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే.. తెలంగాణ కోసం తెగించి కొట్లాడేది బీఆర్ఎస్ అని, బీజేపీ, కాంగ్రెస్‌తో లాభం లేదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనం సభలో కేటీఆర్ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ మాటలు.. 'ఓ స్త్రీ రేపు రా' అన్న పద్ధతిలో ఉన్నాయని.. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు హామీల అమలు గురించి రేవంత్‌రెడ్డి నెలలు, తారీఖులు చెబుతున్నారని చురకలంటించారు. రాష్ట్రం కోసం కొట్లాడే బీఆర్ఎస్‌కే మద్దతివ్వాలని కోరారు. ఓల్డుబోయినపల్లిలో ముస్లిం మైనారిటీల సమావేశం, భైంసా, నిర్మల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనంటూ కాంగ్రెస్ విషప్రచారం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. "మేం బీజేపీతో కలిస్తే నా చెల్లెలు కవిత జైల్లో ఉండేదేనా?" అని ప్రశ్నించారు. బీజేపీతో తామెప్పుడూ జతకట్టలేదని.. భవిష్యత్తులోనూ జతకట్టబోమని ఆయన తేల్చిచెప్పారు. బీజేపీతో కలిస్తే ప్రాణం పోయినట్టేనని వ్యాఖ్యానించారు.



నిర్మల్ జిల్లా భైంసా రోడ్ షోలో ప్రసంగిస్తున్న కేటీఆర్

భ్రమల్లో రాహుల్

తెలంగాణ రైతాంగానికి వేయని రైతుభరోసా డబ్బులు వేసినట్టుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అబద్ధాలు చెబుతున్నారని కేటీఆర్ 'ఎక్స్'లో మండిపడ్డారు. "ఎంతకాలం ఇలా అసత్యాలు మాట్లాడతారు? ఆయన భ్రమల్లో ఉన్నారా?" అని ప్రశ్నించారు. అలాగే.. గతంలో ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తానన్న బడాభాయ్ ఆ డబ్బు వేయలేదని ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్ర రైతాంగానికి రూ.15 వేలు ఇస్తానన్న ఛోటాభాయ్ (రేవంత్‌రెడ్డి) కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇంకెన్ని రోజులు అసత్యాలపై కాంగ్రెస్ స్వారీ అని నిలదీశారు.

కేటీఆర్‌పై రాళ్లు, టొమాటోలు, ఉల్లిగడ్డలు

నిర్మల్ జిల్లా భైంసాలో గురువారం రాత్రి రోడ్‌షో నిర్వహించిన కేటీఆర్‌కు నిరసన సెగ తగిలింది. 'జై శ్రీరామ్' అంటే కడుపు నిండుతుందా?' అంటూ ఆయన గతంలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా హనుమాన్ దీక్షధారులు, పలు హిందూ సంఘాలు ఏకమై రోడ్‌షోను అడ్డుకున్నాయి. 'గో బ్యాక్ కేటీఆర్' అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించాయి. పోలీసు వలయాన్ని ఛేదించుకుని ప్రచార రథం వద్దకు దూసుకొచ్చాయి. ఆ సమయంలో కొందరు కేటీఆర్‌పైకి రాళ్లు, టమాటలు, ఉల్లిగడ్డలు విసిరేశారు. రథంపై ఉన్న బీఆర్ఎస్ నేతలు అవి కేటీఆర్‌కు తగలకుండా రెండు చేతులూ అడ్డుపెట్టి కాపాడే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ శ్రేణులు సైతం ఎదురు తిరిగారు. 'జై శ్రీరామ్.. జై బీఆర్ఎస్' నినాదాలు హోరెత్తి, పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారులను, బీఆర్ఎస్ శ్రేణులను చెదరగొట్టారు. మతం పేరిట అల్లర్లకు దిగుతూ వేసే చిల్లర వేషాలకు బెదిరేది లేదని కేటీఆర్ తేల్చి చెప్పారు. మరోవైపు.. ఆందోళనకారులు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య జరిగిన ఘర్షణలో షేక్ వాజిద్ (26) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించారు.

రేవంత్, కేసీఆర్, కేటీఆర్‌పై చర్యలు తీసుకోండి

- సీఈవో వికాస్‌రాజ్‌కు వీహెచ్‌పీ నేతల వినతి

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా.. ఆ రెండు పార్టీల నేతలపై చర్యలు తీసుకోవాలని చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ నేతలు సీఈవో వికాస్‌రాజ్‌ను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోటీ పడి అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం, శ్రీరామనవమి వేడుకలు, హనుమాన్ జయంతి శోభాయాత్రలపై విమర్శలు చేయడం తగదన్నారు. అయోధ్య అక్షింతలు కంట్రోల్ బియ్యంతో చేసినవని తుక్కుగూడ బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారని సీఈవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జై శ్రీరామ్ అంటే ఉద్యోగం వస్తుందా? పొలాలకు నీళ్లు వస్తాయా? అంటూ మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ ఎగతాళి చేశారని తెలిపారు. కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ విచక్షణ కోల్పోయి హిందూత్వంపై దూషణలు చేస్తున్నారని చెప్పారు.

రూ.301 కోట్ల సొత్తు స్వాధీనం

- నేటితో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తి: ఈసీ

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల కోడ్ ప్రారంభమైన నాటి నుంచి గురువారం వరకు రూ.301.03 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, బంగారం, చీరలు, ఇతర వస్తు సామగ్రి పట్టుబడినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు 2,64,043 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా అందులో 2,29,072 మంది అర్హత పొందారని, వారిలో 2 లక్షల మందికి పైగా ఓటు వేశారని పేర్కొంది. గురువారం సాయంత్రంతో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ముగియనున్నట్లు తెలిపింది. కోడ్ ఉల్లంఘించినందుకు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులపై 8,481 ఎఫ్ఐఆర్‌లు నమోదయినట్లు ఈసీ వెల్లడించింది.

మోదీ, రేవంత్ ఒక్కటయ్యారు!

- ఇందుకు వంద ఆధారాలున్నాయ్..
- వారి నడుమ మధ్యవర్తిత్వం రాహుల్‌దే
- ప్రజల దృష్టి మరల్చేందుకే 'ట్యాపింగ్' కథనాలు
- ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డబుల్ డిజిట్..
- 'మీట్ ది ప్రెస్'లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): 'బీఆర్ఎస్ లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కటయ్యారు. ఇందుకు వంద ఆధారాలున్నాయ్.. అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్రం తీసుకున్న నిర్ణయాలు రేవంత్‌కు లబ్ధి చేకూర్చేలా ఉన్నాయి' అని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. బడే భాయ్, ఛోటే భాయ్‌ల నడుమ మధ్యవర్తిత్వం చేస్తున్నది రాహుల్ గాంధీయేనన్నారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 'ఆర్ ట్యాక్స్ వసూలు చేసి ఢిల్లీకి రేవంత్ సంచులు మోస్తున్నాడని మోదీ చేసిన ఆరోపణల్లో నిజముంటే కేంద్రం ఆధీనంలోని ఈడీ, సీబీఐలు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. ఢిల్లీలో కూర్చొని కాళేశ్వరంపై కేంద్ర నిపుణుల కమిటీ రూపొందించిన నివేదిక బయటపెట్టడం మోదీ, రేవంత్ మధ్య అవగాహనలో భాగమేనన్నారు. గోదావరి జలాలను తమిళనాడుకు అప్పగించేందుకు మోదీ కుట్ర చేస్తున్నారని.. కృష్ణా, గోదావరి జలాలపై ఇక్కడి ప్రజల హక్కులను కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. రిజర్వేషన్ల తొలగింపును సమర్థించే ప్రసక్తే లేదని, ముస్లిం మైనార్టీ రిజర్వేషన్లపై గతంలో మేం చేసిన శాసనసభా తీర్మానానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కేంద్రం నిధులిస్తేనే గ్యారెంటీల అమలంటూ రేవంత్ మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. 'రాష్ట్ర బడ్జెట్ పబ్లిక్ డాక్యుమెంట్.. నిధుల లభ్యత, కేటాయింపుల వివరాలన్నీ అందులో ఉంటాయి.. అయినా ఇష్టానికి హామీలిచ్చి.. అమలు చేయలేక కేంద్రం మీద నెపం నెట్టేసి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నారు' అని విమర్శించారు. హామీలు అమలు చేయలేక ఫోన్ ట్యాపింగ్ కథనాలు వండి వారుస్తున్నారని, సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ఇదంతా చేస్తున్నారని దుయ్యబట్టారు.

ప్రజల చూపు బీఆర్ఎస్ వైపే..

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ డబుల్ డిజిట్ స్థానాల్లో గెలుస్తుందని జగదీశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 'కొట్లాడి సాధించుకున్న తెలంగాణ భవిష్యత్తు బీఆర్ఎస్ చేతుల్లోనే ఉంది.. రాష్ట్రానికి పార్టీ చరిత్రాత్మక అవసరం. కేసీఆర్ బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీల్లో భయం కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మోసపోయామని భావిస్తున్న ప్రజలు ఇప్పుడు బీఆర్ఎస్ వైపే చూస్తున్నారు. అధికార పార్టీ నేతల మాటలు ఎక్కడా ప్రజోపయోగకరంగా లేవు. ఇందుకు కోమటిరెడ్డి బ్రదర్స్ వ్యాఖ్యలే నిదర్శనం. స్వార్థ ప్రయోజనాలు తప్ప.. వాళ్లకు ప్రజల కోసం ఆలోచించే అలవాటు లేదు. నేనెప్పుడూ వ్యక్తిగత ఆరోపణలు చేయను.. వాళ్లలా చెత్త వాగుడు వాగను..' అని వ్యాఖ్యానించారు.

వికసిత్ భారత్ కాదు.. విఫల భారత్

- సబ్ కా సత్యనాశ్.. దేశ్ కా సత్యనాశ్
- మోదీ భావోద్వేగాల బ్లాక్‌మెయిల్ ప్రమాదకరం
- 150 హామీల్లో ఒక్కటీ నెరవేర్చని ప్రధాన మంత్రి
- ఓట్ల కోసం మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప పేదలకు చేసిందేమీ లేదు: కేసీఆర్



కరీంనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "పుల్వామా, పాకిస్థాన్ పేరు చెప్పి బ్లాక్‌మెయిల్ చేస్తూ మోదీ పదేళ్లు పూర్తి చేసుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భావోద్వేగాల బ్లాక్‌మెయిల్ ఇలాగే కొనసాగితే దేశం సర్వనాశనమవుతుంది. దండం పెట్టి చెబుతున్నా.. విద్యావంతులు, విద్యార్థులు, మేధావులు, రచయితలు దీనిపై ఆలోచించాలి" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లో గురువారం రాత్రి నిర్వహించిన బస్సు యాత్ర, రోడ్ షో సందర్భంగా ఆయన మాట్లాడారు. పదేళ్ల కిందట 150 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన మోదీ వాటిలో ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. "విదేశాల్లోని నల్ల డబ్బులు తీసుకొచ్చి ఒక్కో ఇంటికి 15 లక్షలు ఇస్తామన్నారు. బండి సంజయ్ తెచ్చి ఇచ్చారా!? మీ ఖాతాల్లో జమయ్యాయా!? 15 లక్షలు కాదు కదా.. 15 వేలు కూడా ఇవ్వలేదు. మోదీ హామీలన్నీ గ్యాస్.. ట్రాష్. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ జరగలేదు. సబ్ కా సత్యనాశ్.. దేశ్ కా సత్యనాశ్ చేశారు. వికసిత్ భారత్ కాలేదు. కానీ విఫల భారత్ అయింది" అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మోదీకి ముందు 14 మంది ప్రధాన మంత్రులు చేశారని, వారంతా 55 లక్షల కోట్ల అప్పు చేస్తే మోదీ ఒక్కడే 105 లక్షల కోట్ల అప్పు చేశారని, రూపాయి విలువ పడిపోయిందని, ఎగుమతులు తగ్గాయని విమర్శించారు. ఓట్ల కోసం మత విద్వేషాలు రెచ్చగొట్టడమే తప్ప పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలని కోరితే మోదీ సర్కార్ స్పందించలేదని ఆరోపించారు. బండి సంజయ్ లొడలొడా వాగుతాడని, పార్లమెంట్‌లో ఆయన మాట్లాడితే ఎవరికీ అర్థం కాదని, ఆయన మాట్లాడేది ఇంగ్లీషో.. హిందీయో, తెలుగో తెలియదని ఎద్దేవా చేశారు. అర చేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా 420 హామీలు ఇచ్చిందని, వాటిలో ఏవైనా అమలయ్యాయా అని ప్రశ్నించారు. మహిళలకు రూ.2,500, కల్యాణలక్ష్మికి తులం బంగారం ఇచ్చారా అని అడిగారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీని అమలు చేసినా.. మహిళలు సర్కస్‌లో మాదిరిగా కొట్లాడుకుంటున్నారని, వారే ఈ ఉచితం ఎందుకని తిరస్కరిస్తున్నారని తప్పుబట్టారు. తమ పాలనలో విద్యుత్తు, తాగు నీరు ఇచ్చామని, నాలుగు నెలల్లోనే ఈ దుస్థితి చూస్తుంటే కళ్లలో నీరు తిరుగుతున్నాయని అన్నారు. ఎకరాకు 15 వేల రైతుబంధు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఐదెకరాలు దాటిన వారికి ఇచ్చేది లేదని అంటున్నారని, దున్నే వారికే ఇస్తామంటున్నారని, వీటి కోసం మళ్లీ లంచాలిచ్చి అధికారుల చుట్టూ తిరగాలా? అని నిలదీశారు. ఐదెకరాలపైన భూమి ఉన్న రైతులు ఏం పాపం చేశారని కేసీఆర్ ప్రశ్నించారు. రైతుబంధును ఎత్తివేసేందుకే ఇలా మాట్లాడుతున్నారన్నారు. ఈ పరిస్థితులన్నీ చూస్తే పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ ప్రభుత్వం ఉంటదా.. ఊడుతుందా అర్థం కావట్లేదని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి ఇప్పటికే మోసపోయామని, మళ్లీ మోసపోతే మరిన్ని ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.



అబ్ కీ బార్?

2019 లోక్‌సభ ఎన్నికల్లో..

బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
4,41,321	3,46,141	92,606
బొర్లకుంట వెంకటేశ్	ఆగం చంద్రశేఖర్	సోగాల కుమార్


పురుషులు	7,87,140
మహిళలు	8,05,755
ఇతరులు	101
మొత్తం ఓటర్లు	15,92,996

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

కాంగ్రెస్
పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి, చెన్నూర్ మంచిర్యాల, బెల్లంపల్లి

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?

కాంగ్రెస్	6,82,033
బీఆర్ఎస్	3,73,156
బీజేపీ	79,324



కోల్ 'బెల్టు' దక్కేదెవరికో!

సింగరేణి కార్మికులే ప్రధాన ఓటు బ్యాంకు. వారే అన్ని పార్టీల ఎజెండా. దళితుల ఓట్లూ కీలకంగా ఉన్న పెద్దపల్లి నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యమంటూ కాంగ్రెస్, డిపెండెంట్ ఉద్యోగాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్, ఎస్సీ వర్గీకరణ అంశంతో బీజేపీ జనంలోకి వెళ్తున్నాయి. మరి.. కోల్ బెల్టు ఓటర్లు అనుభవానికి పట్టం కడతారా? లేక యువనేతకు చాంపియన్‌షిప్ బెల్టు అప్పగిస్తారా..?

పెద్దపల్లి ఎంపీ స్థానంలో హోరాహోరీ.. హ్యాట్రిక్ సాధించాలని బీఆర్ఎస్ తహతహ

- పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ఆరాటం
- ఖాతా తెరిచేందుకు బీజేపీ పోరాటం
- మూడు ప్రధాన పార్టీలకూ సింగరేణి కార్మికుల సమస్యలే ప్రచారాస్త్రాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంటు స్థానంలో ఇప్పటివరకు ముఖాముఖి పోరే జరిగింది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత రెండుసార్లు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వరుస విజయాలు సాధించింది. ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ఆ పార్టీ నాయకత్వం భావిస్తోంది. అయితే గతం నుంచీ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న పెద్దపల్లిలో మరోసారి తమ జెండా ఎగురవేసి తమ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని హస్తం పార్టీ నేతలు భావిస్తున్నారు. మరోవైపు ఈసారైనా పెద్దపల్లిలో ఖాతా తెరవాలని బీజేపీ పోరాటం చేస్తోంది.

మూడోతరం నాయకుడిగా వంశీకృష్ణ..

కాంగ్రెస్ నుంచి చెన్నూర్ ఎమ్మెల్యే జి.వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ తొలిసారి బరిలోకి దిగారు. ఇక్కడి నుంచి నాలుగుసార్లు ఎంపీగా గెలిచిన గడ్డం వెంకటస్వామి (కాకా) రాజకీయ వారసుడిగా తొలుత వివేక్ 2009లో గెలుపొందారు. ఇప్పుడు వంశీకృష్ణను బరిలో దించారు. వాస్తవానికి ఆయనను అసెంబ్లీ ఎన్నికల్లోనే చెన్నూరు నుంచి నిలపాలని, వివేక్ లోక్‌సభకు పోటీ చేయాలని భావించారు. కానీ, అధిష్ఠానం సూచనతో చెన్నూర్ బరిలో నిలిచారు. పెద్దపల్లి పరిధిలోని అన్ని సెగ్మెంట్లలో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేయడంతో తాజా ఎన్నికల్లో వంశీ గెలుపు నల్లేరు మీద నడకేనని ఆ పార్టీ నేతలు అంటున్నారు. కేంద్ర మంత్రిగా వెంకటస్వామి సింగరేణి ప్రైవేట్ పరం కాకుండా కాపాడారని, కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించారని ప్రజలకు వంశీ వివరిస్తున్నారు. వివేక్ ఎంపీగా ఉన్నప్పుడు.. ఎఫ్‌సీఐని, ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం ఆర్ఎఫ్‌సీఎల్‌గా పునర్ నిర్మించేందుకు పోరాటం చేశారని, తెలంగాణ కోసం పార్లమెంట్‌లో వాణి వినిపించారని గుర్తు చేస్తున్నారు. 6 గ్యారంటీల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల్లోకి వెళుతున్నారు.

సుదీర్ఘ అనుభవంతో కొప్పుల

బీఆర్ఎస్ తరఫున సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మాజీ మంత్రి, ఒకప్పుడు సింగరేణి కార్మికుడు అయిన కొప్పుల ఈశ్వర్‌ను కేసీఆర్ రంగంలోకి దింపారు. పాత మేడారం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2004, 2008లో, పునర్విభజనతో ఏర్పడ్డ ధర్మపురి నుంచి 2009, 2010, 2014, 2018లో వరుసగా ఆరుసార్లు కొప్పుల ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవలి ఎన్నికల్లో ఓడిపోయారు. తెలంగాణ తెచ్చిన పార్టీగా బీఆర్ఎస్, పదేళ్ల పరిపాలనలో సాధించిన ప్రగతి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి, సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు, వారి సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి ఈశ్వర్ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి స్థానికేతరుడని, అందుబాటులో ఉండే తమకే ఓటు వేయాలని కోరుతున్నారు.



మోదీ కరిష్మాతో..

బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గోమాసే తొలుత కాంగ్రెస్ టికెట్ ఆశించారు. అవకాశం దక్కలేదు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రోద్బలంతో బీజేపీలో చేరి మూడు రోజుల్లో టికెట్ తెచ్చుకున్నారు. శ్రీనివాస్ 2009 ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున ఓడిపోయారు. ఇక్కడ పార్టీకి పెద్దగా క్యాడర్ లేదు. ప్రధాని మోదీ ఇమేజ్, అయోధ్య రామాలయం తదితర అంశాలపై ప్రచారం చేస్తున్నారు. స్థానికతను బలంగా వినిపిస్తున్నారు. సామాజిక న్యాయం బీజేపీతోనని, మాదిగలను కాంగ్రెస్, బీఆర్ఎస్ విస్మరించాయని ప్రచారం చేస్తున్నారు.

సింగరేణి కార్మికులు, దళితుల ఓట్లే కీలకం..

పెద్దపల్లిలో అభ్యర్థుల గెలుపోటములను సింగరేణి కార్మికులు, దళితులే నిర్ణయించనున్నారు. మొత్తం 15.92 లక్షల ఓట్లలో దళితులు 4 లక్షలకు పైగా ఉన్నారు. వీరిలోనూ మాదిగలు అధికంగా ఉన్నారు. ఇక పెద్దపల్లి, మంచిర్యాల ప్రాంతంలో సింగరేణి కార్మికులు 28 వేల మంది, కాంట్రాక్టు కార్మికులు 30 వేల మంది, ఇతర పరిశ్రమల్లో 50 వేల మంది వరకు ఉన్నారు. వారి కుటుంబాలతో కలుపుకొని 2 లక్షల మంది వరకు కార్మికుల ఓట్లే ఉంటాయి. ఈ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు వివిధ హామీలు ఇస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదాయ పన్ను నుంచి కార్మికులను మినహాయించాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉండడంతో.. దీనిపైనా అభ్యర్థులు హామీ ఇస్తూ వస్తున్నారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రస్తావిస్తున్నారు.



రోడ్డు వేసే వరకూ ఓట్లు వేయం

అది మండల కేంద్రం.. మునిసిపాలిటీ కూడా! మునిసిపాలిటీలోని ఓ వార్డులో భాగమైన తండా! అయినా.. ఎనిమిది దశాబ్దాలుగా ఆ తండాకు రోడ్డు లేదు! కౌన్సిలర్ నుంచి ఎంపీ వరకూ గిరిజన నేతలే ఉన్నా.. ఆ గిరిజన ప్రాంతాన్ని పట్టించుకునే దిక్కు లేదు. అందుకే.. ఎన్నికల వేళ ఆ గ్రామస్థులు ఊరి చివర ఫ్లెక్సీ పెట్టారు. తండాకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేదని, రోడ్డు ఏర్పాటు చేసే వరకు ఓట్లు వేసేది లేదని తేల్చి చెప్పారు. వారే.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మునిసిపల్ పరిధిలోని సిగ్నల్‌తండావాసులు! పార్లమెంటు ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. దాంతో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తండాకు వెళ్లిన తహసీల్దార్ కృష్ణవేణి రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు.

- డోర్నకల్

ఓటు కోసం కోటి విద్యలు!



జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో మిర్చి బజ్జీలు వేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సిద్దిపేట జిల్లా కోహెడలో కూరగాయల దుకాణం వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్



ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మగ్గం నేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కడ గెలుపు ఒక్కసారే!

నాలుగు పార్లమెంటు స్థానాల్లో ఏ పార్టీకీ.. వరుసగా రెండోసారి దక్కని విజయం

ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, నాగర్ కర్నూల్‌లో ప్రతిసారీ విలక్షణ తీర్పు ఇస్తున్న ఓటర్లు

ఈ ఎన్నికల్లోనూ అదే ఒరవడి కొనసాగిస్తారా!

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్ల స్పందన భిన్నంగా ఉంటుంది. ఇది ఇప్పటికే పలుమార్లు రుజువైంది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో పైచేయి సాధించిన పార్టీ.. లోక్‌సభ స్థానాన్ని దక్కించుకోలేకపోయిన సందర్భాలు ఉన్నాయి. అదే సమయంలో ఒక్క ఎమ్మెల్యేను కూడా గెలుచుకోలేకపోయిన పార్టీ.. ఎంపీ స్థానాన్ని దక్కించుకోవడమూ చూశాం. అయితే రాష్ట్రంలోని కొన్ని పార్లమెంటు స్థానాల్లో మాత్రం ఎమ్మెల్యేలుగా ఏ పార్టీ వారు గెలిచారనే దానితో సంబంధం లేకుండా ఒక్కోసారి ఒక్కో పార్టీ అభ్యర్థి ఎంపీగా గెలుపొందుతున్నారు. ఆయా స్థానాల్లో ఏ పార్టీ కూడా వరుసగా రెండుసార్లు విజయం సాధించిన దాఖలాలు లేవు. తాజా ఎన్నికల్లోనూ అదే ఒరవడి కొనసాగుతుందా? లేక ప్రజలు మరోసారి అదే పార్టీని గెలిపిస్తారా? అన్నది చూడాల్సి ఉంది. ఇటువంటి పార్లమెంటు స్థానాల్లో ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, నాగర్ కర్నూల్ ముందున్నాయి. ఆదిలాబాద్‌లో గత 20 ఏళ్లలో ఒకసారి గెలిచిన పార్టీ మళ్లీ గెలవలేదు. ఈ స్థానం నుంచి 2004 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున టి.మధుసూదన్‌రెడ్డి ఎంపీగా గెలుపొందారు. ఆ తర్వాత 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో ఈ స్థానాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. ఆ పార్టీ అభ్యర్థిగా అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి విజయం సాధించారు. తిరిగి ఏడాదికే జరిగిన 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానంగా మారగా.. టీడీపీ తరఫున రమేశ్ రాథోడ్ గెలిచారు. అనంతరం తెలంగాణ ఏర్పాటయ్యాక 2014లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గోడెం నగేశ్ ఎంపీగా గెలుపొందారు. తిరిగి 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు విజయం సాధించారు. కాగా, ఈసారి బీజేపీ సిటింగ్ ఎంపీ అయిన బాపురావుకు టికెట్ ఇవ్వకుండా గోడెం నగేశ్‌ను పార్టీలో చేర్చుకొని బరిలోకి దించింది. ఖమ్మం పార్లమెంట్ స్థానంలో కూడా 2004 నుంచి ఓటర్లు ప్రతిసారీ భిన్నమైన తీర్పునిస్తున్నారు. కరీంగనగర్, నిజామాబాద్ ఎంపీ స్థానాల్లో 2009 నుంచి 2019 వరకు మూడు ఎన్నికల్లో మూడు వేర్వేరు పార్టీల అభ్యర్థులు గెలుపొందారు. తాజా ఎన్నికల్లో ఈ నియోజకవర్గాల్లో ఓటరు తీర్పు ఎలా ఉంటుందో జూన్ 4న తేలనుంది.

గత మూడు ఎన్నికల్లో భిన్న ఫలితాలు వచ్చిన స్థానాలు..

పార్లమెంటు స్థానం	2009లో గెలిచిన పార్టీ	2014లో గెలిచిన పార్టీ	2019లో గెలిచిన పార్టీ
కరీంనగర్	కాంగ్రెస్ (పొన్నం ప్రభాకర్)	బీఆర్ఎస్ (బి.వినోద్‌కుమార్)	బీజేపీ (బండి సంజయ్)
నిజామాబాద్	కాంగ్రెస్ (మధు యాష్కీ)	బీఆర్ఎస్ (కల్వకుంట్ల కవిత)	బీజేపీ (ధర్మపురి అరవింద్)
నాగర్ కర్నూల్	టీడీపీ (మందా జగన్నాథం)	కాంగ్రెస్ (నంది నంది ఎల్లయ్య)	బీఆర్ఎస్ (పోతుగంటి రాములు)
ఖమ్మం	టీడీపీ (నామా నాగేశ్వర్‌రావు)	వైసీపీ (పొంగులేటి శ్రీనివాసరెడ్డి)	బీఆర్ఎస్ (నామా నాగేశ్వర్‌రావు)
ఆదిలాబాద్	టీడీపీ (రమేశ్ రాథోడ్)	బీఆర్ఎస్ (గోడెం నగేశ్)	బీజేపీ (సోయం బాపురావు)

తొలిసారి మోదీతో కలిసి విమానమెక్కా

అమెరికాలో వైట్‌హౌస్ ముందు ఫొటో దిగాం.. ప్రధాని అయ్యాక ఆ ఫొటో గురించి అడిగారు

గుండెజబ్బుల పిల్లల కోసం మందకృష్ణతో కలిసి ఉద్యమం.. దాని నుంచే ఆరోగ్యశ్రీ పుట్టింది.. కరోనా కాలంలో నెలరోజులు ఆఫీసులోనే ఉండి ప్రజలకు సాయం అందించా

ప్రముఖ నటుడు చిరంజీవితో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాటామంతి.. అసెంబ్లీలో కిషన్‌రెడ్డి నుంచి సభామర్యాద నేర్చుకున్నా: చిరంజీవి





అమెరికాలో మోదీతో కిషన్‌రెడ్డి (ఫైల్)

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కురువృద్ధ నేత ఎల్ కే అద్వానీ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఏపీ నుంచి తనకు, గుజరాత్ నుంచి నరేంద్రమోదీకి అమెరికా వెళ్లే అవకాశం వచ్చిందని.. ఆ విధంగా తొలిసారిగా విమానంలో మోదీతో కలిసి ప్రయాణించానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ప్రముఖ నటుడు చిరంజీవి గురువారం ఢిల్లీలో పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్న అనంతరం కిషన్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారు ముచ్చటించుకున్నారు. కిషన్‌రెడ్డి తన రాజకీయ జీవితం తొలినాళ్ల సంగతులను చెబుతూ అప్పట్లో జరిగిన ఆసక్తికర విషయాలను తెలియజేశారు. 'అమెరికా ప్రభుత్వ సంస్థ 'అమెరికన్ కౌన్సిల్ ఆఫ్ యంగ్ పొలిటికల్ లీడర్స్' వివిధ దేశాలకు చెందిన యువ రాజకీయ ప్రతినిధులను తమ దేశానికి ఆహ్వానించి దేశ ప్రగతిని వివరిస్తుంది. అద్వాణీ సూచన మేరకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నన్ను ఎంపిక చేశారు. కర్ణాటక నుంచి అనంతకుమార్, గుజరాత్ నుంచి నరేంద్రమోదీకి అవకాశం లభించింది. అప్పట్లో నాకు పాస్‌పోర్టు కూడా లేదు. అమెరికా వెళ్లాక మోదీతో కలిసి వైట్ హౌస్ ముందు నిలబడి ఫోటో దిగాము. ఆ భవనం గురించి మోదీ వివరించారు. అప్పటి ఫొటోను నేను భద్రపరచుకున్నా. మోదీ ప్రధాని అయ్యాక తొలిసారి వైట్‌హౌస్‌కు రమ్మని ఆయనకు అమెరికా ప్రభుత్వం ఆహ్వానం పంపింది. ప్రధాని నాకు ఫోన్ చేసి పాత ఫోటో గురించి అడిగితే పంపించా. అప్పుడు మనం బయట నిలబడి ఫొటో దిగాం.. ఇప్పుడు నేను వైట్‌హౌస్ లోపలికి వెళ్తున్నా.. అని ప్రధాని మోదీ అన్నప్పుడు చాలా గర్వంగా అనిపించింది' అని కిషన్ రెడ్డి తెలిపారు. 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన సంగతులను గుర్తు చేసుకుంటూ.. మందకృష్ణ మాదిగ వివిధ జిల్లాల్లో తిరుగుతున్నప్పుడు గుండె జబ్బులున్న పిల్లలు చికిత్స అందక చాలామంది చనిపోయారని తెలిసిందని, దీంతో గుండె జబ్బులున్న పిల్లల తల్లిదండ్రులతో హైదరాబాదులో ఒక మీటింగ్ పెట్టామని తెలిపారు. అక్కడికి తీసుకొచ్చిన ఓ చిన్నారి చనిపోవటంతో.. ఆ చిన్నారి మృతదేహంతో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపామని, రాత్రి 10 గంటలకు సీఎం వైఎస్సార్ ఫోన్ చేసి పిల్లలకు ఆపరేషన్లు చేయిస్తానని హామీ ఇచ్చారని వెల్లడించారు. 'మరుసటి రోజు వైఎస్సార్‌ను కలిసి చర్చించాం. ఆయన ప్రభుత్వ వైద్యులను పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశారు. ఈ క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్వే చేపట్టగా దాదాపు 2 లక్షల మంది చిన్నారులు గుండె జబ్బుతో బాధ పడుతున్నారని తెలిసింది. అప్పుడు వారందరికీ ఇన్సూరెన్స్ కల్పించాలని నిర్ణయించారు. ఆ ఆలోచన నుంచే ఆరోగ్యశ్రీ పుట్టింది' అని కిషన్ రెడ్డి తెలిపారు.

కిషన్‌రెడ్డి దుర్భాషలాడగా చూడలేదు: చిరంజీవి

తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక శాసనసభలో కిషన్‌రెడ్డి నుంచి ఎంతో నేర్చుకున్నానని చిరంజీవి తెలిపారు. 'అసెంబ్లీలో నేతల ప్రవర్తన కొత్తగా అనిపించేది. అధికార, ప్రతిపక్ష నాయకులు ఒకరిపై ఒకరు అరుచుకుంటూ, దుర్భాషలాడుతూ ఉండేవారు. కానీ, సమావేశాలయ్యాక అసెంబ్లీ లాబీల్లో మాత్రం కలిసిమెలిసి, ఒకరి భుజంపై ఒకరు చేయి వేస్కొని సరదాగా మాట్లాడుతుండటం చూసి ఆశ్చర్యపోయేవాడ్ని' అని చిరంజీవి తన అనుభవాలు పంచుకున్నారు. అసెంబ్లీలో తనకు ఒకవైపు కిషన్‌రెడ్డి, మరోవైపు జయప్రకాష్ నారాయణ్ ఉండేవారన్నారు. సభలో కిషన్‌రెడ్డి ఎన్నడూ దుర్భాషలాడగా చూడలేదని, ప్రజా సమస్యలపైనే ఆయన మాట్లాడేవారని తెలిపారు. ఒకరకంగా సభా మర్యాదలను మీ నుంచే నేర్చుకున్నా అని కిషన్‌రెడ్డికి చిరంజీవి చెప్పారు. కరోనా సమయంలో సినీ పరిశ్రమ కార్మికులకు తనవంతు సాయం చేశానన్నారు.

కరోనా కాలంలో కంట్రోల్ రూం

కరోనా సమయంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా ఉన్నానని, ప్రజలను ఆదుకునేందుకు 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సహాయం అందించానని కిషన్ రెడ్డి చెప్పారు. 'నెలరోజుల పాటు ఆఫీసులోనే పడుకున్నా. వీలైనంత ఎక్కువమందికి సహాయం అందించడం గురించి చర్చిస్తూ ఉండేవాడిని. ఢిల్లీనుంచి ఆక్సిజన్ సిలిండర్లు తెప్పించి ఆసుపత్రులకు పంపేవాళ్లం. గాంధీ ఆసుపత్రిలో కరోనా చికిత్స తీసుకుంటున్న వారిని ప్రత్యక్షంగా కలిసి వారికి అందుతున్న వైద్యం గురించి డాక్టర్లతో మాట్లాడేవాడిని. ఇదంతా చూసి మా కుటుంబసభ్యులు నా క్షేమం గురించి ఆందోళన చెందేవారు. డాక్టర్లు, నర్సులు, పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తుంటే నేను ఇంట్లో ఎలా కూర్చోగలను? నేనుసైతం బయటకొచ్చి, బాధితులకు సాయం అందించేందుకు శాయశక్తులా కృషి చేశా' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీలో తనకంటూ ప్రత్యేకంగా గ్రూపులు లేవన్నారు. ఇప్పటి వరకు తన కుటుంబ సభ్యులెవరినీ రాజకీయంగా ప్రోత్సహించలేదని, భవిష్యత్తులో వస్తారేమో తెలియదని చెప్పారు.

వైసీపీ అభ్యర్థుల్లో 87 మందిపై క్రిమినల్ కేసులు

- టీడీపీలో 42 మందిపై కూడా
- బరిలో 604 మంది కోటీశ్వరులు
- తొలిస్థానంలో చంద్రబాబు
- మూడోస్థానంలో సీఎం జగన్
- ఏపీ ఎన్నికలపై ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, మే 9(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 175 మంది వైసీపీ అభ్యర్థుల్లో 87 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ జాబితాలో టీడీపీ అభ్యర్థులు 42 మంది ఉండగా, బీజేపీ నుంచి 8 మంది, జనసేన పార్టీ అభ్యర్థులు 10 మంది ఉన్నారు. ఇక, 604 మంది కోటీశ్వరులు అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. వీరిలో వైసీపీ, టీడీపీ, జనసేన తదితర ప్రాంతీయ పార్టీల తరఫున 307 మంది కోటీశ్వరులు ఎన్నికల బరిలో నిలిచారు. వైసీపీ తరఫున 165, టీడీపీ నుంచి 134, జనసేన తరఫున 18, బీజేపీ నుంచి 8, కాంగ్రెస్ నుంచి 79, సీపీఎం, సీపీఐ నుంచి ఒక్కొక్కరు చొప్పున కోటీశ్వరులు పోటీ చేస్తుండడం గమనార్హం. వీరిలో 323 మంది రూ.5 కోట్ల కంటే ఎక్కువగా ఆస్తులు ఉన్నాయి. పోటీలో ఉన్న మొత్తం అన్ని పార్టీల అభ్యర్థుల సగటు ఆస్తి రూ.8.02 కోట్లుగా ఉంది. ఇక, తాజా ఎన్నికల్లో 229(10%) మంది మహిళలు పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో 193 మంది పోటీ చేయగా ఈసారి ఆ సంఖ్య పెరిగింది. ఈ మేరకు అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా అసోషియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్), ఏపీ ఎలక్షన్ వాచ్ ఈ వివరాలను తమ నివేదికలో వెల్లడించాయి.


మొత్తం అభ్యర్థుల్లో 543 మందిపై క్రిమినల్ కేసులు, 374 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. గత 2019 ఎన్నికల్లో క్రిమినల్ కేసులు ఉన్నవారి సంఖ్య 331 కాగా ఇప్పుడు వీరిసంఖ్య పెరిగింది. తీవ్రమైన క్రిమినల్ కేసులకు సంబంధించి గత ఎన్నికల్లో 220 మందిపై కేసులుండగా, ఇప్పుడు 374మందిపై ఉన్నాయి. వైసీపీ 87, టీడీపీ 42, కాంగ్రెస్ 42, జనసేన 10, బీజేపీ 8, సీపీఎం, సీపీఐలో ఐదుగురి చొప్పున అభ్యర్థులపై క్రిమినల్ కేసులన్నాయి. మొత్తం అభ్యర్థుల్లో వీరు 23% మంది ఉన్నారు. తీవ్రమైన నేరాలకు సంబంధించి వైసీపీ 49, టీడీపీ 85, కాంగ్రెస్ 20, జనసేన 7, బీజేపీ 5, సీపీఎం 3, సీపీఐ ఇద్దరు అభ్యర్థులపై కేసులున్నాయి.

మొత్తం 89 మంది అభ్యర్థులపై మహిళలపై దాడులకు సంబంధించిన కేసులుండగా వీరిలో నలుగురిపై అత్యాచార కేసులు నమోదయ్యాయి. 16 మందిపై హత్య(సెక్షన్ 302), 70 మందిపై హత్యాయత్నానికి(సెక్షన్ 307) సంబంధించిన కేసులున్నాయి.

అత్యధికంగా ఆస్తులున్న అభ్యర్థులలో టీడీపీ అధినేత చంద్రబాబుకి రూ.931 కోట్ల ఆస్తులున్నాయి. రూ.824 కోట్లతో నెల్లూరు సిటీ బరిలో ఉన్న టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ రెండో స్థానంలో ఉన్నారు. వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ రూ.757 కోట్ల ఆస్తితో మూడో స్థానంలో ఉన్నారు.

అత్యధికంగా సీఎం జగన్ కుటుంబానికి ఏడాదికి రూ.73 కోట్లు ఆదాయం ఉంది. జగన్ ఒక్కరికే ఏడాదికి రూ.57 కోట్ల ఆదాయం ఉంది. రెండో స్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థి జనార్ధన్‌రెడ్డి కుటుంబానికి రూ.37 కోట్లు, వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కుటుంబానికి రూ.34 కోట్ల ఆదాయం ఉంది.





Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శుక్రవారం 10 మే 2024
diksuchi@andhrajyothy.com

తొలి 'ప్లాస్టిక్ కాలుష్య నివారణ చట్టం'

ప్రపంచ దేశాల కసరత్తు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ప్రతి రంగంలోనూ అత్యంత అనుకూల ఆధునిక ఆవిష్కరణ 'ప్లాస్టిక్.' అదే సమయంలో అన్ని రకాల కాలుష్యాలకు 'ప్లాస్టిక్' ప్రధాన కారణం అవుతోంది. వైద్య, పారిశ్రామిక, నిత్యావసర, సరుకు రవాణా... ఇలా అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు కారణమైన ప్లాస్టిక్ నేడు మానవాళి మనుగడకే సవాలు విసురుతోంది.



రోజు రోజుకూ పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను భూమి పైపొర శోషించుకోలేకపోతోంది. దాంతో భూగర్భ జలమట్టాలు అడుగంటిపోతున్నాయి. నదులు, తీరప్రాంతాల నుంచి సముద్రాల్లోకి ప్లాస్టిక్ చేరుతోంది. అలల తాకిడికి, సూర్యరశ్మి ప్రభావంతో మైక్రో ప్లాస్టిక్‌గా విచ్ఛిన్నమై సముద్ర ఆవరణ వ్యవస్థ కలుషితం అవుతోంది. ఫలితంగా సముద్ర జీవుల మనుగడకు ప్రమాదం ముంచుకొస్తోంది. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు గాలి, నీరు, మట్టి, ఆహార పదార్థాలను కలుషితం చేస్తూ మానవ, జంతు, వన్యప్రాణి ఆహార గొలుసుల్లోకి చొచ్చుకుపోతున్నాయి.

- మైక్రో ప్లాస్టిక్స్ వల్ల మానవులు క్యాన్సర్లు వంటి ప్రమాదకర రోగాల బారిన పడుతున్నారు. భూతాపం కూడా పెరుగుతోంది. ప్లాస్టిక్ తయారీ సమయంలో విడుదలయ్యే కర్బన ఉద్గారాలు, ప్రపంచ కర్బన ఉద్గారాల్లో ప్రస్తుతం 5 శాతంగా ఉన్నాయి. ఇదేవిధంగా నియంత్రణ రహితంగా ఉన్నట్లయితే 2050 నాటికి ఇవి 20 శాతానికి చేరుకోవచ్చని అంచనా. ప్లాస్టిక్ ఉత్పత్తి 2060 నాటికి ప్రస్తుతమున్న స్థాయి కంటే మూడురెట్లు పెరుగుతుందని అంచనా. మొత్తం ప్లాస్టిక్ కాలుష్యంలో 40 శాతంగా ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అత్యధికంగా కాలుష్యానికి కారణమవుతోంది. ఓఈసీడీ(ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ అండ్ కోఆపరేషన్) అంచనాల ప్రకారం వార్షిక ప్లాస్టిక్ ఉత్పత్తి ప్రపంచవ్యాప్తంగా 460 మిలియన్ టన్నులు. దీనిలో కేవలం 9 శాతం మాత్రమే ప్లాస్టిక్ రీసైక్లింగ్ జరుగుతోంది.
- ఒక ప్లాస్టిక్ వ్యర్థం భూమిలో పూర్తిగా కలిసిపోవడానికి సుమారు 20 నుంచి 500 సంవత్సరాలు పడుతుంది. ఆ ప్లాస్టిక్ మెటీరియల్, సూర్యరశ్మి తదితర వాతావరణ అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఇన్ని రకాల దుష్ప్రభావాలను చూపే ప్లాస్టిక్ ఉత్పత్తి, వినియోగంపై ప్రపంచవ్యాప్తంగా పటిష్ఠవంతమైన నియంత్రణలు తీసుకురావాల్సిన తక్షణ అవసరం ఎంతైనా ఉంది. ఆ కోవలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొట్టమొదటి ప్రపంచ స్థాయి ఒప్పందాన్ని ఈ ఏడాది చివరినాటికి తీసుకువచ్చేందుకు ఏప్రిల్ మూడోవారంలో ప్రపంచ నాయకులు కెనడా రాజధాని ఒట్టావాలో సమావేశం అయ్యారు. గత ఏడాది నవంబరులో నైరోబీలో నిర్వహించిన సమావేశంలో తలెత్తిన భిన్నాభిప్రాయాలను పరిష్కరించడం, దక్షిణకొరియాలో జరగనున్న చివరి రౌండ్ చర్చల్లో ఏకాభిప్రాయం సాధించడమే ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఉద్దేశించారు.

అందులో భాగంగా 175 దేశాలకు చెందిన ప్రతినిధులు, పర్యావరణవేత్తలు, పారిశ్రామికరంగ ప్రతినిధులు ఒట్టావా సమావేశానికి హాజరయ్యారు.

- వాస్తవానికి 2022లో నిర్వహించిన ఐక్యరాజ్య సమితి ఎన్విరాన్‌మెంటల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న దేశాలు... ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించేందుకు 2024 చివరినాటి కల్లా ఒక సమగ్ర ఒప్పందాన్ని రూపొందించాలనే అంగీకారానికి వచ్చాయి. ఇందులో భాగంగా ఉరుగ్వే, ఫ్రాన్స్, నైరోబీ, కెనడా, దక్షిణకొరియాలో సమావేశమై 2024 చివరినాటికల్లా ఒక సమగ్ర ఒప్పందాన్ని తీసుకురావడానికి ప్రణాళిక రచించారు. అయితే పెట్రో కెమికల్ ఉత్పత్తిదేశాలు, వ్యాపార వర్గాలు, కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ ఒప్పందంలోని ఉత్పత్తి నియంత్రణ అంశాలపై కొన్ని అభ్యంతరాలను లేవనెత్తాయి. మరి కొన్ని దేశాలు మాత్రం విభిన్న ప్రణాళికలతో ముందుకు వస్తున్నాయి. సౌది అరేబియా, ఇరాన్, ఇండియా, చైనా వంటి ప్లాస్టిక్, పెట్రో కెమికల్ ఉత్పత్తిదేశాలు(ప్లాస్టిక్ పెట్రో కెమికల్స్ నుంచి ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నాయి) 'లైక్ మైండెడ్ కంట్రీస్'గా జతకూడాయి. ఈ దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తిపై విధించే ఆంక్షలపై అభ్యంతరం తెలుపుతున్నాయి. ఈ దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తి కంటే పునర్వినియోగం, రీసైక్లింగ్‌పై దృష్టిసారించాలని డిమాండ్ చేస్తున్నాయి.
- జపాన్, యురోపియన్ యూనియన్ దేశాలు; మరికొన్ని ద్వీప దేశాలను కలిగి ఉన్న 60 దేశాల 'హై యాంబిషన్ గ్రూప్' మాత్రం 2040 నాటికి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని అభిలషిస్తోంది. అమెరికా వంటి దేశాలు 2040 నాటికి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతంచేయాలని చెబుతూనే... హై యాంబిషన్ గ్రూప్‌లా కాకుండా దేశాల వారీగా తమ సొంత ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని, ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన ప్రమాణాలతో తమ ప్రణాళికలను అనుసంధానపర్చుకోవాలని అభిప్రాయపడుతున్నాయి.
- ఈ భిన్నాభిప్రాయాల నేపథ్యంలో ఒక ఉమ్మడి అంగీకారానికి రావడం కత్తిమీద సాము వంటి వ్యవహారమే. అయితే, అత్యధిక జనాభా ఉన్న భారతదేశంలో ఏటా 35 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో కేవలం 8 శాతం మాత్రమే రీసైక్లింగ్‌కు వెళుతున్నాయి. పైగా ఇప్పటికే ప్రపంచంలో అన్ని రంగాలు ప్యాకేజింగ్, వస్తుపరమైన సౌలభ్యతల వల్ల ప్లాస్టిక్‌పై భారీగా ఆధారపడ్డాయి. ఒక్కసారిగా ప్లాస్టిక్ ఉత్పత్తిపై నియంత్రణలు విధిస్తే అవి అనేక రంగాలపై ఆర్థిక, మనుగడపరమైన సమస్యలు రేకెత్తించే అవకాశం ఉంది. కాబట్టి పలు చటి, హానికర, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విషయంలో ఉత్పత్తిపరమైన ఆంక్షలు విధించినా, మిగతా ప్లాస్టిక్ ఉత్పత్తులపై రీసైక్లింగ్, పునర్ వినియోగం వంటి వ్యూహాలను పటిష్ఠంగా రూపొందించాల్సిన అవసరం ఉందని, ప్రత్యామ్నాయ వస్తువులను, అలాగే వస్తు పరిశోధనలను ప్రోత్సాహించాలని పర్యావరణ వేత్తలు భావిస్తున్నారు. ఈ అంశాలపరంగా ప్రాథమిక చర్యలు తీసుకున్న తరవాత, క్రమంగా కొత్త ప్లాస్టిక్ ఉత్పత్తులపై ఆంక్షలు విధించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించే దిశగా ప్రయత్నాలు సఫలం అవుతాయన్నది నిపుణుల సూచన.
- ఏది ఏమైనా, అంటార్కిటికా ఖండంలో మానవ సంచారం లేని ప్రాంతాలకు కూడా ప్లాస్టిక్ చేరుతోంది. చివరికి తల్లిపాలల్లో సైతం మైక్రో ప్లాస్టిక్ రూపంలో చేరిపోతోందన్న పరిశోధనలు కాలుష్య ఉధృతికి అద్దంపడుతున్నాయి. ఒకవైపు జలమట్టాలు అడుగంటి బెంగళూరు వంటి మహానగరాలు అల్లాడటానికి, వర్షపు నీరు భూమిలో ఇంకక ఇవే నగరాలు వరదల్లో మునిగిపోవడానికి గల కారణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమేయం భారీగానే ఉంది. క్యాన్సర్ క్యాపిటల్‌గా భారత్ మారబోతోందన్న వార్తల్లో అతిశయోక్తి లేదు. ఈ పరిస్థితులన్నీ ప్రపంచవ్యాప్తంగా ఒక పటిష్ఠవంతమైన ప్లాస్టిక్ కాలుష్య నివారణ చట్టాన్ని తీసుకురావాల్సిన తక్షణ అవసరాన్ని చాటిచెబుతున్నాయి.

ఒట్టావా సమావేశం

కెనడా రాజధాని ఒట్టావాలో ఏప్రిల్ 23 నుంచి 29 వరకు 'ఇంటర్ గవర్నమెంటల్ నెగోషియేటింగ్ కమిటీ' 4వ సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్య నివారణ, ప్లాస్టిక్ ఉత్పత్తిపై నిషేధం విధించడానికి ప్రపంచదేశాలకు ఒక నిర్ణీత కాలపరిమితితో కూడిన లీగల్లీ బైండింగ్(చట్టబద్ధ) గడువుపై ఏకాభిప్రాయం సాధించడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యం.

- అయితే 'హై-యాంబిషన్ గ్రూప్' దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేయడం ద్వారా మాత్రమే కాలుష్యాన్ని నివారించగలమని, కాబట్టి ప్లాస్టిక్ ఉత్పత్తిని నిలిపివేసేందుకు దేశాలకు లీగల్లీ బైండింగ్ గడువు నిర్ణయించాలని వాదించాయి. కాగా, 'లైక్ మైండెడ్ దేశాలు'గా వ్యవహరిస్తున్న పెట్రో కెమికల్స్ ఉత్పత్తి దేశాలు మాత్రం పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ ఉత్పత్తి నిషేధాన్ని వ్యతిరేకించాయి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు పూర్తిస్థాయిలో ఇంకా అభివృద్ధి కానందున వాటి ఉత్పత్తిపై పూర్తి నిషేధం నిర్హేతుకమని వాదిస్తున్నాయి.
- రెండు గ్రూపుల దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరనందున ఈ సమావేశం ప్రధానలక్ష్యం పరంగా ముందడుగు పడలేదు. అయితే ప్లాస్టిక్ సంబంధిత ఉద్గారాలు, ఉత్పత్తి, వ్యర్థాల నిర్వహణ, సమస్యాత్మక, నివారించదగ్గ ప్లాస్టిక్ రకాలు వంటి వాటిపై(సవివర అంచనాలతో(డీటైల్డ్ అసెస్‌మెంట్స్) ముందుకు రావడానికి అన్ని దేశాలు అంగీకరించడం కొసమెరుపు.
- ఈ ఏడాది నవంబరులో దక్షిణకొరియాలోని బుసాన్‌లో ప్లాస్టిక్ కాలుష్య నివారణ కోసం 5వ, చివరి సంప్రదింపుల సమావేశం జరగనుంది. ఇప్పటివరకు నిర్వహించిన నాలుగు సమావేశాల్లో కుదరని ఏకాభిప్రాయం ఈ చివరి సమావేశంలోనైనా సాధిస్తేనే ప్లాస్టిక్ కాలుష్య నివారణ ఒప్పందం సాకారమవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

టీఎస్ సెట్ - 2024

జాబ్ కార్నర్

తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీఎస్ సెట్)-2024 నోటిఫికేషన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసింది. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ నియామకాలకు అర్హత సాధించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు.

సబ్జెక్టులు: జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్-1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ(ఎంఏ, ఎమ్మెస్సీ), ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్ఈ, ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: గరిష్ఠ వయోపరిమితి లేదు

పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత టెస్ట్(సీబీటీ) పద్ధతిలో జరిగే పరీక్షకు రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

పరీక్ష ఫీజు: ఓసీలకు రూ.2000. బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ, వీహెచ్, హెచ్ఐ, ఓహెచ్, ట్రాన్స్‌జెండర్‌లకు రూ.1000.

పరీక్ష కేంద్రాలు: ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూలు, కరీంనగర్, ఖమ్మం, తిరుపతి, మహబూబ్‌నగర్, వైజాగ్, నల్లగొండ

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: మే 14 **చివరి తేదీ:** జూలై 2

పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 28 నుంచి 31 వరకు

వెబ్‌సైట్: http://telanganaset.org/index.html



నలంద యూనివర్సిటీలో మాస్టర్స్

న్యూఢిల్లీలోని నలంద యూనివర్సిటీ - మాస్టర్స్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంబీఏలో ఏడాది కోర్సు పూర్తిచేసిన తరవాత డిప్లొమాతో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. అభ్యర్థులకు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం తప్పనిసరి.

ప్రోగ్రామ్‌లు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** హిందూ స్టడీస్(సనాతన), వరల్డ్ లిటరేచర్, హిస్టారికల్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారిటివ్ రెలిజియన్స్
- **ఎంబీఏ స్పెషలైజేషన్:** సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్:** ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్

అర్హత వివరాలు: హ్యూమానిటీస్/సైన్సెస్/ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/లా విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. ఎంబీఏ కోర్సుకు క్యాట్/ఎక్స్ఏటీ/మ్యాట్‌లో కనీసం 70 శాతం స్కోర్ సాధించి ఉండాలి. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు అయిదేళ్ల అనుభవం ఉంటే చాలు. ఏ కోర్సులో ప్రవేశానికైనా అభ్యర్థులు కనీసం 250 పదాలతో సెల్ఫ్ ఇంట్రడక్షన్/బయో-నోట్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ కింద ఈ యూనివర్సిటీలో చేరడానికి గల కారణాన్ని 100 పదాల్లో; ప్రోగ్రామ్‌ని ఎంచుకోవడానికిగల కారణాన్ని 300-500 పదాల్లో రాసి పంపాలి. విదేశీ (నాన్ ఇంగ్లీష్ కంట్రీస్) అభ్యర్థులు ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ ప్రూఫ్ కింద టోఫెల్/ఐఈఎల్‌టీఎస్ స్కోర్ కార్డ్ సబ్మిట్ చేయాలి.

ఎంపిక: స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, సెల్ఫ్ ఇంట్రడక్టరీ నోట్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విదేశీ అభ్యర్థులకు ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూ కూడా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** nalandauniv.edu.in



ఏపీ ఆర్‌జీయూకేటీ అడ్మిషన్స్

ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)- ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్‌కే వ్యాలీ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నారు. ఇందులో మొదట రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు(పీయూసీ) తరవాత నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తానికి 80 క్రెడిట్స్ నిర్దేశించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పీయూసీ సబ్జెక్టులు: మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, తెలుగు/హిందీ/సంస్కృతం/ఫారిన్ లాంగ్వేజ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయాలజీ

బీటెక్ విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్.

సీట్ల వివరాలు: ఒక్కో క్యాంపస్‌లో 1000 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం ప్రతి క్యాంపస్‌లో అదనంగా 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు.

అర్హత వివరాలు: ఈ ఏడాది ఏపీ/టీఎస్ ప్రభుత్వం నిర్వహించిన పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 4 శాతం వెయిటేజీ ఉంటుంది. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే.

ముఖ్య సమాచారం

- **ట్యూషన్ ఫీజు:** పీయూసీ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.45,000; బీటెక్ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.50,000 చెల్లించాలి. తెలుగు రాష్ట్రాలు మినహా ఇతర రాష్ట్రాల అభ్యర్థులు ట్యూషన్ ఫీజు కింద ఏడాదికి రూ.1,50,000లు చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 25
- **స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూలై 1 నుంచి 6 వరకు
- **అభ్యర్థుల సెలెక్షన్ లిస్ట్ విడుదల:** జూలై 11
- **జనరల్ అభ్యర్థుల డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** నూజివీడు, ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లకు ఎంపికైన వారికి జూలై 22, 23; ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనవారికి జూలై 24, 25; శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైన వారికి జూలై 26, 27
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ వేదికలు:** నూజివీడు, ఆర్‌కే వ్యాలీ, శ్రీకాకుళం క్యాంపస్‌లు
- **వెబ్‌సైట్:** www.rgukt.in

లిటిల్స్



కొడుకులకు పరీక్ష పెట్టిన నాన్న!

సోమయ్య అనే వ్యక్తి ఉండేవాడు. కష్టపడి పని చేసేవాడు. పండిన పంటను అమ్మి తన కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు నలుగురు కొడుకులు. వారంతా సోమరులు. ఏ పని చేసేవాళ్లు కాదు. నాన్న కాయా కష్టం మీద బతికేవాళ్లు. అది అతనికి నచ్చేది కాదు. ఎలాగైనా పిల్లలను ప్రయోజకుల్ని చేయాలని కలగనేవాడు. అయితే వారు మాత్రం సోమరులుగానే ఉండేవాళ్లు.

ఆ రైతుకు జబ్బు చేసింది. వయసుపైబడింది. దీంతో మంచానికే పరిమితమయ్యాడు. ఒక రోజు తన నలుగురు కొడుకులను పిలిచాడు. 'ఇక నా పని అయిపోతోంది. చేసినన్ని రోజులు కష్టపడ్డాను. ఇక ఓపిక లేదు. మీరు ఎలా బతుకుతారో ఏమో' అన్నాడు. నలుగురు కొడుకులు కిందకి తల దించుకుని ఉన్నారు. 'ఓరి బడవల్లారా.. మీకో విషయం చెబుతా. బాగుపడండి. మన చేనులో ఓ కుండ ఉంది. అందులో బంగారు నాణేలు ఉన్నాయి' అన్నాడు. అందరి ముఖాలు వెలిగిపోయాయి. 'నేను ఆ బంగారు నాణేలను కుండలో ఎక్కడ పూడ్చిపెట్టానో మర్చిపోయా. చేనును తవ్వి తీసుకోండి' అన్నాడు. ఆ మాటలు వినగానే కష్టజీవుల్లా అందరూ చేనుకు పయనమయ్యారు. మట్టిలో వెతకటం ప్రారంభించారు. రెండు రోజుల పాటు వెతికి ఆయాసంతో తండ్రి దగ్గరకు వచ్చారు.


రైతు విషయం తెలుసుకున్నాడు. అవునా! అయితే ఓ పని చేయండి. ఎలాగూ మట్టిని తవ్వారు కాబట్టి మీరు విత్తనాలు చల్లండి అన్నాడు. ఆ కొడుకులు వెంటనే సంతకు పోయి మంచి విత్తనాలు తీసుకొచ్చారు. అదృష్టవశాత్తూ వానపడింది. పదును అయిన నేలలో విత్తనాలను చల్లేసరికి పంట మొలకెత్తింది. ఇంకో వాన పడటంతో పంట బాగా పండింది. కొంత ధాన్యం ఇంట్లోకి తీసుకుని మిగతాది సంతలో అమ్ముకొచ్చారు. మంచి లాభం వచ్చింది. ఈ విషయం తండ్రి దగ్గరకు వచ్చి చెప్పారు. 'మీరు కష్టపడండి. చేనులో కుండలేదు. అసలు బంగారం లేనే లేదు. మీరు కష్టపడి పని చేస్తే ఇలా చేను పండుతుంది. బంగారం లాంటి ధాన్యం మీ చేతులోకి వస్తుంది. మీ కాళ్లమీద మీరు నిలదొక్కుకుంటారు' అంటూ రైతు చెప్పాడు. పిల్లలకు విషయం అర్థమైంది. సిగ్గుపడ్డారు. ఆ రోజు నుంచి తండ్రిమాట జవదాటకుండా కష్టపడ్డారు.

సరైన నీడ ఏది?




10 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 303

	8				4	9		
	7		9			8		
5		3						
	1			3		4		8
3				2				6
8		4		7			3	
						3		9
		8			7		2	
		6	8				5	

సుడోకు - 302 సమాధానం

8	2	5	3	9	4	1	7	6
9	6	7	2	1	8	5	3	4
4	1	3	5	7	6	2	9	8
7	3	1	8	2	9	6	4	5
2	9	4	7	6	5	8	1	3
5	8	6	1	4	3	9	2	7
6	4	8	9	3	2	7	5	1
1	5	2	4	8	7	3	6	9
3	7	9	6	5	1	4	8	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.